బలగం TV
BALAGAM
నిజమే మా బలం..ప్రజలే మా బలగం
BALAGAM TV DIGTAL NEWS PAPER/ balagamtv100@gmail.com
హైదరాబాద్ | శుక్రవారం జూన్ 5 2026 | balagamtv100@gmail.com | పేజీలు-8

## ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టుకు గ్రీన్ సిగ్నల్



**బలగం టీవీ, ఆదిలాబాద్**

ఆదిలాబాద్ ఎయిర్ పోర్టుకు కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది . ఎయిర్ పోర్టుకు 1580 ఎకరాలు ఇవ్వడానికి సిద్ధమైన రాష్ట్ర సర్కార్ ప్రతిపాదన లేఖను రక్షణ శాఖ జాయింట్ సెక్రెటరీ మహంతికి ఎమ్మెల్యే పాయల్ శంకర్ అందించారు. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన లేఖ పట్ల సానుకూలత తెలిపింది కేంద్రం. రక్షణ శాఖ చెందిన 400 ఎకరాలు, రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే1580 ఎకరాలు కలిపి1980 ఎకరాల్లో ఎయిర్ ఫోర్స్ స్టేషన్, ఎయిర్ పోర్టు నిర్మాణానికి సానుకూలంగా ఉన్నట్లు కేంద్రం తెలిపింది. కేంద్రం నిర్ణయంపై సంతోషం వ్యక్తం చేశారు ఎమ్మెల్యే పాయల్ శంకర్. ఎయిర్ పోర్ట్ నిర్మాణంపై సానుకూలంగా ఉన్న ప్రధాని మోడీ, సీఎం రేవంత్ కు ఎమ్మెల్యే పాయల్ శంకర్ కృతజ్ఞతలు తెలిపారు.

# కొడంగల్ ఎత్తిపోతలతో

# లక్ష ఎకరాలకు సాగునీరు

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- పాజెక్టు పనుల పురోగతిపై ముఖ్యమంత్రి రేవంత్ పరిశీలన
- త్వరగా పనులు పూర్తి చేయాలని అధికారులకు ఆదేశం



**బలగం టీవీ,నారాయణపేట**

మక్తల్ నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతల పథకం ద్వారా లక్ష ఎకరాలకు సాగునీరు అందుతుందని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి తెలిపారు. బీమా కృష్ణా నదులపై నిర్మించనున్న ప్రాజెక్టు పనుల పురోగతిపై గురువారం ముఖ్యమంత్రి బెంగుళూరు నుంచి నేరుగా మక్తల్ చేరుకోగా ఉత్తమ్ కుమార్ రెడ్డి, దామోదర రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరిలకు జిల్లా కలెక్టర్ సిహెచ్ ప్రియాంక ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఇరిగేషన్ ప్రాజెక్టులపై ఫోటో గ్యాలరీని ముఖ్యమంత్రి వీక్షించారు. మక్తల్ నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతల పథకం భీమా కృష్ణా నదులపై ప్రతిపాద బ్యారేజీ పనులు పురోగతికి సంబంధించిన ఫోటో ఎగ్జిబిషన్ ప్లాన్ మ్యాప్స్ ద్వారా ముఖ్యమంత్రికి వివరించిన ఇరిగేషన్ అధికారులు. క్షేత్రస్థాయి ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి మక్తల్ మండలం కాట్రేవు పల్లి గ్రామ సమీపంలో కొనసాగుతున్న మక్తల్ నారాయణ పేట కొడంగల్ ఎత్తిపోతల ప్యాకేజ్ -1 పనులను గురువారం పరిశీలించారు. ప్యాకేజ్ -1 లో భాగంగా జరుగుతున్న పంప్ హౌస్ పనులు ఎంత శాతం పూర్తయ్యాయని అధికారులను అడిగి తెలుసుకున్నారు. కాంక్రీటు పనులను ప్రారంభించి వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, కర్ణాటక రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి బోసు రాజు, జిల్లా మంత్రులు జూపల్లి కృష్ణారావు, డాక్టర్ వాకిటి శ్రీహరి, కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక, ఇరిగేషన్ కార్యదర్శి శ్రీదర్, చీఫ్ ఇంజనీరు. ఏ సత్య నారాయణ రెడ్డి, సూపరింటెండెంట్ ఇంజినీర్ హెచ్.టి శ్రీధర్, ఉన్నారు.

## పాలమూరు ప్రాజెక్టులపై సీఎం రేవంత్ సమీక్ష




**పలు ప్రాజెక్టులను ఏరియల్ సర్వే చేసిన సిఎం**

**ప్రాజెక్టుల స్థితిగుతలపై అధికారులతో ఆరా**

**బలగం టీవీ, మహబూబ్‌నగర్**

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని అన్ని ప్రధాన సాగునీటి ప్రాజెక్టులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమశిలలో ఉన్నతస్థాయి సమీక్ష చేపట్టారు. మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి,దామోదర రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, ప్రణాళికా బోర్డు వైస్ చైర్మన్ చిన్నారెడ్డి, ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లు, ఉన్నతాధికారులు ఇందులో పాల్గొన్నారు.

జిల్లా పరిధిలోని కీలక సాగునీటి ప్రాజెక్టుల పనులను వేగవంతం చేయడంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో విస్తృతంగా ఏరియల్ సర్వే నిర్వహించారు. ముఖ్యమంత్రి , మంత్రుల బృందం పాలమూరు జిల్లాలోని పలు ప్రధాన సాగునీటి ప్రాజెక్టులను ఆకాశ మార్గం ద్వారా క్షుణ్ణంగా పరిశీలించింది. ముఖ్యంగా కోయిల్ సాగర్ ప్రాజెక్టు, కృష్ణా–భీమా నదులపై ప్రతిపాదించిన నూతన బ్యారేజీల స్థలాలు, , జూరాల ప్రాజెక్టు డ్యామ్‌ను సీఎం రేవంత్ రెడ్డి వీక్షించారు. ప్రాజెక్టుల ప్రస్తుత స్థితిగతులు, నీటి నిల్వ సామర్థ్యం తదితర అంశాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి తన సొంత నియోజకవర్గ పరిధిలోని కొడంగల్ ఎత్తిపోతల పథకం పనుల పురోగతిని ప్రత్యేకంగా పరిశీలించారు. ఈ పథకంలో అత్యంత కీలకమైన కాట్రేవుపల్లి పంప్ హౌస్ వద్ద జరుగుతున్న పనుల నిర్మాణ శైలిని, పురోగతిని సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా వీక్షించారు. ఈ ప్రాంతానికి సాగునీరు అందించడంలో ఈ ప్రాజెక్టు ఎంతో కీలకం కానుండటంతో దీనిపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తోంది. ఏరియల్ సర్వే అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నీటిపారుదల శాఖ అధికారులతో మాట్లాడారు. పాలమూరు జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టుల పనులన్నింటినీ యుద్ధప్రతిపాదికన వేగవంతం చేయాలని ఆదేశించారు. ఎలాంటి జాప్యం లేకుండా, నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. మంత్రుల బృందం కూడా ప్రాజెక్టుల వారీగా ఉన్న అడ్డంకులను తొలగించి, పనులను త్వరగా ముగించాలని అధికారులకు సూచించింది.

# ఎల్‌నినో ప్రభావంపై రైతులకు అవగాహన

**వర్షాభావంపై సన్నద్ధం చేయండి**

**వ్యవసాయాధికారులకు మంత్రి తుమ్మల సూచన**



**బలగం టీవీ, హైదరాబాద్**

వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనేందుకు రైతులను ముందుగానే సన్నద్ధం చేయాలని ఉన్నతాధికారులను వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. గురువారం హైదరాబాద్‌లో వ్యవసాయ, ఉద్యానవన శాఖ ఉన్నతాధికారులతో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమీక్ష నిర్వహించారు. ఎల్ నినో ప్రభావంతో ప్రత్యామ్నాయ పంటల సాగుపై గ్రామసభల్లో రైతులకు అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. తక్కువ నీటితో పంటల సాగు చేసేలా రైతులను ప్రోత్సహించాలని అధికారులకు స్పష్టం చేశారు. పంట వ్యర్థాలను కాల్చడంపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. అందుకోసం అన్ని జిల్లాల్లో శాటిలైట్ ఆధారిత పంట వ్యర్థాల కాల్చివేతలపై పర్యవేక్షణ చేస్తున్నట్లు చెప్పారు. వీటిని నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని వారిని హెచ్చరించారు. కొహెడ అంతర్జాతీయ సమీకృత పండ్ల మార్కెట్ శంకుస్థాపనకు ఏర్పాట్లు వేగవంతం చేసినట్లు చెప్పారు. రూ. 2,284.32 కోట్లతో కొహెడలో అంతర్జాతీయ పండ్ల మార్కెట్ నిర్మాణం చేస్తున్నట్లు వివరించారు. జూన్ 6వ తేదీన సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన జరుగుతుందన్నారు. ఇక వ్యవసాయశాఖకు చెందిన ఖాళీ భూముల పరిరక్షణకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తామన్నారు. ఈ ఆస్తుల రక్షణ కోసం ఐఏఎస్ అధికారులతో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. ఖాళీ స్థలాల్లో ఎక్మి–లాంటేషన్ లేదా లీజు

ద్వారా ఆదాయం సమీకరణ చేయాలని మంత్రి పొంగులేటి సూచించారు. తెలంగాణ ప్రభుత్వానికి చెందిన ఫెర్టిలైజర్ యాప్‌కు కేంద్ర ప్రభుత్వం మరోసారి ప్రశంసలు కురిపించిందని చెప్పారు. తెలంగాణ ఎరువుల పర్యవేక్షణ విధానం దేశానికి ఆదర్శంగా నిలిచిందని పేర్కొన్నారు. కేంద్ర ఫెర్టిలైజర్ యాప్ అమలుకు తెలంగాణను పైలట్ రాష్ట్రంగా ఎంపిక చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. యాప్ సమర్థ అమలుకు రాష్ట్రానికి ప్రోత్సాహకాలు అందిస్తామని కేంద్రం హామీ ఇచ్చిందని మంత్రి పొంగులేటి గుర్తు చేశారు. జూన్ 4, 6, 8, 10 తేదీల్లో రాష్ట్రవ్యాప్తంగా గ్రామసభలు నిర్వహించాలని ఉన్నతాధికారులను మంత్రి ఆదేశించారు. రైతులకు క్షేత్రస్థాయిలో వ్యవసాయ విస్తరణ సిబ్బంది సేవలు అందించాలని వారికి మంత్రి పొంగులేటి సూచించారు.

# సింగరేణి బొగ్గు నిల్వలపై కేంద్రం స్పందించాలి

**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**



**బలగం టీవీ, హైదరాబాద్**

సింగరేణి సంస్థలో 40 లక్షల మెట్రిక్ టన్నుల బొగ్గు నిల్వలను వాస్తవానికి విరుద్ధంగా చూపిస్తున్నారనే ఆరోపణలపై కేంద్ర ప్రభుత్వం స్పందించాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి లేఖ రాయనున్నట్లు వెల్లడించారు. గురువారం చంచల్‌గూడ జైలులో ఉన్న మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌ను పరామర్శించిన అనంతరం మీడియాతో మాట్లాడిన కేటీఆర్, సింగరేణిలో భారీ కుంభకోణం జరుగుతోందని ఆరోపించారు. ఈ వ్యవహారంపై ముఖ్యమంత్రి ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. అలాగే రాష్ట్రంలో జరుగుతున్న ఈ అంశంపై బీజేపీ నాయకత్వం మౌనం పాటించడం వెనుక ఉన్న కారణాలను ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. సింగరేణి వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని కోరారు.

మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ అరెస్టును ప్రస్తావిస్తూ, తమ పార్టీ నాయకులు, కార్యకర్తలు పోరాటాన్ని ఆపరని కేటీఆర్ స్పష్టం చేశారు. ప్రజా సమస్యలు, అన్యాయాలు, అక్రమాలపై బీఆర్ఎస్ నిరంతరం ప్రశ్నిస్తూనే ఉంటుందని పేర్కొన్నారు. సింగరేణి బొగ్గు నిల్వల అంశం రాష్ట్ర ప్రజల ప్రయోజనాలకు సంబంధించినదని, దీనిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు.

# పవన్ కళ్యాణ్ తెలంగాణకు వ్యతిరేకంగా మాట్లాడారా?

**మీటింగ్‌కు అనుమతి ఎందుకు ఇవ్వలేదో చెప్పాలి**

**బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామ చందర్ రావు**

వివరాలు 4వ పేజీలో



## తెలంగాణలోని పలు జిల్లాల్లో భారీ వర్షం

**కరీంనగర్,జనగామ, ములుగు జిల్లాలో మోస్తరు వానలు**

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

:తెలంగాణలోని పలు జిల్లాల్లో గురువారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. జనగామ జిల్లా స్టేషన్ ఘన్‌పూర్‌తో పాటు చుట్టుపక్కల గ్రామాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం పడింది. కరీంనగర్ జిల్లా కేంద్రంతో పాటు హుజూరాబాద్‌లో ఓ మోస్తరు వర్షం కురిసింది. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ నియోజకవర్గంలోని హుస్నాబాద్, భీమదేవరపల్లి, ఎల్కతుర్తి మండలాల్లో గాలి దుమారం, ఉరుములు, మెరుపులతో కూడిన మోస్తరు వర్షం పడింది. ములుగు జిల్లా మల్లంపల్లి, వెంకటాపూర్, ములుగు మండలంలో ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. కరీంనగర్ జిల్లాలో భారీ వర్షం కురిసింది. కాలనీలకు కాలనీలు నీట మునిగిన పరిస్థితి ఉంది. సుభాష్ నగర్, ఆదర్శనగర్ కాలనీలు జలమయం కావడంతో ఇళ్లలోకి వరద నీరు చేరింది. స్థానిక కార్పొరేటర్ వైద్యుల అంజన్ కుమార్ సహాయక చర్యలు చేపట్టారు. ప్రొక్మి–లకెయినర్ల సహాయంతో డ్రైనేజీలు క్లీన్ చేయించి వరద నీరు వెళ్లేలా చర్యలు

తీసుకున్నారు. కరీంనగర్ నగరంలో కురిసిన భారీ వర్షానికి కట్టరాంపూర్ నాగన్న చౌరస్తా దగ్గర ఓ ఇంటి ప్రహరీ కూలింది. గోడతో పాటు పక్కనే ఉన్న భారీ వృక్షం కూడా నేలకొరిగింది. అటుగా నిలిపి ఉన్న కారుపై శిథిలాలు పడటంతో కారు స్వల్పంగా దెబ్బతిన్నది. ఈ ఘటనతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. భారీ ప్రమాదం తప్పడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. వర్షాలు పడుతున్న క్రమంలో.. పాత గోడలు, భారీ వృక్షాల దగ్గర జాగ్రత్తగా ఉండాలని అధికారులు సూచించారు. భారీ వర్షానికి పక్కనే ఉన్న డ్రైనేజీ పొంగి కరీంనగర్ రిజిస్ట్రేషన్ కార్యాలయ ప్రాంగణం అంతా జలమయమైంది. కరీంనగర్ రూరల్ మండలం బొమ్మకల్?లో పిడుగు పడింది. మొబైల్?తో వర్షాన్ని రికార్డ్ చేస్తుండగా స్థానికుడు పిడుగుపాటుతో ఉలిక్కిపడ్డాడు.




## అమీర్‌పేట్‌లో భారీ అగ్నిప్రమాదం

**వస్త్ర దుకాణంలో చెలరేగిన మంటలు.. పక్క దుకాణాలకు వ్యాప్తి**

**8 ఫైర్ ఇంజిన్లతో మూడు గంటల పాటు శ్రమించిన అగ్నిమాపక సిబ్బంది**

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

హైదరాబాద్‌లోని అమీర్‌పేట్ ప్రాంతంలో శుక్రవారం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. అమీర్‌పేట్ మెట్రో పిల్లర్ నంబర్ 1043 సమీపంలోని కేఎస్ఆర్ ఫ్యాషన్స్ వస్త్ర దుకాణంలో మధ్యాహ్నం సమయంలో అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. చూస్తుండగానే మంటలు దుకాణం అంతటా వ్యాపించి, అదే కాంప్లెక్స్‌లోని ఇతర వ్యాపార సంస్థలకు సైతం విస్తరించాయి. ముఖ్యంగా సమీపంలోని హెల్మెట్ షోరూమ్‌కు మంటలు అంటుకోవడంతో అగ్నిప్రమాద తీవ్రత మరింత పెరిగింది. దుకాణాల్లో నిల్వ ఉంచిన వస్త్రాలు, ప్లాస్టిక్, ఫైబర్ వస్తువులు మంటలకు ఆజ్యం పోయడంతో భారీగా అగ్నికీలలు ఎగిసిపడ్డాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక శాఖ సిబ్బంది ఎనిమిది ఫైర్ ఇంజిన్లతో ఘటనాస్థలికి చేరుకుని దాదాపు మూడు గంటలపాటు శ్రమించి మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ప్రమాద సమయంలో దట్టమైన పొగలు వ్యాపించడంతో స్థానికులు, వ్యాపారులు భయాందోళనలకు గురై పరుగులు తీశారు. అగ్నిప్రమాదం కారణంగా అమీర్‌పేట్ ప్రధాన రహదారిపై వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్ కావడంతో ట్రాఫిక్ పోలీసులు వాహనాలను ప్రత్యామ్నాయ మార్గాల్లోకి మళ్లించి పరిస్థితిని చక్కదిద్దారు. ఘటనాస్థలిలో పొగలు అధికంగా వ్యాపించడంతో సుమారు 15 నిమిషాల పాటు మెట్రో రైలు సేవలను కూడా నిలిపివేశారు. ఈ ప్రమాదంలో కేఎస్ఆర్ ఫ్యాషన్స్‌తో పాటు హెల్మెట్ షోరూమ్ పూర్తిగా దగ్ధమయ్యాయి. ప్రాథమిక అంచనాల ప్రకారం సుమారు రూ.2 కోట్ల మేర ఆస్తి నష్టం సంభవించినట్లు బాధితులు తెలిపారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అగ్నిప్రమాదానికి గల ఖచ్చితమైన కారణాలను అధికారులు పరిశీలిస్తున్నారు.

### నగరంలో వరుసగా అగ్నిప్రమాదాలు ప్రభుత్వం నిర్లక్ష్యమే కారణం: తలసాని



అగ్నిప్రమాదాలను నివారించడంలో ప్రభుత్వం విఫలమైందని మాజీమంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం అమీర్ పేటలోని మైత్రివనం వద్ద అగ్నిప్రమాదం జరిగిన ప్రాంతాన్ని సందర్శించారు. ప్రమాదం వివరాల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రమాదంతో నష్టపోయిన బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ హైదరాబాద్ నగరంలో వరుసగా అగ్నిప్రమాదాలు జరుగుతున్నా ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా లేదని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రజలకు, కమర్షియల్ కాంప్లెక్స్ ల నిర్వాహకులకు అవగాహన కల్పించాలని సూచించారు. అదేవిధంగా అగ్నిమాపక శాఖకు అవసరమైన ఆధునిక పరికరాలు అందుబాటులో కి తేవాలని చెప్పారు. ప్రమాదం జరిగిన వెంటనే సకాలంలో స్పందించిన అధికారులను ఆయన అభినందించారు. ప్రమాదంలో నష్టపోయిన కుటుంబాలకు ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలని కోరారు. ఎమ్మెల్యే వెంట మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి, నాయకులు అశోక్ యాదవ్, నామన సంతోష్, ప్రవీణ్ రెడ్డి, సుమిత్ సింగ్, కట్టా బలరాం, సాయి, ప్రదీప్ గౌడ్, తదితరులు ఉన్నారు.

## సరోగసీ, ఐవీఎఫ్ కేంద్రాల నియంత్రణపై దృష్టి

**మానవ అక్రమ రవాణాను నిరోధించేలా చర్యలు**

**సుప్రీంకోర్టు పలు కీలక ఆదేశాలు**

**బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో**

పిల్లల అక్రమ రవాణా నిరోధానికి సంబంధించిన కేసులో విచారణ చేపడుతున్న సుప్రీంకోర్టు.. సరోగసీ, ఐవీఎఫ్ కేంద్రాల నియంత్రణపై దృష్టి సారించింది. ఈ కేసులో అమికస్ క్యూరీగా వ్యవహరిస్తున్న సీనియర్ అడ్వకేట్ అపర్ణా భట్ చేసిన సూచనలను పరిశీలించింది. మానవ అక్రమ రవాణాను నిరోధించేలా సరోగసీ, ఐవీఎఫ్ కేంద్రాల కోసం ప్రత్యేక మార్గదర్శకాలు (ఎస్ఓపీ) లేవని ఆమె ఈ సందర్భంగా కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. సరోగసీ, ఐవీఎఫ్ క్లినిక్స్ నియంత్రణ కోసం తీసుకొచ్చిన ఏఆర్టీ చట్టంలో అనేక నిబంధనలు ఉన్నప్పటికీ, చిన్నారుల అక్రమ రవాణాను అడ్డుకునేందుకు ప్రత్యేక ప్రోటోకాల్ లేదని అపర్ణా భట్ పేర్కొన్నారు. ప్రస్తుతం అమల్లో ఉన్న నిబంధనలు ప్రధానంగా వైద్య ప్రమాణాలు, మౌలిక వసతులకే పరిమితమయ్యాయని వివరించారు. ఈ నేపథ్యంలో నిబంధనలను మరింత కట్టుదిట్టం చేసేందుకు రిటైర్డ్ సుప్రీంకోర్టు న్యాయమూర్తి నేతృత్వంలో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని సూచించారు. కమిటీ సూచనలతో సమగ్ర విధానాన్ని రూపొందించాలని ప్రతిపాదించారు. ఈ అంశంపై కేంద్ర ప్రభుత్వం తన అభిప్రాయాన్ని తెలియజేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణను ఆగస్టు 19కి వాయిదా వేసింది.

# మార్కెట్ వ్యాల్యూ ప్రకారం భూముల ధరలు

**నేటి నుంచే అమల్లోకి పెంచిన రేట్లు**
**రూ.1200 నుంచి రూ.1400 కోట్ల మేర ఆదాయం**
**సబ్ రిజిస్ట్రార్ల అధికారాలకు కత్తెర**
**రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**



**బలగం టీవీ, హైదరాబాద్**

మార్కెట్ వ్యాల్యూ ప్రకారం భూముల ధరలు శుక్రవారం నుంచి పెరుగుతాయని తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. భూముల ధరలు ఏరియాను బట్టి 50 నుంచి100 శాతం పెరుగుతాయని తెలిపారు. ప్రైమ్ ఏరియాలో 100 శాతం పెరుగుతాయన్నారు. గురువారం హైదరాబాద్‌లోని సచివాలయంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి విలేకర్లతో మాట్లాడారు. భూముల వ్యాల్యూ పెరగటంతో రాష్ట్ర ప్రభుత్వానికి రూ.1200 నుంచి రూ.1400 కోట్ల మేర ఆదాయం వస్తుందని చెప్పారు. హయ్యర్ సైడ్ ఏరియాలు శేరిలింగంపల్లి, రాజేందర్ నగర్, ఖాజాగూడ తదితర ప్రాంతాల్లో రిజిస్ట్రేషన్ ఛార్జీలు పెరగవన్నారు. ఆయా ప్రాంతాల్లో ఛార్జీలు పెంచే ఆలోచన ప్రభుత్వానికి లేదని తెలిపారు. ఇక నుంచి సబ్ రిజిస్ట్రార్లకు ఫుల్ పవర్స్ కట్ చేశామని.. వారికి మినిమమ్ పవర్స్ మాత్రమే ఉంటాయని మంత్రి పొంగులేటి వివరించారు. భూ సేకరణ సమయంలో ప్రభుత్వానికి కొంత నష్టం జరిగిందన్నారు. కానీ రైతులకు మాత్రం లాభం జరుగుతుందన్నారు. ఇన్నర్ సైడ్ ఎకరం కనీసం రూ.15 లక్షలు ఉందని చెప్పారు. లోయర్ సైడ్ ఏమైనా పొరపాటు జరిగితే మార్పులు చేర్పులు ఉంటాయని చెప్పారు. హయ్యర్ సైడ్ మాత్రం మార్పులు ఉండవన్నారు. సమస్యలు ఉంటే.. హెల్ప్ డెస్క్ ఫోన్ నెంబర్ ఏర్పాటు చేస్తామని పబ్లిక్‌కు ఆయన సూచించారు. త్వరలో తహసీల్దార్ల బదిలీలు ఉంటాయని చెప్పారు. ఫ్యూచర్ సిటీని రద్దు చేసే అవకాశమే లేదని స్పష్టం చేశారు. రెవెన్యూ విషయంలో.. తెలంగాణను మిగతా రాష్ట్రాలు మోడల్‌గా తీసుకుంటున్నాయని గుర్తు చేశారు. ఏడాదిన్నరలో 90 శాతం గ్రామాల సర్వే పూర్తవుతుందని ధీమా వ్యక్తం చేశారు. రెవెన్యూలో అవినీతి లేకుండా చర్యలు చేపట్టామని పేర్కొన్నారు. ఆ క్రమంలోనే అవినీతి నిరోధక శాఖ ట్రాప్‌లు అధికంగా జరుగుతున్నాయని స్పష్టం చేశారు. గత ప్రభుత్వంలో మూడేళ్ల రెవెన్యూ ఫైల్స్ పెండింగ్‌లో ఉన్నాయని గుర్తు చేశారు. కానీ తాను వచ్చిన మూడు నెలల్లోనే 3,500 రెవెన్యూ ఫైల్స్ క్లియర్ చేశానని వివరించారు. అసెంబ్లీలో పెండింగ్‌లో ఉన్న 10 ఏళ్ల ఫైల్స్ ఆరు నెలల్లోనే క్లియర్ చేసినట్లు చెప్పారు. తనకు ఏ శాఖ కేటాయించినా.. కళ్లు మూసుకొని పని చేస్తానని పేర్కొన్నారు.ప్రభుత్వానికి మంచి జరిగే ఏ పని చేయడానికైనా తాను భయపడనని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కుండబద్దలు కొట్టారు. ఇప్పటి వరకు ఇందిరమ్మ ఇండ్లకు రూ. 7 వేల కోట్లు చెల్లించామని చెప్పారు. రాష్ట్రంలో పాడి ప్రోక్యూర్‌మెంట్ 90 శాతం పూర్తయిందన్నారు. అసైన్డ్ భూములకు పాలసీ తీసుక వస్తామని స్పష్టం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో అసైన్డ్ భూములకు రిజిస్ట్రేషన్లు జరిగినవని పేర్కొన్నారు. తమ ప్రభుత్వం వాటిని నిషేధిత జాబితా లో చేర్చిందని మంత్రి పొంగులేటి వివరించారు.

# ప్రజలకు అత్యుత్తమ సేవలే లక్ష్యంగా రెవెన్యూ వ్యవస్థలో సంస్కరణలు

**కార్పొరేట్ స్థాయిలో ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల నిర్మాణం**
**ఇప్పటికే నాలుగు భవనాలకు శంకుస్థాపన..**
**డిసెంబర్ నాటికి గచ్చిబౌలి కార్యాలయం అందుబాటులోకి**
**మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి**



**బలగం టీవీ, హైదరాబాద్**

తెలంగాణ ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన, అవినీతి రహిత సేవలు అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ వ్యవస్థలో సమూల మార్పులకు శ్రీకారం చుట్టినట్లు మంత్రి పొంగులేటి శ్రీనివస్ రెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా ఆధునిక సౌకర్యాలతో కార్పొరేట్ స్థాయిలో ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను నిర్మిస్తున్నట్లు వెల్లడించారు.గచ్చిబౌలిలోని తాలిమ్ ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ పనులను ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ శాఖ ఐజీ రాజీవ్ గాంధీ హనుమంతు, నిర్మాణ సంస్థ ప్రతినిధులు, ఇంజినీర్లతో కలిసి పరిశీలించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రజలకు పారదర్శకమైన, సమర్థవంతమైన సేవలు అందించేందుకు స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ శాఖలో పలు విప్లవాత్మక సంస్కరణలు అమలు చేస్తున్నామని తెలిపారు. స్లాట్ బుకింగ్ విధానం ద్వారా ప్రజల సమయాన్ని ఆదా చేయడంతో పాటు అత్యాధునిక సౌకర్యాలతో సమీకృత సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు.మొదటి దశలో ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలోని 39 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను 13 క్లస్టర్లుగా విభజించి, ప్రభుత్వంపై అదనపు ఆర్థిక భారం పడకుండా ప్రైవేట్ నిర్మాణ సంస్థల సహకారంతో నిర్మిస్తున్నట్లు తెలిపారు. నిర్మాణంతో పాటు ఐదు సంవత్సరాలపాటు భవనాల నిర్వహణ బాధ్యతలను కూడా ఆయా సంస్థలకే అప్పగించినట్లు వెల్లడించారు.

మూడు నుంచి ఐదు ఎకరాల విస్తీర్ణంలో నిర్మిస్తున్న ఈ కార్యాలయాల్లో వివాహ నమోదు కోసం మినీ మ్యారేజ్ హాల్, గర్భిణీలు, వృద్ధుల కోసం ప్రత్యేక సౌకర్యాలు, విశాలమైన వెయిటింగ్ హాల్స్, మహిళల కోసం ఫీడింగ్ రూమ్, చిన్నారుల కోసం క్రెచ్, వృద్ధులు, దివ్యాంగుల కోసం ఆధునిక లిఫ్ట్ సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

ఇప్పటికే నాలుగు ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రార్ భవనాలకు శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించినట్లు వెల్లడించారు. గచ్చిబౌలిలో నిర్మిస్తున్న భవనాన్ని ఈ ఏడాది డిసెంబర్ నాటికి ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. అలాగే ఒకటి, రెండు రోజుల్లో కోహెడలో మరో ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి శంకుస్థాపన చేయనున్నట్లు పేర్కొన్నారు. రెండో దశలో రాష్ట్రంలోని జిల్లా కేంద్రాల్లో కూడా ఇలాంటి ఆధునిక ఇంటిగ్రేటెడ్ భవనాలను నిర్మించి ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించనున్నట్లు అధికారులు వెల్లడించారు.

# పెట్రోల్ ట్యాంకర్ బీభత్సం

**విజయవాడ రహదారిపై ట్రాఫిక్ చిక్కులు**

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

హయత్‌నగర్‌లో పెట్రోల్ ట్యాంకర్ బీభత్సం సృష్టించింది. రంగారెడ్డి జిల్లా పెద్ద అంబర్ పేట్ లక్ష్మారెడ్డి పాలెం దగ్గర కారును ఢీకొట్టి పెట్రోల్ ట్యాంకర్ పల్టీ కొట్టింది. విజయవాడ నుంచి హైదరాబాద్ వచ్చే రూట్‌లో ప్రమాదం జరగడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. సర్వీస్ రోడ్డులో వెహికల్స్?ను పోలీసులు పంపిస్తున్నారు. ఎలాంటి ప్రమాదం జరగకుండా ఫైర్ సిబ్బంది ఫోమ్ స్ప్రే చేస్తున్నారు. ఈ ఘటనలో రెండు కార్లు పూర్తిగా ధ్వంసం అయ్యాయి. కారులో ఉన్నవారికి గాయాలయ్యాయి. ట్యాంకర్ నుంచి పెట్రోల్ లీక్ అవుతుండటంతో స్థానికులు భయాందోళనకు లోనయ్యారు. డ్రైవర్ పెట్రోల్ ట్యాంకర్‌లో ఇరుక్కుపోయాడు. జాతీయ రహదారి 65పై భారీగా ట్రాఫిక్ జామ్ అయింది.

# హైదరాబాద్ సహా పలుప్రాంతాల్లో చిరుజల్లులు

**చల్లబడ్డ నగర వాతావరణం**

**బలగం టీవీ, హైదరాబాద్**



జూన్ నెల వచ్చినా ఎండలు మండిపోతున్నాయి... రుతుపవనాల రాక ఆలస్యమవ్వడంతో మరి కొన్ని రోజులు ఎండ తీవ్రత ఉంటుందని వాతావరణ శాఖ తెలిపింది. అయితే.. గురువారం ఉదయం నుండి ఎండ దంచికొట్టినప్పటికీ మధ్యాహ్నం అయ్యేసరికి ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. ఒక్కసారిగా మబ్బులు కమ్మేసి చిరుజల్లులు కురిశాయి. ఈ దెబ్బతో ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా తగ్గిపోయి నగరం చల్లబడింది. వర్షం కురిసే సమయంలో రోడ్ల మీద ఉన్న వాహనదారులు చిరుజల్లులతో రిలీఫ్ అయ్యారు. అప్పటిదాకా ఎండలో ట్రాఫిక్ జామ్ లో విసిగిపోయిన జనం ఒక్కసారిగా కురిసిన చిరుజల్లులతో ఉపశమనం పొందారు. కరీంనగర్ జిల్లాలో కూడా వాతావరణం ఒక్కసారిగా మారిపోయి వర్షం కురిసింది. కరీంనగర్ జిల్లా కేంద్రంతో పాటు తిమ్మాపూర్, మనుకొండూరు, శంకరపట్నం, జమ్మికుంట, హుజురాబాద్ మండలాల్లో ఆకాశం మేఘావృతమై చిరుజల్లులు కురవగా... మరికొన్ని చోట్ల ఉరుములతో కూడిన వర్షం కురిసింది. ఉదయం నుండి విపరీతమైన ఎండ వేడితో అల్లాడిన జనం వర్షంతో ఉపశమనం పొందామని అంటున్నారు. మెదక్ జిల్లా నిజాంపేట మండలంలోని పలు గ్రామాల్లో వర్షం కురిసింది. నిజాంపేట మండల కేంద్రంలోని ఓ ఇంటిపై పిడుగు పడింది. అయితే.. పిడుగు పడిన సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం తప్పింది.

## ఎపిలో పలు జిల్లాల్లో వర్షాలు

:ఏపీలో గురువారం పలు జిల్లాల్లో వర్షాలు కురిశాయి. సాయంత్రం ఐదు గంటల సమయానికి పార్వతీపురం మన్యం జిల్లా పాచిపెంటలో 30.5 మి.మీ., గుంటూరు జిల్లా తాడేపల్లిలో 27.2 మి.మీ., అనకాపల్లి జిల్లా నర్సీపట్నంలో 18.5మి.మీ., విజయనగరం జిల్లా గుర్లలో 14.5 మి.మీ. వర్షపాతం నమోదైందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. దక్షిణ తెలంగాణ, దానిని ఆనుకొని ఉన్న కోస్తాంధ్ర ప్రాంతాలపై ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. దీని ప్రభావంతో శుక్రవారం పోలవరం, కాకినాడ, తూర్పుగోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, తదితర జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముంది. గురువారం మార్కాపురం జిల్లా నందనమారెళ్లలో 44.7 డిగ్రీలు, అనకాపల్లి జిల్లా దేవరాపల్లిలో 43.8, బాపట్ల జిల్లా పిట్టలవానిపాలెం, పల్నాడు జిల్లా పిడుగురాళ్లలో 43.7, పశ్చిమగోదావరి జిల్లా తణుకులో 43.6, కృష్ణా జిల్లా కంకిపాడులో 43.4, ప్రకాశం జిల్లా కొండపిలో 43, ఎన్టీఆర్ జిల్లా తొర్రగుడిపాడులో, నెల్లూరు జిల్లా గూడూరులో 44 డిగ్రీలు, కృష్ణా జిల్లా పెదపారుపూడి, పల్నాడు జిల్లా అమరావతిలో 43.4, కంచికచర్లలో 43.2, గుంటూరు జిల్లా రాయపూడిలో 43, ప్రకాశం జిల్లా చీమకుర్తిలో 42.7, తిరుపతి జిల్లా బోనుప్లలెలో 42.4, విజయనగరం జిల్లా రాజాంలో 42.3, ఏలూరు జిల్లా కలప్రరులో 42.3, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా

ఆత్రేయపురం, తూర్పుగోదావరి జిల్లా ఉండ్రాజవరం, ఏలూరు జిల్లా అల్లిపల్లి, పార్వతీపురం మన్యం జిల్లా కురుపాం, విజయనగరం జిల్లా దత్తిరాజేరులో 42 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి' అని వెల్లడించింది.

# రెండేండ్ల కూటమి విజయాలపై ప్రజలకు వివరణ

**మంత్రులంతా ప్రజల్లోకి వెళ్లి చెప్పాలి**
**కేబినేట్ భేటీలో ఏపీ సీఎం చంద్రబాబు సూచన**

**బలగం టీవి, హైదరాబాద్**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తి అవుతున్న సందర్భంగా అందరూ ప్రజల్లోకి వెళ్లాలని మంత్రులకు సీఎం చంద్రబాబు ఆదేశాలు జారీ చేశారు. గురువారం సీఎం అధ్యక్షతన కేబినెట్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. తమ శాఖలో చేపట్టిన కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని మంత్రులకు సూచించారు. గత ప్రభుత్వం నిర్వాకాలపై శ్వేతపత్రాలు విడుదల చేశామని.. అప్పటి నుంచి ఈ రెండేళ్లలో ఏం చేశామో శాఖల వారీగా ఈనెల 28లోపు ప్రజలకు వివరించాలని ఆదేశించారు. రైతులు పంట మార్పిడి విధానాన్ని అనుసరించాలని సీఎం చెప్పారు. దేశీయ, స్థానిక అవసరాల మేరకు పంటలు వేసే విధంగా రైతులను ఎడ్యుకేట్ చేయాలని అన్నారు. అగ్రిగోల్డ్ బాధితుల సమస్యలను పరిష్కరించేందుకు కేబినెట్ సబ్ కమిటీ ఎందుకు వేయలేదంటూ ఉన్నతాధికారులపై చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం అన్ని రకాలుగా మద్దతు ఇస్తున్నా ఎందుకిలా ఉన్నారని అధికారులపై సీరియస్ అయ్యారు. అగ్రిగోల్డ్ కేసులను వెంటనే పరిష్కరించేందుకు మొత్తం 31 కొత్త పోస్టులు మంజూరు చేసిన సీఎం.. వెంటనే కేబినెట్ సబ్ కమిటీని నియమించాలని ఆదేశాలు జారీ చేశారు. ఏపీలో16 వేల టీచర్ పోస్టులను భర్తీ చేశామని ముఖ్యమంత్రి తెలిపారు. డీఎస్సీపై వైసీపీ అధినేత జగన్ రాద్ధాంతం చేస్తున్నారని.. ప్రజలను అయోమయానికి గురిచేయాలని చూశారని మండిపడ్డారు. 'మనం గట్టిగా తిప్పికొట్టడంతో ఇప్పుడు తోక ముడిచారు. మనం చెప్పేది వివరంగా ప్రజలకు తెలియజేయాలి. అప్పుడు మాత్రమే ప్రజలకు తెలుస్తుంది' అని వివరించారు. ఇటీవల రాజధానిలో కొంతమంది రైతులను జగన్ కలిశారని సీఎం చెప్పగా.. జగన్ దగ్గరకు వెళ్లిన అశోక్ అనే రైతు నిన్న నేలపాడులో తన భూమిని ల్యాండ్ పూలింగ్‌కు ఇచ్చారని మంత్రి నారాయణ తెలిపారు. రైతులను జగన్ గందరగోళంలోకి నెట్టాలని ప్రయత్నం చేస్తున్నారని.. కానీ రాజధాని రైతులు ఇప్పుడు కూడా జగన్ మనస్తత్వాన్ని అర్థం చేసుకున్నారని సీఎం అన్నారు. జగన్ చెప్పిన మాటలను నమ్మే పరిస్థితిలో లేరని తెలిపారు. ప్రజలకు నిజాలు వివరిస్తే వాళ్లు పూర్తిగా అర్థం చేసుకుంటారన్నారు. అమరావతి, తిరుపతి, రాజమండ్రి, విశాఖపట్నంలో యోగా డే నిర్వహించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు.

# పోలవరం పూర్తయితే భద్రాచలానికి శాశ్వత వరద ముప్పు



**పోలవరం ప్రాజెక్టు అథారిటీ తక్షణ చర్యలు చేపట్టాలి**
**ఎమ్మెల్యే హరీశ్‌రావు**

**బలగం టీవి, హైదరాబాద్**

ఆంధ్రప్రదేశ్‌లో నిర్మాణంలో ఉన్న పోలవరం ప్రాజెక్టు పూర్తయిన అనంతరం భద్రాచలం పట్టణానికి శాశ్వత వరద ముప్పు ఏర్పడే ప్రమాదం ఉందని మాజీ నీటిపారుదల శాఖ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, ఎమ్మెల్యే హరీశ్‌రావు హెచ్చరించారు. ఈ మేరకు పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ) ప్రధాన కార్యనిర్వాహక అధికారికి లేఖ రాసిన ఆయన, తెలంగాణలోని వరద ప్రభావిత ప్రాంతాలను రక్షించేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు.

పోలవరం ప్రాజెక్టు పూర్తి స్థాయి జలాశయ మట్టం (ఎఫ్ఆర్ఎల్) 45.72 మీటర్లుగా ఉండగా, అదే భద్రాచలం వద్ద మొదటి వరద హెచ్చరిక స్థాయిగా ఉండటం ఆందోళన కలిగిస్తోందని హరీశ్‌రావు పేర్కొన్నారు. 2022లో సంభవించిన వరదలను ప్రస్తావిస్తూ, పోలవరం కాఫర్‌డ్యామ్ నిర్మాణం అనంతరం బ్యాక్‌వాటర్ ప్రభావం వల్ల భద్రాచలం, బూర్గంపాడు, సారపాక ప్రాంతాల్లో వరదలు మరింత తీవ్రతరమయ్యాయని తెలిపారు.

ఆ సమయంలో భద్రాచలం పట్టణంలోని దాదాపు 40 శాతం ప్రాంతం నీట మునిగిపోయిందని, లక్ష మందికిపైగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని గుర్తుచేశారు. ఐఐటీ, వాప్‌కోస్ సంస్థలు నిర్వహించిన అధ్యయనాల ప్రకారం 36 గ్రామాల పరిధిలో సుమారు 184 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణం బ్యాక్‌వాటర్ ప్రభావానికి గురయ్యే అవకాశం ఉందని వివరించారు.

గ్రామాలకే కాకుండా కీలక పారిశ్రామిక సంస్థలకు కూడా ముప్పు ఉందని హరీశ్‌రావు పేర్కొన్నారు. సారపాకలోని ఐటీసీ పేపర్‌బోర్డ్స్, మణుగూరులోని హెవీ వాటర్ ప్లాంట్, దుమ్ముగూడెం జలవిద్యుత్ ప్రాజెక్టు వంటి ప్రధాన సంస్థలు కూడా బ్యాక్‌వాటర్ ప్రభావంతో వరద ముప్పును ఎదుర్కొనే అవకాశముందని తెలిపారు.

ఈ నేపథ్యంలో ప్రభావిత ప్రాంతాల ప్రజలకు తగిన పరిహారం అందించడంతో పాటు వరద రక్షణ చర్యలు చేపట్టాలని ఆయన కోరారు. అలాగే పునరావాసం, వరద నిర్వహణ, బ్యాక్‌వాటర్ సమస్యల పర్యవేక్షణ కోసం భద్రాచలంలో ప్రత్యేక పోలవరం ప్రాజెక్టు అథారిటీ విభాగ కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణకు అవసరమైన అన్ని చర్యలను కేంద్ర ప్రభుత్వం, పోలవరం ప్రాజెక్టు అథారిటీ వెంటనే చేపట్టాలని హరీశ్‌రావు లేఖలో కోరినట్లు సమాచారం.

# తెలంగాణలో విద్వేషాలు సృష్టించవద్దు

**ఆంధ్రా నాయకులకు గుత్తా కౌంటర్**

**బలగం టీవి, హైదరాబాద్**

తెలంగాణలో విద్వేషాలు సృష్టించవద్దని తెలంగాణ మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ఆంధ్రప్రదేశ్ నాయకులకు గట్టి కౌంటర్ ఇచ్చారు. తెలంగాణ ఆవిర్భావ వేడుకలు జరుగుతుంటే ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సభను నిర్వహిస్తామనడం సరైనది కాదని మీడియా చిట్‌చాట్‌లో పేర్కొన్నారు. మీడియా సమావేశంలో పవన్ కల్యాణ్ వాడిన భాష తీరు సరిగా లేదని వెల్లడించారు. అమరావతి బ్రహ్మాండమైన రాజధాని అంటున్న సీఎం ,డిప్యూటీ సీఎం , మంత్రులు అమరావతిలోనే నివాసం ఉండాలని సూచించారు. తెలంగాణ కన్నా ఏపీలో ఎక్కువ సోర్స్ ఉన్నాయి. సముద్ర తీరం ఉంది. రకరకాల పోర్టులు ఉన్నాయి. ఆ నాయకులంతా ఏపీ అభివృద్ధి చూసుకోవాలి తప్ప తెలంగాణా వైపు చూడొద్దని హితవు పలికారు. తెలంగాణలో విద్వేషాలకు ప్రయత్నించవద్దని తెలిపారు. తెలంగాణ లో 75 శాతం ధాన్యం సేకరణ పూర్తి అయిందని, ధాన్యం కొనుగోళ్లకు కేంద్రం సహకరించడం లేదని ఆరోపించారు. రైతులు పంట మార్పిడి వైపు దృష్టి సారించాలని కోరారు. రైతులు వరి , పత్తి తప్ప ఏ పంటలు పండించడం లేదని వివరించారు.

# కార్మికులకు అండగా నిలిచేది బీఆర్ఎస్



**కార్మికుల సమస్యలపై సిఎంకు పట్టింపు లేదు**
**జలమండలి గేట్ మీటింగ్‌లో తలసాని శ్రీనివాసయాదవ్**

**బలగం టీవి, హైదరాబాద్**

ఉద్యోగులు, కార్మికుల సమస్యలపై పోరాడేది గులాబీ జెండా మాత్రమేనని మాజీమంత్రి, బీఆర్ఎస్ పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. గురువారం ఖైరతాబాద్ జలమండలి కార్యాలయం వద్ద నిర్వహించిన గేట్ మీటింగ్‌కు ఆయన హాజరై ప్రసంగించారు. వాటర్ బోర్డులో 50 సంవత్సరాల లో ఎన్నడూ లేని విధంగా కేసీఆర్ ప్రభుత్వం 650 మంది ఉద్యోగులను రెగ్యులరైజ్ చేసిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. వాటర్ వర్క్స్ బోర్డు లోని ఉద్యోగులు, కార్మికుల సమస్యలపై అవగాహన ఉన్న రాంబాబు యాదవ్‌ను 6 వ తేదీన జరిగే గుర్తింపు ఎన్నికలలో గెలిపించుకోవాలని తలసాని పిలుపునిచ్చారు. మున్సిపల్ శాఖను తన వద్ద పెట్టుకున్నముఖ్యమంత్రి రెండున్నర సంవత్సరాలలో ఒక్కసారైనా సమీక్ష చేశారా? అని తలసాని ప్రశ్నించారు. మీ సమస్యలపై ముఖ్యమంత్రికే పట్టింపు లేనప్పుడు ఆ పార్టీకి సంబంధించిన వ్యక్తిని గెలిపిస్తే ఎలాంటి ప్రయోజనం ఉండదన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత పరిపాలన చేతకాక ప్రశ్నించే వారిపై ఎదురుదాడి చేస్తున్నారని, అక్రమ కేసులు పెడుతున్నారని తలసాని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఈ ప్రభుత్వం అవగాహన, ప్రణాళిక లేకుండా మూడు కార్పొరేషన్లుగా విభజించి ఉద్యోగులు, ప్రజలను అయోమయానికి గురి చేస్తున్నారని తలసాని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఏ రోజు కూడా ప్రజలకు ఇబ్బంది లేకుండా త్రాగునీటిని సరఫరా చేస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వం త్రాగునీటిని కూడా సక్రమంగా ఇవ్వలేకపోతుందని మండిపడ్డారు. మీకు అండగా ఉండేది బీఆర్ఎస్ పార్టీ అని, మీ హక్కుల కోసం అసెంబ్లీ లోపల, బయట ప్రభుత్వాన్ని నిలదీస్తామని ప్రకటించారు. మీ కోసం గొంతుక వినిపించే గులాబీ జెండాకు

మద్దతు తెలపాలని తలసాని కోరారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో బోర్డులోని అనేక సమస్యలను నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించిన విషయాన్ని గుర్తు చేశారు. అటు సూర్యుడు ఇటు పొడిచినా మళ్లీ వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, తమ ప్రభుత్వం వచ్చిన తర్వాత అన్ని సమస్యలను పరిష్కరిస్తామని తలసాని హామీ ఇచ్చారు.

# వర్షాకాలంలో ముందస్తు ప్రణాళికలు

**ప్రజలకు అదనపు కలెక్టర్ సూచన**

**బలగం టీవి, జగిత్యాల**

వర్షాకాలంలో ముందస్తు ప్రణాళికలు రూపొందించుకోవాలని జగిత్యాల జిల్లా అదనపు కలెక్టర్ బీఎస్ లత అన్నారు. సారంగాపూర్ మండలంలోని సారంగాపూర్, బట్టపల్లి, పోతారం, నాయకపు గూడెం, బీర్పూర్ మండలంలోని బీర్పూర్, నర్సింహులపల్లి, తుంగూర్, కందేనకుంట గ్రామాల్లో అధికారులు ప్రత్యేక గ్రామసభలు గురువారం నిర్వహించారు. బీర్పూర్ మండలంలోని తుంగూర్ గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో జిల్లా అదనపు కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతు గ్రామాల్లో వర్షాకాలంలో పారిశుద్య నిర్వహణపై ఆ చర్యలు చేపట్టాలని అన్నారు. ఈ సందర్భంగా వర్షాకాలంలో ముందస్తు ప్రణాళికలు, పారిశుద్య నిర్వహణ, ఎలినినో ప్రభావ పరిస్థితుల్లో రైతులు పంటల మార్పిడీ చేసుకోవడం, మ చర్యలు, గ్రామాల్లో ఇంకుడు గంతల నిర్మాణాల ఏర్పాటు, నీటిని పొదుపుగా వాడుకోవడం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఆయా గ్రామాల్లో నిర్వహించిన గ్రామసభల్లో వివిధ అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సమావేశాల్లో బీర్పూర్ మండల ప్రత్యేక అధికారి ప్రకాష్, తహసీల్దార్లు వహిదొద్దిన్, సుజాత, ఎంపీడీఓలు ఎండి సలీం, భీమేష్ ప్రజాప్రతినిధులు చేకూట ఆరుణ శేఖర్, మర్రిపెల్లి అశ్విని, పుష్పనాథ్, మల్యాల జ్యోతి, ఎలమట్ల హరీష్, ఎడ్ల సృజన సుశీన్, హర్షకోట రాజగోపాల్ రావు, కొమిరే నర్సయ్య, ఆయా అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# రైతులు ఇబ్బందులను పట్టించుకోని సీఎం

**పర్యటనలతో ఒరిగేదేమీ లేదు: నిరంజన్ రెడ్డి**

**బలగం టీవి, వనపర్తి**

రాష్ట్ర రైతాంగం తీవ్ర ఇబ్బందులు పడ్డ సమయంలో కాకుండా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రాజెక్టుల సందర్శన పేరుతో హడావుడి చేస్తున్నారని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఆరోపించారు. సీఎం గురువారం పాలమూరు పర్యటన సందర్భంగా పలు ప్రశ్నలు సంధించారు. విపత్తుల సమయంలో రాకుండా , రైతుల సమస్యలను పరిగణనలోకి తీసుకోకుండా చేస్తున్న ఈ పర్యటనలు ఎవరికి ఉపయోగమని నిలదీశారు. సీఎం పర్యటనే వేళ తెలంగాణ వాదులు, బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులను ముందస్తు అరెస్టులు చేయడం సబబు కాదని, వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికీ వడ్లు కల్లాల్లోనే ఉన్నాయని,రైతు భరోసా అడుగుతారనే హెలికాప్టర్‌లో పర్యటిస్తున్నారని విమర్శించారు.కాంగ్రెస్ ప్రభుత్వం మీద ప్రజలు ఆశలు కోల్పోయారని పేర్కొన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిందని, భవిష్యత్తులో వారికి పరాభవం తప్పదని హెచ్చరించారు.

# విధ్వంస పాలన విముక్తికి రెండేళ్లు

**ఏపీ మంత్రి కొండపల్లి శ్రీనివాస్**

**బలగం టీవి, హైదరాబాద్**

విధ్వంస పాలన నుంచి ఏపీ ప్రజలకు విముక్తి లభించి రెండేళ్లు పూర్తి అయ్యిందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ.. ఐదేళ్ల రాక్షస పాలనతో రాష్ట్ర ప్రజలను జగన్ వెన్నుపోటు పొడిచారని వ్యాఖ్యానించారు. 2024లో చరిత్రాత్మక తీర్పు ఇచ్చిన ఏపీ ప్రజలు.. 2029లోనూ అదే తీర్పు ఇస్తారని ధీమా వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక రాష్ట్రంలో మళ్లీ ప్రజాస్వామ్య వెలుగులు కనిపిస్తున్నాయన్నారు. గత ప్రభుత్వ విధ్వంసాన్ని సరిదిద్దుతూ సీఎం చంద్రబాబు రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్నారని మంత్రి తెలిపారు. అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం శరవేగంగా ముందుకు సాగుతోందని వెల్లడించారు. రాష్ట్రానికి పూర్వవైభవం తీసుకురావడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కూటమి ప్రభుత్వం పాలన అందిస్తోందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు.

# ప్రజల భాగస్వామ్యంతోనే సమగ్ర అభివృద్ధి..



**-పంట మార్పిడితోనే రైతులకు లాభం**

**-కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :**

?ప్రజా సంక్షేమం, ఆరోగ్యం మరియు అభివృద్ధి లక్ష్యంగా అధికారులు, ప్రజలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపునిచ్చారు.ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా కోనరావుపేట మండలం మర్రిమడ్ల గ్రామంలో నిర్వహించిన ప్రత్యేక గ్రామసభకు జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా వర్షాకాల సన్నద్ధత, పంట మార్పిడి, వ్యవసాయ, ఉద్యానవన శాఖల కార్యాచరణ ప్రణాళిక, బడి బాట, ఘన వ్యర్థాల నిర్వహణ, ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ, విపత్తుల నిర్వహణ, పారిశుద్ధ్యం, మొక్కల పెంపకం, జల సంరక్షణ, అరైవ్–అలైవ్ తదితర అంశాలపై గ్రామ ప్రజలతో సుదీర్ఘంగా చర్చించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ

తమ మండల మరియు గ్రామాల్లో అధికారులు చేపడుతున్న కార్యక్రమాలపై ప్రజలకు సంపూర్ణ అవగాహన ఉండాలని అన్నారు .

?వర్షాకాలం దృష్ట్యా గ్రామాల్లోని డ్రైనేజీలను ముందుగానే శుభ్రం చేయాలని గ్రామ పంచాయతీలకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్తను పడేయడం, డ్రైనేజీల్లో ప్లాస్టిక్ వేయడం మానుకోవాలని ప్రజలను కోరారు. ఘన వ్యర్థాల నిర్వహణ–2026లో భాగంగా చెత్తను తడి, పొడి, సానిటరీ, ప్రత్యేక వ్యర్థాలుగా నాలుగు రకాలుగా వేరు చేసి పంచాయతీ వాహనానికి అందించాలని సూచించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకాన్ని అరికట్టాలని, నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. వార్డు సభ్యులు బాధ్యత తీసుకుని చెత్తను కంపోస్ట్ షెడ్‌కు తరలించాలని, తద్వారా సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని పేర్కొన్నారు. తాగునీటి ట్యాంకులను క్రమం తప్పకుండా బ్లీచింగ్‌తో శుభ్రం చేస్తూ, స్వచ్ఛమైన నీటిని అందించాలని, నిర్వహణలో లోపాలుంటే వెంటనే ఫిర్యాదు చేయాలని సూచించారు.

?వ్యవసాయ రంగంలో ఎల్నినో ప్రభావం దృష్ట్యా రైతులు వ్యవసాయ అధికారుల సలహాలతో పంటల సాగును ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని సూచించారు. నేల సారం తగ్గకుండా ఉండేందుకు పంట మార్పిడి తప్పనిసరి అని, ఆయిల్ పామ్, కూరగాయలు, పత్తి వంటి లాభదాయక పంటల వైపు మొగ్గు చూపాలని కోరారు. ఆయిల్ పామ్ సాగుకు ప్రభుత్వం డ్రిప్, మొక్కలపై సబ్సిడీని అందిస్తుందని, స్థానికంగానే పరిశ్రమ అందుబాటులో ఉన్నందున రైతులు ముందుకు రావాలని అన్నారు. వరిలో సన్న వడ్ల సాగు చేసే రైతులకు బోనస్ లభిస్తుందని, ఈ అంశంపై రైతులు దృష్టి సారించాలని తెలిపారు.

?రోడ్డు భద్రతపై అవగాహన కల్పించేందుకు చేపట్టిన 'అరైవ్–అలైవ్'లో భాగంగా, ప్రమాదాల నియంత్రణకు ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాలని కోరారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, మద్యం తాగి వాహనాలు నడపరాదని, మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని అన్నారు . ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా ఈ నెల 25 నుంచి చేపట్టే ఇంటింటి సర్వేకు ప్రజలు సహకరించాలని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే లక్ష్యమని తెలిపారు.?పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఈ నెల 12 వరకు చేపట్టిన కార్యక్రమాలను విజయవంతం చేయాలని, వనమహోత్సవం ద్వారా మొక్కలను నాటి వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. 'బడిబాట' ద్వారా ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థుల నమోదును పెంచాలని, ప్రభుత్వం కల్పిస్తున్న మౌలిక సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని తల్లిదండ్రులకు సూచించారు. పర్యటనలో భాగంగా కలెక్టర్ గ్రామాల్లోని నర్సరీ, కంపోస్ట్ షెడ్‌లను పరిశీలించి, శాస్త్రీయ పద్ధతుల్లో వ్యర్థాల నిర్వహణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు.కార్యక్రమంలో వేములవాడ ఆర్డీఓ కె.ఎస్.బి కుమారి, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి లక్ష్మీనారాయణ, వ్యవసాయ శాఖ అధికారి అఫ్జల్ బేగం, పంచాయతీ అధికారి షర్ఫుద్దీన్, మిషన్ భగీరథ గ్రిడ్ ఈఈ అన్వర్, ఇంట్రా ఈఈ సుమలత, జిల్లా వైద్యాధికారి జగన్ మోహన్ రెడ్డి, సర్పంచ్ స్వాతి, తహసీల్దార్ వరలక్ష్మి, ఎంపీడీఓ స్నిగ్ధ, అటవీ శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఆయిల్ పామ్, సన్న వడ్లు సాగు చేయడంపై రైతులు దృష్టి పెట్టాలి..

**-అదనపు కలెక్టర్ గడ్డం నగేష్**

**బలగం టీవీ, వేములవాడ :**



ఆయిల్ పామ్, సన్న వడ్లను సాగు చేయడంపై రైతులు దృష్టి పెట్టాలని, లాభదాయక పంటల సాగుకు ముందుకు రావాలని, వేగవంతంగా ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ కోరారు.గురువారం వేములవాడ మండలం బాలా నగర్, వేములవాడ రూరల్ మండలం వట్టెంల, ఫాజుల్ నగర్, చందుర్తి మండలం మల్యాల, రుద్రంగి మండల కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను అదనపు కలెక్టర్ అకస్మికంగా తనిఖీ చేశారు.ధాన్యం కొనుగోళ్ళ ప్రక్రియపై ఆరా తీశారు. రైతులతో మాట్లాడి పంట మార్పిడి, లాభదాయక పంటల సాగుకు ప్రోత్సాహం, తదితర అంశాలపై చర్చించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ మాట్లాడుతూ

తుది దశకు చేరుకున్న ధాన్యం కొనుగోళ్ళ ప్రక్రియ సాధ్యమైనంత త్వరగా పూర్తి చేసేలా చూడాలని కొనుగోలు కేంద్రాల నిర్వాహకులను ఆదేశించారు. తూకం వేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల నుండి తరలించి కొనుగోళ్ళు పూర్తి చేసేలా చూడాలని ఆదేశించారు.రైతులు పంట మార్పిడిపై దృష్టి పెట్టి లాభదాయక పంటలను సాగు చేయాలని అదనపు కలెక్టర్ సూచించారు. ఆయిల్ పామ్ సాగు చేస్తే మొక్కలు, డ్రిప్ కు ప్రభుత్వం సబ్సిడీ అందజేస్తుందని తెలిపారు. సన్న వడ్లు, ఇతర ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయడానికి రైతులు ముందుకు రావాలని కోరారు. ఆయిల్ పామ్ ను సాగు చేస్తున్న రైతుల అనుభవాలను తెలుసుకుని అవగాహన పెంపొందించుకోవాలని అన్నారు.

# ప్రభుత్వం పథకాలను సద్వినియోగించుకుని అభివృద్ధి సాధించాలి.



**మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ సబేరా బేగం.**

**బలగం టీవీ, ఎల్లారెడ్డి పేట:**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలంలోని వెంకటాపూర్, పోతిరెడ్డిపల్లి, అగ్రహారం, హరిదాస్ నగర్, పధిర ,రాగట్లపల్లి గ్రామాలలో 99 రోజుల ప్రణాళికలో భాగంగా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏ ఎం సి చైర్మన్ సబేర బేగం పాల్గొన్నారు. ఈ సందర్భంగా సబేరా బేగం మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి పథకాలను ప్రజలకు అందేలా అధికారులు సహకరించాలని పిలుపునిచ్చారు. హరిదాస్ నగర్ గ్రామంలో వ్యవసాయ గోదాం నిర్మాణాలకు స్థలానికి కేటాయించాలని తాసిల్దార్ సుజాతను కోరారు. పధిర గ్రామంలో వడ్ల కొనుగోలు కేంద్రాన్ని మహిళలు దిగ్విజయంగా నడిపారని అభినందించారు. రాగట్లపల్లి లో సీసీ రోడ్ల నిర్మాణాలను పూర్తి చేయాలని అన్నారు. పోలీసులు సూచించిన విధంగా రోడ్డు భద్రత నియమావళిని ప్రజలు పాటించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సత్తయ్య, ఏపీఓ కొమురయ్య, ఏవో రాజశేఖర్, విద్యాధికారి కృష్ణ హరి, మండల సర్పంచ్ ల ఫోరమ్ అధ్యక్షులు దొమ్మాటి నర్సయ్య, సర్పంచులు మనేమ్మ, సిరం నాగరాజు , లక్ష్మయ్య , మామిండ్ల కిషన్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం..

**బాధితులకు అండగా నిలిచిన అధికారులు, ప్రజాప్రతినిధులు**

**బలగం టీవీ, ఎల్లారెడ్డిపేట:**



ఎల్లారెడ్డిపేట మండలం బండలింగంపల్లి గ్రామంలో జరిగిన అగ్నిప్రమాదం బాధితులకు అధికారులు, ప్రజాప్రతినిధులు మానవతా దృక్పథంతో స్పందించి తక్షణ సాయం అందించారు. రెండు రోజుల క్రితం మహమ్మద్ అయూబ్ నివాసంలో జరిగిన విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. ఈ ఘటనలో ఇంట్లోని నిత్యావసర సరుకులు, బట్టలు, విలువైన గృహోపకరణాలు పూర్తిగా కాలి బూడిదయ్యాయి. బాధితుల దీనస్థితిని గమనించిన సర్పంచ్ బాలరాజు నర్సాగౌడ్ వెంటనే స్పందించి, బాధితులకు 50 కిలోల బియ్యాన్ని అందజేయడమే కాకుండా, బాధితులకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు.

ఈ ఘటనపై పూర్తిస్థాయి విచారణ జరిపి నివేదిక సమర్పించాలని మండల తహసీల్దార్ సుజాత ఆదేశించగా, జీపీఓ మరియు ఆర్ఐలు సంఘటనా స్థలాన్ని పరిశీలించి జిల్లా కలెక్టర్ గరీమ అగర్వాల్‌కు నివేదిక పంపాగా,కలెక్టర్ ఆదేశాల మేరకు, తహసీల్దార్ సుజాత బాధితులకు తక్షణ ఆర్థిక సాయంగా రూ. 5 వేల నగదుతో పాటు, 50 కిలోల బియ్యం మరియు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. అధికారులతో పాటు ప్రజాప్రతినిధులు కూడా తమవంతు సాయాన్ని అందించారు. ఇందులో భాగంగా సర్పంచ్ బాలరాజు నర్సాగౌడ్ అదనంగా 50 కిలోల బియ్యం, ఏఎంసీ చైర్మెన్ సబేరా బేగం రూ. 2 వేల నగదు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సద్ది లక్ష్మారెడ్డి 25 కిలోల బియ్యాన్ని బాధితులకు వితరణ చేశారు. కష్టకాలంలో తమను ఆదుకుని, ఆత్మీయ పలకరింపుతో అండగా నిలిచిన ప్రతి ఒక్కరికీ మహమ్మద్ అయూబ్ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పాలకవర్గం, కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# హక్కుల సాధనకే వ్యవసాయ కార్మిక సంఘం మహాసభలు..



**- మహాసభల పోస్టర్ ఆవిష్కరణ**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

గ్రామీణ పేదలు, వ్యవసాయ కూలీల సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం చేపట్టిన పోరాటాన్ని ఉధృతం చేయాలని, రాబోయే జిల్లా స్థాయి మహాసభల ద్వారా భవిష్యత్తు కార్యాచరణను సిద్ధం చేయాలని సంఘం నాయకులు పిలుపునిచ్చారు. సిరిసిల్లలోని కామ్రేడ్ అమృతలాల్ శుక్ల భవన్‌లో జరిగిన సమావేశంలో మహాసభల పోస్టర్‌ను సంఘం నాయకులు ఆవిష్కరించారు.

?ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి గన్నెరం నర్సయ్య, జిల్లా నాయకులు అన్నల్ దాస్ గణేష్ మాట్లాడుతూ.. శ్రమకు తగిన ఫలితం దక్కని దుస్థితిలో వ్యవసాయ కూలీలు ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం కూలి రేట్ల పెంపు మాత్రమే కాకుండా, భూమి లేని నిరుపేదలకు ప్రభుత్వ భూముల పంపిణీ జరగాలని డిమాండ్ చేశారు. దళిత, గిరిజన వర్గాలపై జరుగుతున్న సామాజిక వివక్షకు వ్యతిరేకంగా ఈ మహాసభలు గళం విప్పుతాయని స్పష్టం చేశారు.

పని ప్రదేశాల్లో రోజుకు రెండుసార్లు ఫోటోలు తీయాలనే నిబంధనను తక్షణం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఫీల్డ్ అసిస్టెంట్లకు పని భద్రత కల్పించడంతో పాటు, వారికి కనీస వేతనాన్ని 26,000 రూపాయలకు పెంచాలని ప్రభుత్వాన్ని కోరారు. వ్యవసాయ కూలీలందరికీ సామాజిక భద్రతా పథకాలను కల్పిస్తూ, పనుల బిల్లులను సకాలంలో చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.రాబోయే రోజుల్లో నిర్వహించనున్న ఈ మహాసభలను జయప్రదం చేసేందుకు జిల్లాలోని వ్యవసాయ కూలీలు, ప్రజా సంఘాల కార్యకర్తలు అధిక సంఖ్యలో భాగస్వాములు కావాలని నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు సూరం పద్మ, ఐద్వా జిల్లా అధ్యక్షులు ఆడెపు రజిత తదితరులు పాల్గొన్నారు.



# మద్యం తాగి వాహనం నడిపితే జైలే..

**నిబంధనలు ఉల్లంఘిస్తే చీటింగ్ కేసులు**

**రాజన్న సిరిసిల్లలో పోలీసుల స్పెషల్ డ్రైవ్'.. 55 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు**

**-ఎస్పీ మహేష్ బి. గితే.**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :**

జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా రాజన్న సిరిసిల్ల పోలీసులు కఠిన చర్యలకు ఉపక్రమించారు. బుధవారం రాత్రి వరకు జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 55 మందిని గుర్తించి కేసులు నమోదు చేశారు. అలాగే, నంబర్ ప్లేట్లు తొలగించిన మరియు మార్ఫింగ్ చేసిన 24 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.

ఈ సందర్భంగా ఎస్పీ మహేష్ బి. గితే మాట్లాడుతూ, జిల్లాలో ట్రాఫిక్ నిబంధనలను అతిక్రమిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ప్రతి రోజూ అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో నిరంతర తనిఖీలు నిర్వహిస్తున్నామని, మద్యం సేవించి వాహనాలు నడపడం, నంబర్ ప్లేట్లు కనిపించకుండా అడ్డుపెట్టడం లేదా మార్ఫింగ్ చేయడం వంటి చర్యలపై కఠినంగా వ్యవహరిస్తామని అన్నారు..?ప్రతి వాహనదారుడు తమ వాహనానికి నంబర్ ప్లేట్‌ను స్పష్టంగా కనిపించేలా అమర్చుకోవాలని సూచించారు. సరైన నంబర్ ప్లేట్లు ఉండటం వల్ల నేరాలకు పాల్పడే వారిని మరియు వాహనాలను దొంగిలించే వారిని గుర్తించడం పోలీసులకు సులభమవుతుందని పేర్కొన్నారు. నిబంధనలను అతిక్రమిస్తూ నంబర్ లేకుండా, నంబర్ ప్లేట్లకు అడ్డుపెట్టి లేదా సగం నంబర్లు తొలగించి వాహనాలు నడిపితే, వారిపై ట్రాఫిక్ కేసులతో పాటు చీటింగ్ కేసులు కూడా నమోదు చేస్తామని ఆయన వాహనదారులను హెచ్చరించారు.



# ఎమ్మెల్యే డా.కవ్వంపల్లి సహకారం తో బోర్ లు వేయించిన సర్పంచ్ యం. రాజు

**బలగం, టీవీ ఇల్లంతకుంట**

ఇల్లంతకుంట మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)తో పాటు 2వ వార్డులో తాగునీటి సమస్య నెలకొనడం తో సర్పంచ్ యం .రాజు ఎమ్మెల్యే డా.కవ్వంపల్లి సత్యనారాయణ దృష్టికి తీసుకెళ్లగా, ఆయన వెంటనే స్పందించి రెండు ప్రాంతాలకు బోర్‌వెల్‌లను మంజూరు చేయించారు. ఎమ్మెల్యే సహకారంతో కస్తూర్బా పాఠశాలలో బుధవారం, 2వ వార్డులో గురువారం బోర్‌వెల్ తవ్వక పనులు చేపట్టి విజయవంతంగా బోరెవెల్ ప్రారంభించారు.ఈ సందర్భంగా సర్పంచ్ యం .రాజు మాట్లాడుతూ ప్రజలకు, విద్యార్థినులకు భవిష్యత్తులో కూడా ఎలాంటి తాగునీటి సమస్యలు తలెత్తకుండా అవసరమైన చర్యలు చేపడుతున్నామని తెలిపారు. గ్రామాభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనలో ఎమ్మెల్యే డా.కవ్వంపల్లి సత్యనారాయణ ఎల్లప్పుడూ ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని పేర్కొన్నారు.

ప్రజల సమస్యలను వెంటనే గుర్తించి పరిష్కరించిన ఎమ్మెల్యే డా.కవ్వంపల్లి సత్యనారాయణ , సర్పంచ్ యం .రాజు కి, వార్డు సభ్యుడు రేగుల కార్తిక్ కి స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు రాకం సుమన్, మామిడి శ్రీనివాస్, కునబోయిన రఘు, స్థానిక నాయకులు కొట్టె వెంకటి, దయ్యాల మహేష్, వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



# ఫిట్‌నెస్ లేని స్కూల్ బస్సులను సీజ్ చేస్తాం..

**బలగం టీవీ,రాజన్న సిరిసిల్ల:**

వేసవి సెలవుల అనంతరం జిల్లాలో విద్యా సంస్థలు పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో, విద్యార్థుల రవాణా భద్రతపై రాజన్న సిరిసిల్ల జిల్లా రవాణా శాఖ ప్రత్యేక దృష్టి సారించింది.కేవలం వాహనాల ఫిట్‌నెస్‌కే పరిమితం కాకుండా, డ్రైవర్ల నైపుణ్యంపై కూడా రవాణా శాఖ కఠిన నిబంధనలు అమలు చేస్తోంది. విద్యా సంస్థల బస్సులను నడిపే డ్రైవర్లు తప్పనిసరిగా ఇంటర్నేషనల్ డ్రైవర్ ట్రైనింగ్ స్కూల్‌లో మూడు రోజుల ప్రత్యేక శిక్షణ పూర్తి చేసి, సర్టిఫికేట్ పొందాలని నిబంధన విధించారు. ఇటువంటి సర్టిఫికెట్ సమర్పించిన డ్రైవర్లు ఉన్న వాహనాలకు మాత్రమే ఫిట్‌నెస్ ధృవీకరణ పత్రాలు జారీ చేస్తామని అధికారులు స్పష్టం చేశారు

ఈ సందర్భంగా ఆర్టీఓ శ్రీనివాస్ మాట్లాడుతూ పాఠశాలలు, కళాశాలల బస్సులు తప్పనిసరిగా ఫిట్‌నెస్ పరీక్షలు పూర్తి చేసుకోవాలని, నిబంధనలు పాటించని వాహనాలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రస్తుతం జిల్లాలో మొత్తం 168 విద్యా సంస్థల బస్సులు ఉండగా, అందులో కేవలం 87 బస్సులు మాత్రమే ఇప్పటివరకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్లను పొందాయని అన్నారు . మిగిలిన వాహనాల యజమానులు తక్షణమే సంబంధిత కార్యాలయానికి వచ్చి ఫిట్‌నెస్ పరీక్షలు పూర్తి చేయించుకోవాలని సూచించారు. ఫిట్‌నెస్ లేని బస్సులను రోడ్లపైకి తెస్తే సీజ్ చేయడంతో పాటు చట్టపరమైన చర్యలు తప్పవని,విద్యార్థుల ప్రాణ భద్రత విషయంలో ఎటువంటి నిర్లక్ష్యాన్ని సహించేది లేదని అన్నారు . . విద్యా సంస్థల యాజమాన్యాలు అప్రమత్తంగా ఉండి, బస్సుల్లో భద్రతా ప్రమాణాలన్నీ సక్రమంగా ఉన్నాయో లేదో నిర్ధారించుకోవాలని, ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆర్టీఓ సూచించారు.



# ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు..

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

మండేపల్లి గ్రామపంచాయతీలో అశ్విని హాస్పిటల్ సత్యనారాయణ ఎల్లారెడ్డిపేట వారిచే ఉచిత కంటి వైద్య పరీక్షలు క్యాంప్ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గాధగోని సాగర్,వార్డు సభ్యులు కొమ్మెట మల్లేశం, కార్యదర్శి ముదం ప్రశాంత్, కారోబార్ లచ్చి రెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ దేవయ్య,దాసరి రవి తదితరులు పాల్గొన్నారు.



# విశాఖ వేదికగా జూలైలో ఎస్ఎఫ్ఐ జాతీయ మహాసభలు

**పోస్టర్ ఆవిష్కరించిన విద్యార్థి నాయకులు**

**బలగం టీవి, విశాఖపట్నం**

భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ జాతీయ సమావేశాలు జూలై 13,14,15 తేదీలలో విశాఖపట్నంలో నిర్వహిస్తున్నట్లు ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రసన్నకుమార్, అధ్యక్షులు రామ్మోహన్ తెలిపారు. గురువారం జగదాంబ సిఐటియు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జాతీయ సమావేశాలకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతీయ సమావేశాలకు దేశవ్యాప్తంగా ఉన్న అన్ని రాష్ట్రాల నుంచి 400 మంది ప్రతినిధులు హాజరు కానున్నారని చెప్పారు. కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం ప్రతిష్టాత్మకమైన నీట్ పరీక్ష నిర్వహణలో పూర్తిగా విఫలం చెందిందన్నారు. నీట్ పరీక్ష పేపర్ లీక్ కావడంతో, పరీక్షను రద్దు చేశారని, దీంతో ఈ పరీక్షకు హాజరైన 23 లక్షల మంది అభ్యర్థులు తీవ్రమైన ఆత్మ క్షోభకు గురయ్యారని చెప్పారు. అనేకమంది ఆత్మహత్యలకు పాల్పడ్డారని అన్నారు. కేవలం నీట్ పరీక్షలు మాత్రమే కాకుండా యుజిసి పరీక్షలు, ఆఖరికి సిబిఎస్ఎస్సి పరీక్షలను సక్రమంగా నిర్వహించలేని పరిస్థితి ఉందన్నారు. సిబిఎస్సి పరీక్ష నిర్వహణలో విఫలం చెందిన సి బి ఎస్ సి కార్యదర్శిని తొలగించారని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నూతన జాతీయ విద్యా విధానాన్ని ఎస్ఎఫ్ఐ పూర్తిగా వ్యతిరేకిస్తుందన్నారు. దేశంలో అన్ని రాష్ట్రాలకు అవసరమైన పాఠ్య పుస్తకాలను కేంద్ర ప్రభుత్వం జాతీయ నూతన విద్యా విధానం ప్రకారం రూపొందించి పంపిస్తుందని చెప్పారు. వాటి పుస్తకాలలో మతాన్ని బోధించే విధంగా వీటి రూపకల్పన ఉందన్నారు. విద్యను కేంద్రీకరించడం సరికాదన్నారు. విద్య వికేంద్రీకరణ జరగాలన్నారు. కేంద్ర ప్రభుత్వం, అలాగే రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ప్రైవేటు విద్యను ప్రోత్సహిస్తూ, ప్రభుత్వ విద్యను నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. వేసవి రోజులలో కూడా రాష్ట్రంలోని కార్పొరేట్ విద్యాసంస్థలు పాఠశాలలను నిర్వహించాయని, వాటిపై ఎటువంటి చర్య లేదన్నారు. ఎస్ ఎస్ సి లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు

ఉన్నతంగా రాణించారని గొప్పలు చెప్పిన విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ అడ్డగోలుగా ప్రైవేట్ విద్యా సంస్థలను ప్రోత్సహించడంతో, ఈ ఏడాది లక్ష మంది విద్యార్థులు ప్రభుత్వ స్కూళ్లకు దూరమైనట్టు ప్రభుత్వ లెక్కలే చెబుతున్నాయన్నారు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ యూనివర్సిటీలలో అధ్యాపకుల పోస్టులు 5 వేలు ఖాళీలు ఉన్నాయన్నారు. గీతం వంటి ప్రైవేటు విద్యాసంస్థను అధికార పార్టీ వారే నడుపుతూ, ప్రభుత్వ యూనివర్సిటీలను నిర్వీర్యం చేస్తున్నారని ఆరోపించారు. విద్యా వ్యవస్థలో సమూలమైన మార్పులు తీసుకురావాలని కోరుతూ, విద్యను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని, ఎస్ఎఫ్ఐ పోరాటం చేస్తుందన్నారు. ఇందుకోసం అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలిపారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు పి.సాయి తేజ, ప్రధాన కార్యదర్శి జి. అజయ్ తదితరులు పాల్గొన్నారు.

# ఢిల్లీ అగ్నిప్రమాద ఘటన.. హోటల్ యజమాని అరెస్ట్

**బలగం టీవి, న్యూఢిల్లీ**

ఢిల్లీలోని మాల్వీయ నగర్‌లోని ఓ హోటల్‌లో బుధవారం జరిగిన అగ్నిప్రమాదంలో 21 మంది మృతిచెందిన ఘటనలో ఆ హోటల్ ఓనర్ లవ్‌కేశ్ బజాజ్‌ను నాలుగు రోజుల పోలీసు కస్టడీకి పంపిస్తూ ఢిల్లీ కోర్టు ఆదేశాలు జారీ చేసింది. జుడిషియల్ మెజిస్ట్రేట్ భాను ప్రతాప్ సింగ్ ఈ ఆదేశాలు ఇచ్చారు. దర్యాప్తు కోసం కస్టడీలోకి తీసుకోవాలని ఢిల్లీ పోలీసులు అభ్యర్థించారు. అగ్నిప్రమాదం వేళ నిర్లక్ష్యం కింద కేసు బుక్ చేశారు. ఫ్లోరిష్ స్టే బీ అండ్ బీలో జరిగిన అగ్నిప్రమాదంలో మృతిచెందిన వారిలో ఎక్కువ శాతం మంది విదేశీయులు ఉన్నారు. సమీప ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న వారి బంధువులే ఆ మృతుల్లో ఉన్నారు. అయితే ఏ కారణం చేత మంటలు వ్యాపించాయో ఇంకా స్పష్టంగా తెలియలేదు. ఎక్మి–లోరిష్ స్టే హోటల్ కోసం బెడ్ అండ్ బ్రేక్‌ఫాస్ట్ స్కీమ్ కింద హోటల్ ఓనర్ బజాజ్ లైసెన్సు తీసుకున్నారు. కానీ ఆ లైసెన్సు ప్రకారం అతిథులకు కేవలం ఆరు రూమ్‌లు మాత్రమే ఉంటాయి. కానీ ప్రాథమిక విచారణ ప్రకారం.. ఎక్మి–లోరిష్ స్టేలో 25 రూమ్‌లు ఆపరేటింగ్‌లో ఉన్నట్లు తెలిసింది. బేస్మెంట్‌లో ఉన్న అకామిడేషన్‌ను కూడా వాడుతున్నారు. ఆ ప్రాపర్టీకి మొత్తం ఓనర్ బజాజ్ ఒక్కడే. జై మిశ్రా అనే వ్యక్తికి మేనేజ్మెంట్ అప్పగించినట్లు ఆయన చెప్పారు. అయితే మిశ్రా కోసం ప్రస్తుతం పోలీసులు గాలిస్తున్నారు. అతను పరారీలో ఉన్నాడు. బీ అండ్ బీ స్కీమ్‌ను 2007లో ప్రవేశపెట్టారు. ఆ స్కీమ్‌లో సురక్షితమైన, తక్కువ ఖర్చుతో కూడిన వసతిని ఇవ్వనున్నారు. బుధవారం జరిగిన ప్రమాదంలో 21 మంది మృతిచెందగా, దాంట్లో 12 మంది విదేశీయులు ఉన్నారు.



# రెండోరోజూ అమరావతిలో నారాయణ పర్యటన

**వాగుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి**

**వర్షాకాలం నీటి జాగ్రత్తలపై మంత్రి సూచనలు**

**బలగం టీవి, అమరావతి**

వర్షాకాలం దృష్ట్యా రాజధాని అమరావతిలో వాగుల అభివృద్ధి పనులకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తోంది. వాగుల అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి సారించింది. పురపాలక శాఖ మంత్రి పి నారాయణ రెండోరోజు గురువారం రాజధాని అమరావతిలో పర్యటించారు. కొండవీటి వాగు అభివృద్ధి పనులను పరిశీలించారు. ఎన్–9,8,7రోడ్లలో కొండవీటి వాగుపై నిర్మిస్తున్న బ్రిడ్జిల పనుల పురోగతిపై ఆరా తీశారు. బ్రిడ్జిల కింద కొండవీటి వాగు ప్రవాహానికి ఆటంకం లేకుండా మట్టి తొలగించాలని అధికారులను ఆదేశించారు. కొండవీటి వాగు వెడల్పు తక్కువగా ఉన్నచోట మరింత వెడల్పు చేయాలని సూచించారు. నీరుకొండలో నిర్మిస్తున్న రిజర్వాయర్ పనులను కూడా మంత్రి పరిశీలించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ రాజధానిలో ట్రంక్ రోడ్లు, బ్రిడ్జిలు, వాగుల అభివృద్ధి పనులు వేగంగా జరుగు తున్నాయని మంత్రి చెప్పారు. ట్రంక్ రోడ్లపై 43,ఎల్ పి ఎస్ (ల్యాండ్ పూలింగ్)జోన్లలో 32 బ్రిడ్జిలను నిర్మిస్తున్నామని మంత్రి చెప్పారు. వర్షాకాలంలో కొండవీటివాగు ప్రవాహానికి ఇబ్బంది లేకుండా మట్టి తొలగింపు పనులు ముమ్మరంగా జరుగుతున్నాయన్నారు. శాఖమూరు, పెనుమాక, నీరుకొండ రిజర్వాయర్లలో సగం పని పూర్తయిందని చెప్పారు. కొండవీటివాగు 23.7 కిలోమీటర్లు, పాలవాగు 16.7 కిలోమీటర్లు, గ్రేవిటీ కాలువ 7.84 కిలోమీటర్లు అభివృద్ధి చేస్తున్నామని మంత్రి చెప్పారు. నీరుకొండ రిజర్వాయర్ 440 ఎకరాలలో నిర్మాణం జరుగుతోందని అన్నారు. వైసిపి నాయకులు రైతుల ను రెచ్చగొడుతున్నారని, విభేదాలు సృష్టించి రాజధానిని విధ్వంసం చేయాలని చూస్తోందని మండిపడ్డారు. అమరావతిపై వైసిపి కమిటీలు వేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. రైతుల భూములను వెనక్కి ఇచ్చేస్తామని వైసిపి నాయకులు చెబుతున్నారని, భవనాలు, రోడ్లు, పైపు లైన్లు ల నిర్మాణం పూర్తయ్యాక సిఎంగా పనిచేసిన వ్యక్తి అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని మంత్రి అన్నారు. రాజధాని పర్యటనలో మంత్రి వెంట అమరావతి అభివృద్ధి సంస్థ (ఎడిసి) ఛైర్ పర్సన్ డి లక్ష్మీ పార్థసారథి, సి ఆర్ డి ఎ,ఎడిసి చీఫ్ ఇంజినీర్లు ఇతర అధికారులు ఉన్నారు.

# భవిష్యత్తు అవసరాలకు పెట్టుబడి

**గూగుల్ తీరును అభినందించన ఉదయ్ కోటక్**

**బలగం టీవి, ముంబై**

కోటక్ మహీంద్రా బ్యాంక్ వ్యవస్థాపకుడు ఉదయ్ కోటక్ తాజాగా భారతీయ వ్యాపార సంస్థలను ఉద్దేశించి కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రపంచ దిగ్గజ కార్పొరేట్ సంస్థలు వేల కోట్లను ఆర్జిస్తున్నప్పటికీ సంతృప్తి చెందకుండా భవిష్యత్తుపై పెట్టుబడులు పెడుతున్న వైనాన్ని ప్రస్తావించారు. ఈ సందర్భంగా గూగుల్ గురించి ప్రత్యేకంగా పేర్కొన్నారు. ఈ సంస్థ ఆర్థిక సామర్థ్యం చూస్తుంటే ఆశ్చర్యం కలుగుతోందని అన్నారు. 'గూగుల్ వార్షిక లాభం 160 బిలియన్ డాలర్లు. గత త్రైమాసికంలో 62 బిలియన్‌లను ఆర్జించింది. సంస్థ మార్కెట్ విలువ 4.5 ట్రిలియన్‌లు. భారతీయ కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్, లాభాల కంటే ఇది ఎక్కువ. ఇది భారతీయ కంపెనీలకు మేలు కొలుపు కావాలి. ప్రస్తుత పరిస్థితి ఎంత మెరుగ్గా ఉన్నప్పటికీ భవిష్యత్తుపై పెట్టుబడి పెట్టాలి' అని ఎక్స్‌లో పోస్టు పెట్టారు. ఈ పోస్టు నెట్టింట తెగ వైరల్ అవుతోంది. కృత్రిమ మేధపై పెట్టుబడుల కోసం ఇటీవల గూగుల్ ఏకంగా 80 బిలియన్ డాలర్లను సేకరించేందుకు ప్రణాళిక ఆవిష్కరించింది. ఇది ప్రపంచవ్యాప్తంగా సంచలనాన్ని సృష్టించింది. ప్రభుత్వాలు నిధుల సేకరణ జరిపే స్థాయిలో ఒక కార్పొరేట్ కంపెనీ దీర్ఘకాలిక వ్యూహంతో నిధులు సేకరించడంతో పెద్ద చర్చుకు దారి తీసింది.

# పవన్ కళ్యాణ్ తెలంగాణకు వ్యతిరేకంగా మాట్లాడారా?

**మీటింగ్‌కు అనుమతి ఎందుకు ఇవ్వలేదో చెప్పాలి**

**ఇంకా సెంటిమెంట్ రాజకీయాలతో మోసం చేస్తే ఊరుకోరు**

**బిఆర్ఎస్, కాంగ్రెస్‌ల తీరుపై మండిపడ్డ బిజెపి అధ్యక్షుడు**

**బలగం టీవి, హైదరాబాద్**



ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తెలంగాణకు వ్యతిరేకంగా ఎప్పుడు మాట్లాడలేదని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రాంచందర్ రావు అన్నారు. ఆయన మీటింగ్‌కి అనుమతి ఇస్తే ఏమవుతుందని రాంచందర్ రావు ప్రశ్నించారు. గురువారం హైదరాబాద్‌లో రాంచందర్ రావు మీడియాతో మాట్లాడారు. తెలంగాణ సెంటిమెంట్‌ని మరోసారి రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని దుయ్యబట్టారు. తెలంగాణను వ్యతిరేకించిన ఎంఐఎంని ఎందుకు దగ్గరకు తీసుకున్నారని ప్రశ్నించారు. తెలంగాణ

సెంటిమెంట్ పేరుతో మళ్లీ ప్రజలను రెచ్చగొట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయని రాంచందర్ రావు ఆగ్రహించారు. తెలంగాణకు వ్యతిరేకంగా మాట్లాడిన వారితో చేతులు కలిపింది ఎవరో..? బీఆర్ఎస్ నేతలు చెప్పాలని ప్రశ్నించారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొనని శక్తులతో అధికార రాజకీయాలు చేసింది ఎవరు..? అని నిలదీశారు. తెలంగాణను తిట్టిన వారిని, ఉద్యమకారులను అవమానించిన వారిని బీఆర్ఎస్‌లో చేర్చి పదవులు ఇచ్చింది ఎవరు..? అని ప్రశ్నించారు. తెలంగాణ పేరుతో రాజకీయాలు చేసే ముందు మీ రాజకీయ చరిత్రను ఒకసారి ప్రజలకు గుర్తు చేయాలని అన్నారు. తెలంగాణ ఆత్మగౌరవం మీద ప్రేమ ఉంటే డ్రామాలు కాదని... నిజాలు మాట్లాడాలని సవాల్ విసిరారు. ప్రజలు ఇప్పుడు భావోద్వేగాలకు కాదని, మీ గతానికి కూడా లెక్క అడిగే స్థితిలో ఉన్నారని పేర్కొన్నారు. పవన్ కల్యాణ్.. జనసేన సభ కోసం అనుమతి అడిగారని... ఇచ్చి ఉంటే కథ అక్కడే ముగిసేదని.. సభకు అనుమతి ఎందుకు ఇవ్వలేదో కాంగ్రెస్ సర్కార్ చెప్పాలని రాంచందర్ రావు ప్రశ్నించారు. ఈ సమావేశం పెట్టుకోవడం ప్రతి ఒక్కరి ప్రజాస్వామ్య హక్కు అని చెప్పారు. దాన్ని అడ్డుకోవడమే ఎందుకు జరిగిందో సమాధానం చెప్పాలని నిలదీశారు. పవన్ కల్యాణ్ అంశాన్ని బీజేపీ మీద రుద్దే ప్రయత్నం చేయడం రాజకీయ దివాళాకోరుతనమని ధ్వజమెత్తారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ, ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్ కలిస్తేనే కొందరి గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయని అన్నారు. తెలంగాణను వ్యతిరేకించిన వారికి కేసీఆర్ హయాంలో మంత్రి పదవులు ఇచ్చారని రాంచందర్ రావు ఆగ్రహించారు. ఏపీలో బీఆర్ఎస్ ఆఫీస్ పెట్టలేదా..? అని ప్రశ్నించారు. తెలంగాణ నిధులను పంజాబ్‌లో కేసీఆర్ పంచలేదా..? అని నిలదీశారు. తెలంగాణ ఉద్యమకారులను గుర్తించలేని పరిస్థితిలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఉందని విమర్శించారు. బీజేపీ సపోర్ట్ చేయడంతోనే తెలంగాణ వచ్చిందని పేర్కొన్నారు. ఆనాడు పార్లమెంటులో తమ పార్టీ మద్దతు ప్రకటించిందని అన్నారు. సుష్మా స్వరాజ్ బేషరతుగా మద్దతు ఇస్తేనే తెలంగాణ వచ్చిందని గుర్తు చేశారు.

కాంగ్రెస్ సర్కార్ ఇస్తానని చెప్పిన జాబ్ క్యాలెండర్ ఏమైంది..? అని రాంచందర్ రావు ప్రశ్నించారు. 12 ఏళ్ల నుంచి నీళ్ల మీద ఒక పాలసీ కూడా ఎందుకు తేలేదని నిలదీశారు. తెలంగాణకు రావాల్సిన నీళ్ల వాటా కంటే తక్కువ వాటాను కేసీఆర్ ఒప్పుకున్నారని ప్రస్తావించారు. రాష్ట్రానికి రావాల్సిన కృష్ణా జలాలను డీకే శివకుమార్‌కి.. రేవంత్‌రెడ్డి బహుమతిగా ఇచ్చారని విమర్శించారు. మిగులు బడ్జెట్‌గా ఉన్న తెలంగాణను అప్పుల్లోకి నెట్టారని ధ్వజమెత్తారు. తెలంగాణ రాజకీయాల్లో బీజేపీ సూపర్ హీరో అని రాంచందర్ రావు అభివర్ణించారు. ముమ్ముందు బిజెపి తెలంగాణలో కీలకంగా మారుతుందన్నారు.

# తెలంగాణ ఆత్మగౌరవాన్ని కించపరిస్తే సహించేది లేదు..




**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :**

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఇటీవల తెలంగాణకు సంబంధించి చేసిన వ్యాఖ్యలు అత్యంత బాధ్యతారాహిత్యంగా ఉన్నాయని,తెలంగాణ ఆత్మగౌరవాన్ని కించపరిస్తే సహించేది లేదని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కంచర్ల రవి గౌడ్ అన్నారు. సిరిసిల్ల పట్టణంలో తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రవి గౌడ్ మాట్లాడుతూ, తెలంగాణ ఎవరిచ్చిన భిక్ష కాదని, దశాబ్దాల తరబడి విద్యార్థులు, యువకులు, ఉద్యోగులు చేసిన సుదీర్ఘ పోరాటాల ఫలితంగా ప్రాప్తించిన రాష్ట్రమని అన్నారు .

?ఉద్యమ చరిత్రను, తెలంగాణ ప్రజల మనోభావాలను తెలుసుకోకుండా బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న పవన్ కళ్యాణ్ ఇటువంటి వ్యాఖ్యలు చేయడం సరికాదని అన్నారు . రాజకీయ లబ్ధి కోసం తెలంగాణను వాడుకుంటూ, రెండు తెలుగు రాష్ట్రాల మధ్య స్నేహపూర్వక వాతావరణాన్ని దెబ్బతీయడం మానుకోవాలని సూచించారు. తెలంగాణ ప్రజలకు తమ ఆత్మగౌరవాన్ని కాపాడుకోవడం బాగా తెలుసని, రాష్ట్ర గౌరవాన్ని కించపరిచే ఏ ప్రయత్నాన్నైనా సహించే ప్రసక్తే లేదని హెచ్చరించారు.తన వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకుని, తెలంగాణ ప్రజలకు పవన్ కళ్యాణ్ బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ఆత్మగౌరవ రక్షణలో బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ అగ్రభాగంలో ఉంటుందని అన్నారు . ఈ కార్యక్రమంలో మట్టి శ్రీనివాస్, అరెల్లి వినయ్ కుమార్, సాదు శేఖర్, బైకని వేణుగోపాల్ యాదవ్, బల్యాల ప్రవీణ్, కోడం వెంకటేశం, ఐదరి శశి, రాజు తదితర నాయకులు పాల్గొన్నారు.

# అంత్యోదయ స్ఫూర్తితో ప్రజాసేవ చేయడమే బీజేపీ లక్ష్యం



**-బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు శాంత కుమార్**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

సమాజంలోని చివరి వ్యక్తికి సైతం అభివృద్ధి ఫలాలు అందాలనే 'అంత్యోదయ' లక్ష్యంతోనే భారతీయ జనతా పార్టీ నిరంతరం పనిచేస్తోందని, ఈ స్ఫూర్తితోనే ప్రతి కార్యకర్త ప్రజాసేవలో భాగస్వాములు కావాలని బీజేపీ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు శాంత కుమార్ పిలుపునిచ్చారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని వాసవి కళ్యాణ మండపంలో ?బీజేపీ జిల్లా అధ్యక్షులు రెడ్డబోయిన గోపి అధ్యక్షతన రెండు రోజుల పాటు జరిగిన 'పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ ప్రశిక్షణ అభియాన్–2026' శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా శాంత కుమార్ హాజరై మాట్లాడుతూ, భారతీయ జనతా పార్టీకి ఉన్న ప్రత్యేక సిద్ధాంతాలను, లక్ష్యాలను ప్రతి కార్యకర్త క్షుణ్ణంగా అర్థం చేసుకోవాలని సూచించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించడంలో కార్యకర్తలు చొరవ చూపాలని అన్నారు. క్రమశిక్షణ, అంకితభావం మరియు సేవా దృక్పథం కలిగిన కార్యకర్తలే పార్టీకి అసలైన బలం అని, అటువంటి కార్యకర్తలు క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేయాలని అన్నారు .?ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ చెన్నమనేని వికాసరావు, జిల్లా ఇన్చార్జ్ గంగాడి మోహన్ రెడ్డి, రాష్ట్ర నాయకులు ఎర్రం మహేష్, లింగంపల్లి శంకర్, అల్లాడి రమేష్, మట్ట వెంకటేశ్వర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శులు పొన్నాల తిరుపతిరెడ్డి, సిరికొండ శ్రీనివాస్, కరెడ్ల మధుకర్, కరీంనగర్ పార్లమెంట్ కో–కన్వీనర్ ఆడెపు రవీందర్, దశరథం రెడ్డి, రాష్ట్ర ఎస్సీ మోర్చా కార్యదర్శి చంటి మహేష్, వివిధ స్థాయిల పదాధికారులు, ప్రజాప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో తగ్గని ఎండల తీవ్రత

**అంగన్‌వాడీ కేంద్రాలకు 14 వరకు సెలవులు**

**15న తిరిగి ప్రారంభించాలని ఆదేశాలు**

**బలగం టీవి, హైదరాబాద్**



రాష్ట్రంలో భానుడి భగభగలకు జనం అల్లాడిపోతున్నారు. మునుపెన్నడూ లేని విధంగా మే నెల ముగిసినా ఎండల తీవ్రత, వడగాల్పుల ప్రభావం ఏమాత్రం తగ్గడం లేదు. ఈ నేపథ్యంలో చిన్న పిల్లలు, విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలకు వేసవి సెలవులను పొడిగించింది. మంత్రి సీతక్క ఆదేశాల మేరకు మహిళా శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ శృతి ఓఝ వేసవి సెలవులను జూన్ 13 వరకు పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. జూన్ 14వ తేదీన ఆదివారం కావునా.. జూన్ 15 నుండి ఈ కేంద్రాలు యథావిధిగా తిరిగి పనిచేయడం ప్రారంభిస్తాయి.నిజానికి ముందస్తు ప్రణాళిక ప్రకారం జూన్ 2వ తేదీ నుంచే అంగన్‌వాడీ కేంద్రాలను, పాఠశాలలను పునఃప్రారంభించాలని ప్రభుత్వం భావించింది. అయితే, జూన్ మొదటి వారంలో కూడా ఉష్ణోగ్రతలు 40 నుండి 45 డిగ్రీల సెల్సియస్ దాటుతుండటం, మధ్యాహ్నం వేళల్లో తీవ్రమైన ఉష్ణగాలులు వీస్తుండటంతో తల్లిదండ్రుల నుంచి ఆందోళన వ్యక్తమైంది. చిన్న పిల్లలు ఎండ దెబ్బకు గురయ్యే ప్రమాదం ఉండటంతో ప్రభుత్వం తన నిర్ణయాన్ని మార్చుకుంది. రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలకు సైతం ఎండల తీవ్రత కారణంగా వేసవి సెలవులను పొడిగించిన సంగతి తెలిసిందే. పాఠశాలల మాదిరిగానే అంగన్‌వాడీ కేంద్రాలను కూడా జూన్ 14 వరకు మూసి ఉంచాలని, విద్యాసంస్థలతో పాటే జూన్ 15న ఒకేసారి తెరవాలని ప్రభుత్వం భావిస్తోంది. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే వారు 3 నుండి 6 సంవత్సరాల లోపు పిల్లలు కావడంతో వారికి రోగనిరోధక శక్తి తక్కువగా ఉంటుంది. ఇలాంటి వాతావరణంలో వారు బయటకు వస్తే వడదెబ్బ తగిలి డీహైడ్రేషన్, జ్వరం బారిన పడే అవకాశం ఉంది. అందుకే వైద్య ఆరోగ్య శాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖల సమన్వయంతో ప్రభుత్వం ఈ పొడిగింపు నిర్ణయం తీసుకుంది. సెలవుల పొడిగింపు కేవలం చిన్న పిల్లల రాకకు మాత్రమే వర్తిస్తుంది. అయితే అంగన్‌వాడీల ద్వారా గర్భిణులు, బాలింతలకు అందే పౌష్టికాహారం పంపిణీకి ఎలాంటి ఆటంకం కలగకుండా అధికారులు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టనున్నారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం పట్ల అంగన్‌వాడీ సిబ్బందితో పాటు, చిన్నారుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దీనికి సంబంధించిన అధికారిక మార్గదర్శకాలు, జీవో త్వరలోనే విడుదల కానున్నాయి.

# ఆస్పత్రిలో మృతురాలి మెడలో పుస్తెల తాడు మాయం

**పోలీసులకు ఫిర్యాదు చేసిన బంధువులు**

**బలగం టీవి, హైదరాబాద్**

యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరిలో దారుణం జరిగింది. మృతదేహంపై ఉన్న మూడు తులాల బంగారు పుస్తెల తాడును దుండగులు మాయం చేశారు. భువనగిరి జిల్లా ఆసుపత్రిలో చనిపోయిన మహిళ మెడ నుంచి మూడు తులాల బంగారు పుస్తెల తాడు మాయమైన ఘటన కలకలం రేపింది. వలిగొండ మండలం వర్కట్ పల్లికి చెందిన సుష్మిత అనే గర్భవతికి దమ్ము ఎక్కువగా వస్తుండటంతో అర్ధరాత్రి రెండు గంటల సమయంలో ఆమె భర్త నాగరాజు ఆమెను జిల్లా ఆసుపత్రికి తీసుకొచ్చాడు. తెల్లవారుజామున నాలుగు గంటలకు సుష్మిత చికిత్స పొందుతూ చనిపోయింది. పోస్టుమార్టం సమయంలో సుష్మితపై ఉన్న బంగారు ఆభరణాలు తీసుకోండని చెప్పడంతో కుటుంబ సభ్యులు ఆమె ఒంటిపై ఉన్న బంగారం గురించి చూడగా.. అప్పటికే ఆమె మెడలోని మూడు తులాల పుస్తెలా తాడు కనిపించలేదు. ఈ ఘటనపై.. ఆసుపత్రి సూపరింటెండెంట్‌తో పాటు పోలీసులకు సుష్మిత కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# గత రబీ కంటే రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోళ్లు..



**-రైతులకు అండగా ప్రభుత్వం..చివరి గింజ వరకు కొనుగోలు చేస్తాం**
**-జిల్లాలో తుది దశకు వడ్ల కొనుగోళ్లు**
**-ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :**

జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు తుది దశకు చేరుకున్నాయని, గత రబీ సీజన్‌తో పోలిస్తే ఈసారి రికార్డు స్థాయిలో కొనుగోళ్లు జరిగాయని,రైతులు పండించిన ప్రతి గింజనూ ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు బుధవారం వేములవాడ రూరల్ మండలం హన్మాజీపేట గ్రామానికి చెందిన గ్రామ ఉపసర్పంచ్ ఆవునూరి శంకరవ్వ శంకరయ్య వార్డు సభ్యులు ఆవునూరి కార్తీక్, కోడం రవి, గొర్రె నర్సవ్వ తో పాటు సుమారు 50 మంది ముఖ్య కార్యకర్తలతో కలిసి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీ చేరగా విప్ వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు..

ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సాగుతున్న కాంగ్రెస్ ప్రభుత్వ పాలనకు, నియోజకవర్గంలో తాము చేపడుతున్న నిరంతర అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై అనేక గ్రామాల్లో సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు ఇతర పార్టీల నుంచి పెద్ద ఎత్తున వలసలు వస్తున్నారని అన్నారు . నియోజకవర్గ పరిధిలోని ప్రతి గ్రామాన్ని మోడల్ విలేజ్‌గా తీర్చిదిద్దడమే తన ఆశయమని, అందుకోసం రాజకీయాలకు అతీతంగా నిధులు కేటాయిస్తున్నామని అన్నారు . హన్మాజీపేట గ్రామ ప్రగతికి, మౌలిక వసతుల కల్పనకు తన వంతుగా పూర్తి సహకారం అందిస్తానని భరోసా ఇచ్చారు.

### రైతులకు అండగా కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం

రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఇప్పటికే వడ్ల కొనుగోళ్లు తుది దశకు చేరుకున్నాయని,రైతులు పండించిన ప్రతి గింజనూ ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, ఐకేపీ కేంద్రాల ద్వారా పారదర్శకంగా ప్రక్రియ సాగుతోందని అన్నారు. అయితే, కొందరు వ్యక్తులు తమ రాజకీయ స్వార్థం కోసం, ఉనికిని చాటుకోవడం కోసం సామాజిక మాధ్యమాల్లో, బయట వడ్ల కొనుగోళ్లపై కావాలనే దుష్ప్రచారం చేస్తున్నారని అన్నారు .

నిన్నటి వరకు జిల్లాలో సుమారు 2,75,000 మెట్రిక్ టన్నుల వరి ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు అన్నారు . గత రబీ సీజన్‌లో 2,69,000 మెట్రిక్ టన్నుల వరి కొనుగోలు జరగగా, ఈసారి ఇప్పటికే గత ఏడాదికంటే 6,000 మెట్రిక్ టన్నులు అధికంగా కొనుగోలు జరిగిందన్నారు. ఇంకా జిల్లాలోని కొనుగోలు కేంద్రాల వద్ద మరో 35,000 మెట్రిక్ టన్నుల వరి వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నట్లు చెప్పారు. ఈసారి వరి దిగుబడి గణనీయంగా పెరిగినప్పటికీ రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, రైతు పండించిన చివరి గింజ వరకు కొనుగోలు చేయాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు చేపడుతోందని అన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద, రైస్ మిల్లర్ల వద్ద, గోదాముల వద్ద ఎలాంటి అంతరాయం లేకుండా నిరంతరం పర్యవేక్షణ కొనసాగుతోందన్నారు.

రైస్ మిల్లుల్లో స్థలాభావం లేదా గోదాముల్లో నిల్వ సమస్యలు తలెత్తిన సందర్భాల్లో కూడా జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రత్యామ్నాయ నిల్వ సదుపాయాలు కల్పించి ధాన్యాన్ని వెంటనే తరలించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.అవసరమైన చోట్ల గోదాములు, నిల్వ కేంద్రాలు వినియోగంలోకి తెచ్చి రైతులకు ఇబ్బందులు లేకుండా వ్యవస్థను నడిపిస్తున్నామని అన్నారు . వ్యవసాయనికి మూడు గంటల విద్యుత్ సరిపోతుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నట్లు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తప్పుడు ప్రచారం చేస్తున్నారని అన్నారు..

వ్యవసాయనికి మూడు గంటల విద్యుత్ చాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎప్పుడూ చెప్పలేదని స్పష్టం చేశారు. ఉద్దేశపూర్వకంగానే కేటీఆర్ తప్పుడు వ్యాఖ్యలు చేస్తూ రైతులను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు . ఇలాంటి తప్పుడు ప్రచారాలను, పుకార్లను రైతులు, ప్రజలు ఎవరూ నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు. రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యత అని,ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారంటీలు, సంక్షేమ ఫలాలు అర్హులైన ప్రతి పేద కుటుంబానికి చేరేలా పార్టీ శ్రేణులు చొరవ చూపాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సోయినేని కరుణాకర్, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు సామ తిరుపతిరెడ్డి, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తీగల ఎల్లయ్య గౌడ్, డివిజన్ ఆత్మ కమిటీ మెంబర్ చెన్నాడి శ్యామల, జిల్లా డిసిసి కార్యదర్శి వకుళభరణం శ్రీనివాస్, బాలసాని శ్రీనివాస్ గౌడ్, పార్టీ మండల నాయకులు చెన్నాడి గోవర్ధన్ రెడ్డి, చిలక ప్రభాకర్, మర్రిపల్లి మల్లేశం, ప్రజాప్రతినిధులు, హన్మాజీపేట గ్రామ ప్రజలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు..



# టీకాల పంపిణీలో అలసత్వం వద్దు..

**-సమయపాలన పాటించాలని అధికారుల ఆదేశం**
**- డీఎంహెచ్వో డాక్టర్ రజిత**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :**

టీకాల ప్రక్రియలో ఎటువంటి అలసత్వం వహించకూడదని డిఎంహెచ్వో డాక్టర్ రజిత అధికారుల ను హెచ్చరించారు. ముస్తాబాద్ మండలంలోని ఆవునూరు గూడెం ఉపకేంద్రం, చికోడు ఉపకేంద్రం మరియు గంభీరావుపేట మండలంలోని లింగన్నపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను డిఎంహెచ్వో డాక్టర్ రజిత ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్రాల రికార్డులను మరియు వ్యాధి నిరోధక టీకాల నిల్వలను నిశితంగా పరిశీలించారు.

ఈ సందర్భంగా డిఎంహెచ్వో డాక్టర్ రజిత మాట్లాడుతూ పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలను నిర్ణీత సమయంలో మరియు సరైన మోతాదులో అందించాలని అన్నారు . 0-5 సంవత్సరాల లోపు పిల్లలకు భవిష్యత్తులో ప్రాణాంతక వ్యాధులు రాకుండా టీకాలు ఎంతగానో దోహదపడతాయని అన్నారు. టీకా వేయించుకున్న తర్వాత పిల్లలకు స్వల్పంగా జ్వరం రావడం, ఇంజెక్షన్ చేసిన ప్రదేశంలో చర్మం ఎర్రబడడం లేదా వాపు రావడం వంటివి సహజమని, ఇవి మూడు రోజుల్లో తగ్గిపోతాయని, కావున తల్లిదండ్రులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు . సిబ్బంది విధుల్లో సమయపాలన తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు. ఈ తనిఖీ కార్యక్రమంలో జిల్లా వ్యాధి నిరోధక టీకాల ప్రోగ్రాం అధికారి డాక్టర్ సంపత్ కుమార్ మరియు డిప్యూటీ డెమో రాజ్ కుమార్ పాల్గొన్నారు.

# అంగరంగ వైభవంగా బోనాల జాతర

**బలగం టీవీ, బోయినిపల్లి;**



రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం నీలోజిపల్లి గ్రామంలో పోచమ్మ, నల్లపోచమ్మ, మహాలక్ష్మి, దుర్గమ్మ అమ్మవార్ల బోనాల జాతరను గ్రామ మహిళలు బుధవారం రోజున అంగరంగ వైభవంగా నిర్వహించారు.ఈ సందర్భంగా మహిళలు సంప్రదాయ వస్త్రధారణలో బోనాలు ఎత్తుకుని భక్తిశ్రద్ధలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. బైండ్ల డప్పు సప్పుల నడుమ గ్రామ వీధుల గుండా ఘనంగా ఊరేగింపు నిర్వహించి, ఆలయం వరకు వెళ్లారు. అనంతరం పోచమ్మ తల్లికి బోనం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామంలో భక్తి, ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. గ్రామ మహిళలు, గ్రామస్తులు అమ్మవారిని పాడిపంటలు సమృద్ధిగా పండాలని, పశుసంపద అభివృద్ధి చెందాలని, ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, మహిళలు, యువకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రాజన్న ఆలయ విస్తరణ పనుల్లో వేగం పెంచాలి



**- కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**బలగం టీవీ,వేములవాడ**

వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ విస్తరణ పనుల్లో మరింత వేగం పెంచాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. వీటీఏడీఏ (వేములవాడ టెంపుల్ ఏరియా డెవలప్ మెంట్ అథారిటీ) ఆధ్వర్యంలో రాజన్న ఆలయ విస్తరణ, అభివృద్ధి పనులు, నిత్యాన్నదాన సత్రం, బద్ది పోచమ్మ ఆలయం అభివృద్ధి పనులు, ప్రధాన రోడ్డు విస్తరణ పనులను కలెక్టర్ గరిమ అగ్రవాల్ బుధవారం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. పనుల పురోగతిపై ఆర్ అండ్ బీ అధికారులను అడిగి తెలుసుకున్నారు. పనులు వేగంగా పూర్తి చేయడంపై అధికారులకు పలు సూచనలు చేశారు.రాజన్న ప్రధాన ఆలయ విస్తరణ, ఇతర ప్రతి అభివృద్ధి పనికి సంబంధించి ఒక ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్లాలని సూచించారు. పనుల్లో వేగం పెంచాలని, అవసరమైన పనివారి సంఖ్య మరింత పెంచాలని ఆదేశించారు.రాజన్న ఆలయం నుంచి మూల వాగు బ్రిడ్జి వరకు కొనసాగుతున్న ప్రధాన రోడ్డు విస్తరణ పనులను కలెక్టర్ గరిమ అగ్రవాల్ పరిశీలించారు. పనుల పురోగతి, పూర్తి చేయడం పై వేములవాడ మున్సిపల్ అధికారులను ఆరా తీశారు. పనులు వేగంగా పూర్తి చేసి.. వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు.రాజన్న, బద్ది పోచమ్మ ఆలయాల విస్తరణ, అభివృద్ధి పనులు, నిత్యాన్నదానం సత్రం నిర్మాణ పనులు, రోడ్డు విస్తరణ పనులు ఎప్పటిలోగా పూర్తి చేస్తారో గడువు తేదీ ఇవ్వాలని ఆయా శాఖల అధికారులకు జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు. సమావేశంలో ఆర్అండ్ బీ ఈఈ నరసింహాచారి, వేములవాడ ఆర్డీఓ కే ఎస్ బీ కుమారి, ఆలయ డిప్యూటీ ఈఓ భాస్కర్ శర్మ, ఆర్ అండ్ బీ డీఈ శాంతయ్య, వేములవాడ మున్సిపల్ కమిషనర్ లోకేష్, తహసీల్దార్ జయంత్, టీపీఓ అన్సార్ తదితరులు పాల్గొన్నారు.



# పర్యావరణ పరిరక్షణలో యువతే కీలకం..

**-సిరిసిల్లలో పర్యావరణ క్విజ్ పోటీ**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన “99 రోజుల ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక”లో భాగంగా, పర్యావరణ పరిరక్షణపై యువతకు అవగాహన కల్పించేందుకు సిరిసిల్లలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో, జేఎన్‌టీయూ కళాశాల ఆఫ్ ఇంజినీరింగ్ మరియు ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థుల కి పర్యావరణ క్విజ్ పోటీని నిర్వహించారు.

ఈ పోటీల ద్వారా వాయు, జల కాలుష్య నివారణ, ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణం, ఘన వ్యర్థాల నిర్వహణ, శక్తి సంరక్షణ వంటి కీలక అంశాలపై విద్యార్థులకు లోతైన అవగాహన కల్పించారు. విద్యార్థులు ఈ క్విజ్ పోటీల్లో ఎంతో ఉత్సాహంగా పాల్గొని, పర్యావరణ అంశాలపై తమకు ఉన్న పరిజ్ఞానాన్ని చాటిచెప్పారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి హాజరైన అధికారులు మాట్లాడుతూ, ప్రకృతి వనరులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, ముఖ్యంగా యువత పర్యావరణ హిత జీవన విధానాలను అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. పర్యావరణాన్ని పరిరక్షించడం ద్వారానే భవిష్యత్తు తరాలకు సుస్థిరమైన అభివృద్ధిని అందించగలమని అన్నారు . పర్యావరణ పరిరక్షణలో యువతను భాగస్వాములను చేయడమే ఈ క్విజ్ ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి నోడల్ అధికారి, జేఎన్‌టీయూ-యూసీఈఆర్ ప్రిన్సిపాల్‌తో పాటు పలువురు అధ్యాపకులు, సిబ్బంది పాల్గొని విద్యార్థులను ప్రోత్సహించారు.

# ప్లాస్టిక్ రహిత సమాజం కోసం కృషి చేయాలి

**-డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ నాగేశ్వరరావు**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :**

పర్యావరణ పరిరక్షణ మన అందరి బాధ్యత అని ఉద్ఘాటించారు. కాలుష్య నివారణకు ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేధించాలని డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. ప్రపంచ సైకిల్ దినోత్సవం సందర్భంగా బుధవారం నిర్వహించిన సైకిల్ ర్యాలీ ని నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహం నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ బతుకమ్మ ఘాట్ వరకు కొనసాగింది. విద్యార్థిని విద్యార్థులు, వ్యాయామ ఉపాధ్యాయులు మరియు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ర్యాలీలో పాల్గొనగా, ముఖ్య అతిథులుగా డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ నాగేశ్వరరావు, జిల్లా యువజన మరియు క్రీడల శాఖ అధికారి ఏ. రాందాస్ హాజరయ్యారు.

ఈ సందర్భంగా డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ నాగేశ్వరరావు మాట్లాడుతూ భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించాలంటే, మొక్కలు నాటడం అత్యంత ఆవశ్యకమని, నాటిన ప్రతి మొక్కను సంరక్షించే బాధ్యతను యువత భుజాన వేసుకోవాలని కోరారు. జిల్లా యువజన మరియు క్రీడల శాఖ అధికారి ఏ. రాందాస్ మాట్లాడుతూ, వ్యాయామంతో కూడిన సైక్లింగ్ ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని, ఇటువంటి కార్యక్రమాల వల్ల విద్యార్థులలో సామాజిక బాధ్యత పెరుగుతుందని తెలిపారు.





## ప్రాణదాత కానిస్టేబుల్ భాస్కర్‌కు సెల్యూట్..

**సీపీఆర్ చేసి ప్రాణం పోసిన కానిస్టేబుల్..**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :**

రాజన్న సిరిసిల్ల జిల్లా కోర్టు ఆవరణలో గుండెపోటుతో కుప్పకూలిన వ్యక్తిని తక్షణమే స్పందించి కాపాడిన ఘటన స్థానికంగా ప్రశంసలు అందుకుంటోంది. ఇల్లంతకుంట మండలం కట్కూరు గ్రామానికి చెందిన వెంకటేశం ఒక కేసు నిమిత్తం బుధవారం జిల్లా కోర్టుకు హాజరయ్యారు. కోర్టు ప్రాంగణంలో ఉండగా ఆయన ఒక్కసారిగా గుండెపోటుతో కుప్పకూలిపోయారు. ?అక్కడే విధుల్లో ఉన్న కొనరావుపేట పోలీస్ స్టేషన్ కోర్టు కానిస్టేబుల్ భాస్కర్, పరిస్థితిని గమనించి ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే సీపీఆర్ చేశారు. కానిస్టేబుల్ భాస్కర్ చాకచక్యంగా వ్యవహరించి సకాలంలో సీపీఆర్ చేయడంతో బాధితుడు స్పృహలోకి రావడమే కాకుండా, ప్రాణాపాయం నుండి బయటపడ్డారు. సకాలంలో స్పందించి ప్రాణాలను కాపాడిన కానిస్టేబుల్ భాస్కర్ సమయస్ఫూర్తిని ఎస్పీ మహేష్ బి. గితే ప్రత్యేకంగా అభినందించారు. పోలీసులకు ఉన్నత అధికారులు ఇప్పించిన సీపీఆర్ శిక్షణ ఒక నిండు ప్రాణాన్ని కాపాడటంలో ఎంతగానో ఉపయోగపడిందని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం జన్మదినం సందర్భంగా ప్రత్యేక గీతం ఆవిష్కరణ..

**బలగం టీవీ,? బోయినిపల్లి:**

చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పుట్టినరోజు వేడుకలు జూన్ 5న జరగనున్న నేపథ్యంలో, రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండల యూత్ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు నాగుల వంశీ గౌడ్,ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పై ఒక ప్రత్యేక పాటను రూపొందించారు. ఈ పాటను బుధవారం కరీంనగర్‌లోని ఎమ్మెల్యే నివాసంలో స్వయంగా మేడిపల్లి సత్యం చేతుల మీదుగా ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా వంశీ గౌడ్ మాట్లాడుతూ, నిరంతరం ప్రజల కష్టసుఖాల్లో భాగస్వామి అవుతూ, ప్రజాసేవలో తరిస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో నిండు నూరేళ్లు జీవించాలని కోరుకుంటూ ఈ గీతాన్ని రూపొందించినట్లు తెలిపారు. అలాగే ఎమ్మెల్యే నాయకత్వంలో మండల అభివృద్ధికి మరియు పార్టీని మరింత బలోపేతం చేసేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సువిన్ యాదవ్, పార్టీ నాయకులు సుధాకర్, భాస్కర్, శాలివాహన శ్రీనివాస్, అనిల్ దేవయ్య తదితరులు పాల్గొన్నారు.





## యువత క్రీడల వైపు మళ్లాలి..

**-చల్మెడ లక్ష్మీనరసింహారావు**

**బలగం టీవీ,వేములవాడ:**

నేటి యువత చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ, క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించుకోవాలని బిఆర్ఎస్ పార్టీ వేములవాడ నియోజకవర్గ ఇన్చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు పిలుపునిచ్చారు. పోలీస్ అమరవీరుల స్మారకార్థం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రాజన్న ప్రీమియర్ లీగ్ సీజన్-8 గ్రేస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్‌ను చల్మెడ లక్ష్మీనరసింహారావు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.?ఈ సందర్భంగా చల్మెడ లక్ష్మీనరసింహారావు టాస్ వేసి, మైదానంలో క్రీడాకారులందరినీ పరిచయం చేసుకున్నారు. అనంతరం లక్ష్మీనరసింహారావు మాట్లాడుతూ

క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని, యువత క్రమశిక్షణతో కూడిన జీవితాన్ని గడపడానికి క్రీడలు ఎంతగానో తోడ్పడతాయని పేర్కొన్నారు. తమ నియోజకవర్గంలో క్రీడాకారులను ప్రోత్సహించేందుకు, వారికి అండగా నిలిచేందుకు తాము ఎల్లప్పుడూ ముందుంటామని హామీ ఇచ్చారు.

?ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ నిమ్మశెట్టి విజయ్, గోలి మహేష్, సీనియర్ నాయకులు వెంగళ శ్రీకాంత్ గౌడ్, రేగుల రాజేశం, కమలాకర్ రెడ్డి, మంత సందీప్, పబ్బ మహేష్, సంతోష్, శేఖర్, అనిల్ పాల్గొన్నారు. అలాగే, టోర్నమెంట్ నిర్వహణలో పాలుపంచుకున్న నిర్వాహకులు పిల్లి నిఖిల్, మర్రిశెట్టి రాజు, నవీన్, జక్కని శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## సీఎం ఓవర్సీస్ స్కాలర్‌షిప్ దరఖాస్తుల ఆహ్వానం..

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

మైనారిటీ విద్యార్థులు విదేశీ విద్యను అభ్యసించేందుకు తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న 'సీఎం ఓవర్సీస్ స్కాలర్‌షిప్' దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి అయేషా తలత్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి అయేషా తలత్ మాట్లాడుతూ అమెరికా, యూకే, ఆస్ట్రేలియా, కెనడా వంటి దేశాల్లో పీజీ, డాక్టరేట్ చేయాలనుకునే విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జనవరి 1 నుండి జూన్ 30, 2026 మధ్య విదేశీ వర్సిటీల్లో ప్రవేశం పొందిన వారు జూన్ 30 లోపు ఽఽఽ.వశ్రీఖఅస్త్రుఖఖవజూఖం.ఎస్త్రస్త్ర.స్త్రశీఱ.ఱఅ వెబ్ సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోని,ఆ తర్వాత దరఖాస్తు హార్డ్ కాపీ, ఇతర పత్రాలను జూలై 31లోపు రాజన్న సిరిసిల్ల కలెక్టరేట్‌లోని మైనారిటీ సంక్షేమ శాఖ కార్యాలయంలో అందజేయాలని తెలిపారు . ఈ పథకం ద్వారా రూ. 20 లక్షల ఆర్థిక సాయంతో పాటు విమాన ఛార్జీలు అందించబడతాయని, నకిలీ పత్రాలు సమర్పిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. పూర్తి వివరాల కోసం 9949910328 నంబర్‌ను సంప్రదించవచ్చని తెలిపారు.

## ప్రధాన మంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్‌కు నామినేషన్ల ఆహ్వానం

**విశిష్ట ప్రతిభ కనబరిచిన బాలబాలికలకు కేంద్ర ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక అవార్డు**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

భారత ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అందజేస్తున్న లిలిప్రధాన మంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్ (గ్రావీక్ష్మద్రీ)–2026లిలి కోసం అర్హులైన బాలబాలికల నుంచి నామినేషన్లను ఆహ్వానిస్తోంది. పిల్లలు వివిధ రంగాల్లో సాధించిన విశిష్ట విజయాలను గుర్తించి సత్కరించేందుకు ఈ జాతీయ పురస్కారాన్ని ప్రదానం చేస్తున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి తెలిపారు. ఈ అవార్డులు లిలిధైర్యసాహసాలు , సామాజిక సేవ), పర్యావరణ పరిరక్షణ, క్రీడలు, కళా--సంస్కృతి, విజ్ఞానశాస్త్రం--సాంకేతికత రంగాల్లో విశేష ప్రతిభ కనబరిచిన బాలబాలికలకు అందజేయబడతాయి.

5 నుంచి 18 సంవత్సరాల లోపు వయస్సు కలిగి, పై రంగాల్లో అసాధారణ ప్రతిభను ప్రదర్శించిన పిల్లలు నామినేషన్లకు అర్హులని పేర్కొన్నారు. నామినేషన్లు, సిఫార్సులు ప్రత్యేకంగా రూపొందించిన లిలిరాష్ట్రీయ పురస్కార్ పోర్టల్‌లిలి ద్వారా మాత్రమే ఆన్‌లైన్‌లో స్వీకరించబడతాయని తెలిపారు. అర్హత కలిగిన, విశిష్ట ప్రతిభ కనబరిచిన బాలబాలికలను గుర్తించి వారి తరఫున నామినేషన్లు పంపించేందుకు విద్యాసంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజాప్రతినిధులు మరియు సంబంధిత అధికారులు ప్రత్యేక కృషి చేయాలని కోరారు. ఆన్‌లైన్ నామినేషన్ల సమర్పణకు చివరి తేదీ జూలై 31, 2026లిలిగా నిర్ణయించినట్లు వెల్లడించారు. మరిన్ని వివరాల కోసం లిలిబాల రక్ష భవన్, జర్నలిస్ట్ కాలనీ, రాజన్న సిరిసిల్లలిలిను సంప్రదించవచ్చని, అలాగే లిలి7286878964, 9542346161లిలి ఫోన్ నంబర్లకు కాల్ చేసి సమాచారం పొందవచ్చని సూచించారు. ఈ మేరకు కలెక్టర్ అండ్ జిల్లా మెజిస్ట్రేట్ అనుమతితో జిల్లా సంక్షేమ అధికారి, రాజన్న సిరిసిల ఒక ప్రకటనలో తెలిపారు.



## వేములవాడ పట్టణాన్ని టూరిజం హబ్‌గా మార్చడమే లక్ష్యం

**-ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :**

వేములవాడ పట్టణాన్ని టెంపుల్ సిటీగా టూరిజం హబ్ గా మార్చడమే లక్ష్యం అని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. బుధవారం వేములవాడ పట్టణంలో తిప్పాపూర్ లో మూడవ బ్రిడ్జి స్లాబ్ పనులను రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు..ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ వేములవాడ రాజన్న ఆలయ సన్నిధిలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో , జిల్లా మంత్రుల సహకారంతో , జిల్లా అధికారుల సమన్వయంతో రాజన్న ఆలయంతో పాటు వేములవాడ పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో తీసుకెళ్తున్నాం అన్నారు..

ఇప్పటికే 150 కోట్లు విడుదల చేసుకొని రాజన్న ఆలయ అభివృద్ధి పనులను శరవేయంగా కొనసాగుతున్నాయని అన్నారు.. గత ప్రభుత్వ హయాంలో అభివృద్ధి శిలాఫలకలకే పరిమితమై వారిచ్చిన వాగ్దానాలన్నీ నీటి మూటలు అయ్యాయని అన్నారు.. 2015 లో మూడో బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన చేసి పనులు చేయడం మరిచిపోయారని ఎద్దేవ చేశారు.. కనీసం భూసేకరణ చేయకుండా వారు కేవలం వారు ప్రజలను మభ్య పెట్టారని అన్నారు.. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మూడో బ్రిడ్జి భూసేకరణ కోసం 6 కోట్ల 97 లక్షల నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు.గత ప్రభుత్వం హయంలో వారు కేవలం ఓట్లు దండుకోవడానికి మాత్రమే శిలాఫలకాలు వేశారని అభివృద్ధి చేయడానికి ఏమాత్రం కాదన్నారు.. దానికి సజీవ సాక్షాలుగా తిప్పాపూర్ మూడవ బ్రిడ్జి కలికోట సూరమ్మ చెరువు ప్రాజెక్టు పనులకు భూసేకరణ చేయకుండా కేవలం శిలాఫలకాలే వేశారని తెలిపారు.ప్రాజెక్టు నిర్మాణానికి ప్రజా ప్రభుత్వంలో భూసేకరణకు నిధులు విడుదల చేసి భూ సేకరణ చేయడం జరిగిందన్నారు... ఇప్పటికి ప్రాజెక్టు పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి అన్నారు.రాజన్న ఆలయం ముందు నుంచి తిప్పాపూర్ బ్రిడ్జి వరకు 80 ఫీట్ల రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయని త్వరలోనే లైటింగ్ ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. సుమారు 1000 కోట్లతో అభివృద్ధి పనులు చేస్తున్నామన్నారు..బ్రిడ్జి నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించి నిర్మాణాలు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు

## ధాన్యం అన్ లోడింగ్ లో వేగం పెంచాలి

**జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**ధాన్యం కొనుగోళ్లపై టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించిన కలెక్టర్**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**



అపరెల్ పార్క్, రైస్ మిల్లులు, గోదాముల్లో ధాన్యం అన్ లోడింగ్ లో మరింత వేగం పెంచాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. జిల్లాలోని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణ, అపరెల్ పార్క్, రైస్ మిల్లులు, గోదాంలలో అన్ లోడింగ్ వేగవంతం చేయడం, ఇప్పటివరకు ఎన్ని కొనుగోలు కేంద్రాలు మూసివేశారు.. తదితర అంశాలపై అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, పౌర సరఫరాలు, సహకార శాఖ, గ్రామీణాభివృద్ధి శాఖ, మెప్మా, రవాణా, తదితర శాఖల జిల్లా అధికారులతో కలెక్టర్ బుధవారం ఉదయం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. కొనుగోలు కేంద్రాల్లో తూకం వేసి ఉన్న బస్తాలను వెంటనే అపరెల్ పార్క్, రైస్ మిల్లులు, గోదాములకు తరలించేలా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాలకు ఇంకా అవసరమైన గన్ని సంచులు ముందస్తుగా తెప్పించాలని, రైస్ మిల్లుల నుంచి తీసుకోవాలని సూచించారు. కొనుగోళ్లు పూర్తయిన కేంద్రాల నుంచి వాహనాలు, హమాలీలను అపరెల్ పార్క్ కు పంపించి, అన్ లోడింగ్ వేగవంతం చేయడంపై దృష్టి సారించాలని, వాహనాలను ఇతర కేంద్రాలను తరలించాలని సూచించారు. కొనుగోళ్లు వేగంగా చేపట్టి.. మూడు రోజుల్లో పూర్తయ్యేలా చూడాలని ఆదేశించారు. ట్రాన్స్ పోర్ట్ కాంట్రాక్టర్లు సరిపడా వాహనాలు సమకూర్చేలా ఆదేశాలు జారీ చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు.




## పొగాకు నియంత్రణ చట్టం అమలుపై ప్రత్యేక తనిఖీలు

**పాఠశాలల సమీపంలో గుట్కా, పొగాకు విక్రయాలపై అధికారుల దృష్టి**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఆధ్వర్యంలో మంగళవారం ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. పొగాకు రహిత సమాజం ద్వారా ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు అధికారులు తెలిపారు.

ఈ సందర్భంగా సిగరెట్లు మరియు ఇతర పొగాకు ఉత్పత్తుల నియంత్రణ చట్టం (జఉఽూూ)--2003 నిబంధనలపై ప్రజలకు అవగాహన కల్పించారు. పొగాకు వినియోగం వల్ల అనేక రకాల క్యాన్సర్ వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని, అలాగే చిన్నారుల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతుందని వివరించారు. పాఠశాలల పరిసర ప్రాంతాల్లో పొగాకు ఉత్పత్తుల విక్రయాలను నిరోధించేందుకు విద్యాసంస్థలకు 100 మీటర్ల పరిధిలోని దుకాణాలను తనిఖీ చేశారు. గుట్కా, పొగాకు, తంబాకు, బీడీలు వంటి ఉత్పత్తులను చిన్నారులకు విక్రయించరాదని వ్యాపారులకు సూచించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ రామకృష్ణ, కృష్ణమూర్తి, ఫుడ్ సేఫ్టీ అధికారి అనూష, ఎస్ఐ అనిల్ కుమార్, చింతోజు భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# ఆధ్యాత్మికతకు, పర్యాటకానికి నిలయంగా వేములవాడ..

**-భక్తుల కోసం సిద్ధమైన శివలింగ రూపం.**
**-వేములవాడలో సరికొత్త పర్యాటక శోభ..**
**-దక్షిణ కాశీలో ఆధ్యాత్మిక సందడి..**
**-పర్యాటకులను ఆకట్టుకుంటున్న గుడి చెరువు బండ్ పార్క్ సుందరీకరణ.**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :**





భక్తి పారవశ్యానికి నిలయం, రాజరాజేశ్వరుని క్షేత్రం వేములవాడ. ఆ పరమేశ్వరుని దివ్య సన్నిధిలో, ఆధ్యాత్మిక పరిమళాలు వెదజల్లేలా ఇప్పుడు గుడి చెరువు బండ్ పార్క్ సరికొత్త రూపును సంతరించుకుంది.వేములవాడ గుడి చెరువు బండ్ పార్కును భక్తి భావం పెంచేలా.. ఆహ్లాదం.. ఆనందాన్ని పంచేలా వేములవాడ టెంపుల్ ఏరియా డెవలప్ మెంట్ అథారిటీ ఆధ్వర్యంలో అందంగా తీర్చిదిద్దుతున్నారు. పవిత్రమైన ఈ క్షేత్రానికి వచ్చే భక్తుల మనసులను భక్తి సాగరంలో ఓలలాడించేలా, ఆధ్యాత్మిక శోభ ఉట్టిపడే రీతిలో సుందరీకరణ పనులు పూర్తి కావడంతో ఆ ప్రాంతమంతా శివనామ స్మరణతో మార్మోగిపోతోంది.

దైవిక శక్తికి ప్రతిరూపంగా, పార్కు ప్రాంగణంలో 40 అడుగుల ఎత్తైన మహాశివుడి దివ్య విగ్రహం భక్తులకు కనువిందు చేస్తోంది. ఆ పరమేశ్వరునితో పాటు, అష్ట సిద్ధులకు ప్రతీకగా సప్తమాత్రికల విగ్రహాలను అత్యంత రమణీయంగా ప్రతిష్టించారు. ఈ విగ్రహాల ఏర్పాటుతో గుడి చెరువు బండ్ పార్క్ ఇప్పుడు కేవలం ఒక విహార కేంద్రంగానే కాకుండా, సాక్షాత్తు కైలాస ప్రాంగణాన్ని తలపిస్తూ ఆధ్యాత్మిక శక్తి కేంద్రంగా మారింది.

జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ప్రత్యేక చొరవతో, భక్తుల కోరిక మేరకు ఈ పుణ్యక్షేత్రానికి మరింత శోభను తీసుకురావాలన్న లక్ష్యంతో అధికారులు ఈ పనులను అత్యంత భక్తిశ్రద్ధలతో పూర్తి చేశారు. ఆధ్యాత్మిక చింతనతో పాటు ప్రశాంతమైన వాతావరణం కోసం పార్కును తీర్చిదిద్దడం పట్ల భక్తులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.

ఈ క్షేత్ర సౌందర్యాన్ని మరింత ఇనుమడింపజేసేలా, త్వరలోనే గుడి చెరువులో బోటింగ్ సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకురావడానికి పర్యాటక శాఖ వేగంగా అడుగులు వేస్తోంది. ప్రశాంతమైన జలధారల మధ్య బోటు ప్రయాణం చేస్తూ, తీరాన కొలువుదీరిన మహాశివుని దర్శనం చేసుకోవడం భక్తులకు ఒక అద్భుతమైన దివ్యానుభూతిని అందించనుంది. ఆధ్యాత్మికత, పర్యాటకం కలగలిసిన ఈ సుందర దృశ్యం, వేములవాడ పుణ్యక్షేత్ర కీర్తిని దశదిశలా వ్యాపింపజేసేలా ఉంది.

**ప్రారంభానికి సిద్ధం చేయాలి : జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**

తుది దశకు చేరుకున్న బండ్ పార్క్ మిగతా అభివృద్ధి పనులను పూర్తి చేసి, బోటింగ్ సదుపాయం అందుబాటులోకి తీసుకువచ్చి త్వరగా ప్రారంభానికి సిద్ధం చేసేలా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం వేములవాడ పట్టణంలోని గుడి చెరువు బండ్ పార్క్ ను క్షేత్ర స్థాయిలో సందర్శించి అధికారులకు పలు సూచనలు చేశారు.నేమ్ బోర్డు, టాయిలెట్లు, ఎవెన్యూ ప్లాంటేషన్ చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. పనులు పూర్తి చేసి త్వరలో ప్రారంభానికి సన్నాహాలు చేయాలని సూచించారు.

## గ్రామ, వార్డు సభలను విజయవంతంగా నిర్వహించాలి



**-పంటల మార్పిడిపై రైతులకు అవగాహన కల్పించాలి**
**- కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**బలగం టీవీ, రాజన్నసిరిసిల్ల:**

ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఈ నెల 4, 6, 8, 10 తేదీలలో నిర్వహించనున్న ప్రత్యేక గ్రామ, వార్డు సభలను విజయవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు.

సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో తహసీల్దార్లు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు, మండల వ్యవసాయ అధికారులు, ఎంపీఓలతో బుధవారం అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ తో కలిసి జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ ప్రజాపాలన – ప్రగతి ప్రణాళికలో భాగంగా ప్రతి గ్రామం, వార్డులో సభలు నిర్వహించి, ప్రజలతో ప్రత్యక్షంగా చర్చించాలని, సంబంధిత శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని సూచించారు.

గ్రామ సభల వేదికగా పంటల మార్పిడి, ఆయిల్ పామ్ సాగు, ఫార్మర్ రిజిస్ట్రీ, సన్న వడ్ల సాగు తదితర అంశాలపై రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. లాభదాయక పంటగా ఆయిల్ పామ్ సాగు విస్తరణకు చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. ఘన వ్యర్థాల నిర్వహణ కార్యక్రమాలను ప్రభావవంతంగా అమలు చేయాలని, కంపోస్ట్ షెడ్లను సక్రమంగా నిర్వహించి పూర్తి స్థాయిలో వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు. వర్షాకాలం నేపథ్యంలో గ్రామాల్లో చేపట్టాల్సిన పనులను ముందుగానే గుర్తించి కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని తెలిపారు.

పర్యావరణ పరిరక్షణ, పారిశుద్ధ్య నిర్వహణకు ప్రాధాన్యత ఇవ్వాలని, మిషన్ భగీరథ ట్యాంకులను శుభ్రపరచాలని ఆదేశించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టడంతో పాటు ఫాగింగ్ యంత్రాలు అందుబాటులో ఉండేలా చూడాలని సూచించారు.

వనమహోత్సవం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా మొక్కలు నాటి సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు.మొక్కలు నాటేందుకు ముందుగానే గుంతలు సిద్ధం చేయడంతో పాటు నర్సరీల నిర్వహణ, ఎవెన్యూ ప్లాంటేషన్ కార్యక్రమాలను చేపట్టాలని ఆదేశించారు.గ్రామ, వార్డు సభల్లో బడి బాట కార్యక్రమంపై విస్తృత ప్రచారం నిర్వహించాలని, మండల విద్యాధికారులు, ఇంటర్ విద్యాధికారులు ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో ప్రభుత్వం కల్పిస్తున్న మౌలిక సదుపాయాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. విద్యాసంస్థల పునఃప్రారంభానికి ముందే పరిశుభ్రత పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. జనగణన నిర్వహణలో ఛార్జ్ అధికారులు ప్రత్యేక పర్యవేక్షణ చేయాలని, ఎన్యూమరేటర్లకు పూర్తి స్థాయి అవగాహన ఉండేలా చూడాలని తెలిపారు. ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఈ నెల 15వ తేదీ నుంచి ప్రారంభమయ్యే షెడ్యూల్ ప్రకారం శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు.

ఎస్ఐఆర్ మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని, ప్రజలకు కలిగే సందేహాలను నివృత్తి చేయాలని సూచించారు. 14 రకాల గుర్తింపు కార్డుల్లో ఏదైనా ఒకటి చూపిస్తే సరిపోతుందని ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. బీఎల్‌వోలు అప్రమత్తంగా వ్యవహరించాలని, అంగన్‌వాడీ సిబ్బంది, మున్సిపాలిటీల్లోని ఆర్పీలు తహసీల్దార్లకు సహకరించాలని ఆదేశించారు. గ్రామ, వార్డు సభలకు జన సమీకరణ చేపట్టాలని, ఎజెండా ప్రకారం ప్రతీ అంశంపై చర్చించాలని అన్నారు.సమీక్షలో జిల్లా వేములవాడ ఆర్డీఓ కె.ఎస్.బి కుమారి, వ్యవసాయ శాఖ అధికారి అఫ్జల్ బేగం, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి లక్ష్మీనారాయణ, పంచాయతీ అధికారి షర్ఫుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల నమోదును పెంచాలి

**-రాష్ట్ర ప్రభుత్వ విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ యోగితారాణా**
**-అన్ని జిల్లాల కలెక్టర్లు, డీఈఓలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష**
**-హాజరైన జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**బలగం టీవీ, రాజన్నసిరిసిల్ల:**

బడిబాట కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించి ప్రతి పాఠశాలలో కనీసం 10 శాతం మేర విద్యార్థుల నమోదును పెంచాలని విద్యాశాఖ ప్రధాన కార్యదర్శి యోగితా రాణా సూచించారు.బుధవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లాల విద్యాశాఖ పనితీరును సమీక్షించారు.

రాష్ట్ర ప్రభుత్వ విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ యోగితారాణా మాట్లాడుతూ.. బడిబాట కార్యక్రమాన్ని గ్రామాలు, వార్డుల స్థాయిలో విస్తృతంగా నిర్వహించి ప్రభుత్వ విద్యాసంస్థలలో విద్యార్థుల నమోదును పెంచాలని సూచించారు. పాఠశాల విద్యతో పాటు ఇంటర్మీడియట్, డిగ్రీ కళాశాలల్లో కూడా ప్రవేశాల పెంపుపై ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని ఆదేశించారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్యార్థుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న పలు కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని తెలిపారు.

ఇంటర్మీడియట్ విద్యార్థులకు అల్పాహార పథకం, ఉచిత పాఠ్యపుస్తకాల పంపిణీ, మధ్యాహ్న భోజన పథకం వంటి కార్యక్రమాలు ఈ విద్యా సంవత్సరంలో అమలులో ఉన్నాయని పేర్కొన్నారు. ఈ సదుపాయాలపై తల్లిదండ్రులు, విద్యార్థులకు విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు.

డిగ్రీ కళాశాలల్లో నైపుణ్యాధారిత విద్యకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని, విద్యార్థుల్లో ఉద్యోగ అవకాశాలను పెంపొందించే విధంగా కోర్సులు అందుబాటులోకి తీసుకువస్తున్నామని తెలిపారు. నైపుణ్యాభివృద్ధి ద్వారా యువతకు మెరుగైన ఉపాధి అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. వీసీలో జిల్లా విద్యాధికారి జగన్ మోహన్ రెడ్డి, ఇంటర్మీడియట్ అధికారి శరత్, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రభాకర చారి, మెప్మా ఏఓ మీర్జా ఫసహత్ అలీ బేగ్, అదనపు డీఆర్డీఓ శ్రీనివాస్, విద్యా శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## తహసిల్దార్, ఆర్ఐలకు నాయకుల జన్మదిన శుభాకాంక్షలు



**బలగం టీవీ, ఎల్లారెడ్డిపేట**

ఎల్లారెడ్డిపేట మండల తహసీల్దార్ సుజాత , ఆర్ ఐ శ్రవణ్ ల జన్మదినం సందర్భంగా మండలంలోని ప్రజా ప్రతినిధులు ,వివిధ పార్టీల నాయకులు వారికి జన్మ దిన శుభాకాంక్షలు తెలిపారు. నిండు నూరేళ్ల పాటు జన్మ దినోత్సవాలు జరుపుకోవాలని వారు ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు కేక్ కట్ చేసి తహసిల్దార్ సుజాతకు తినిపించి శాలువాల తో ఘనంగా సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి చైర్మన్ షేక్ సబేరా బేగం, వైస్ ప్రెసిడెంట్ గుండాడి రామ్ రెడ్డి, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షులు సాహెబ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు షేక్ గౌస్,నాయకులు కొమిరిశెట్టి తిరుపతి, బండారి బాల్రెడ్డి, మెండే శ్రీనివాస్ యాదవ్, గంట బుచ్చా గౌడ్ , వంగ శ్రీకాంత్ రెడ్డి, గుర్రాల రాజు రెడ్డి ,అందే సతీష్ , రేవంత్ రెడ్డి మిత్ర మండలి జిల్లా అధ్యక్షులు గూడ విజయ్ రెడ్డి, జిల్లా కిసాన్ సేల్ ఉపాధ్యక్షులు మర్రి శ్రీనివాస్ రెడ్డి, యువజన నాయకులు ముద్రకోలా సాయిప్రేమ్, రవి యాదవ్,తేజ , విష్ణు, బిఆర్ఎస్ పార్టీ నాయకులుగొల్లపల్లి సర్పంచ్ కొండ రమేష్ గౌడ్ , బో ప్పాపూర్ ఉపసర్పంచ్ కొండాపురం వెంకట్ రెడ్డి , బిఆర్ఎస్ పార్టీ నాయకులు ఇల్లందుల శ్రీనివాస్ రెడ్డి , తదితరులు పాల్గొని తహసీల్దార్ కు,ఆర్ ఐ కిజన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

**ఎంపీఓ కు మండల కాంగ్రెస్ పార్టీ నాయకుల సన్మానం.**

ఎల్లారెడ్డిపేట ఎంపీడీవో కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించిన ఎంపీవోను మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు .

# అఫ్గానిస్తాన్‌తో వన్డే సిరీస్‌కు కోహ్లీ దూరం

**బలగం టీవీ, న్యూఢిల్లీ**

టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ గాయం కారణంగా అఫ్గానిస్తాన్‌తో జరగనున్న వన్డే సిరీస్‌కు దూరమయ్యాడు. ఇటీవల ముగిసిన ఐపీఎల్ ఫైనల్ మ్యాచ్ సందర్భంగా కోహ్లీ హ్యామ్‌స్ట్రింగ్ (కాలు కండరం) గాయానికి గురైనట్లు బీసీసీఐ వర్గాలు వెల్లడించాయి. ఈ నెల 13 నుంచి ధర్మశాల వేదికగా ప్రారంభం కానున్న మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌కు కోహ్లీ అందుబాటులో ఉండడంలేదని సమాచారం. ఐపీఎల్ ఫైనల్ సందర్భంగా అతడికి గాయం కావడంతో వైద్య పరీక్షలు నిర్వహించగా, మోకాలి కింది భాగంలో ఉండే కండరాల అనుసంధాన కణజాలం (కనెక్టివ్ టిష్యు) దెబ్బతిన్నట్లు స్కానింగ్ నివేదికల్లో తేలినట్లు బీసీసీఐ ప్రతినిధి తెలిపారు. 37 ఏళ్ల వయసులోనూ అత్యుత్తమ ఫిట్‌నెస్‌తో కొనసాగుతున్న కోహ్లీకి ఇటువంటి గాయం కావడం అరుదైన విషయంగా క్రికెట్ వర్గాలు పేర్కొంటున్నాయి. అతడి గాయం తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ఎద్యుల సూచనల మేరకు విశ్రాంతి ఇవ్వాలని జట్టు యాజమాన్యం నిర్ణయించినట్లు తెలుస్తోంది. కోహ్లీ స్థానంలో ప్రస్తుతం శ్రీలంక పర్యటనకు ఎంపికైన భారత్-ఏ జట్టు కెప్టెన్ Ruturaj Gaikwad భారత జట్టులోకి తీసుకునే అవకాశాలు ఉన్నట్లు సమాచారం. అయితే దీనిపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. అఫ్గానిస్తాన్‌తో జరగనున్న ఈ సిరీస్ భారత జట్టుకు కీలకమైనదిగా భావిస్తున్న నేపథ్యంలో కోహ్లీ గైర్హాజరు జట్టుపై ప్రభావం చూపే అవకాశం ఉందని క్రీడా విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.



# రిటైర్మెంట్ ప్రకటించిన కోన శ్రీకర్ భరత్

**బలగం టీవీ, హైదరాబాద్**



భారత వికెట్ కీపర్, తెలుగు తేజం కోన శ్రీకర్ భరత్ అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. ఈ విషయాన్ని ఇన్‌స్టాగ్రామ్ వేదికగా గురువారం వెల్లడించాడు. గర్వంతో, కృతజజతా భావంతో ఆటకు వీడ్కోలు పలుకుతున్నట్లు తన పోస్ట్‌లో పేర్కొన్నాడు. దేశం కోసం ఆడటం తన జీవితంలో లభించిన గొప్ప గౌరవమని తెలిపాడు. 'ఎంతో గర్వంతో, కృతజ్ఞతాభావంతో నేను అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలుకుతున్నాను. దేశం తరపున ఆడటం జీవితంలో నాకు లభించిన గొప్ప గౌరవంగా భావిస్తున్నాను. నా ఈ ప్రయాణంలో ఎంతో పట్టుదల, బలం అవసరమయ్యాయి. కానీ టెస్ట్ క్రికెట్‌లో భారతదేశానికి ప్రాతినిధ్యం వహించే అవకాశం రావడం నాకు దక్కిన గొప్ప గౌరవంగా భావిస్తున్నా. నా కెరీర్‌కు అండగా నిలిచిన బీసీసీఐ, కోచ్‌లు, మేనేజర్లందరికీ నా ధన్యవాదాలు. అత్యున్నత స్థాయిలో ఆడటానికి గొప్ప వాతావరణాన్ని సృష్టించి, నాకు నిరంతరం మద్దతుగా నిలిచినందుకు మీ అందరికీ స్పెషల్ థ్యాంక్స్. నా సహచర ఆటగాళ్లందరికీ బిగ్ థ్యాంక్స్. మనమందరం కలిసి పంచుకున్న క్షణాలు, సాధించిన విజయాలు నా కెరీర్‌లో ఎంతో సహాయపడ్డాయి. మీరందరూ లేకపోతే నా కలను నిజం చేసుకోవడం, ఇన్నేళ్లపాటు ఈ ఆటను ఆడటం నాకు సాధ్యమయ్యేది కాదు. నా ప్రతిభను నిరూపించుకోవడానికి, గుర్తింపు తెచ్చుకోవడానికి నాకు అవకాశం కల్పించిన నా ఐపీఎల్ అరంగేట్ర కెప్టెన్ విరాట్ కోహ్లీ, టెస్ట్ కెప్టెన్ రోహిత్ శర్మ, నా టీమిండియా హెడ్ కోచ్ రాహుల్ ద్రవిడ్ సార్‌కి ధన్యవాదాలు. భారత్-ఏ జట్టు నుంచి టీమిండియా వరకు ఆయన అందించిన గైడెన్స్ ఎప్పటికీ మరవలేనిది. మీ మద్దతుతోనే నేను భారత టెస్ట్ క్రికెటర్‌ను కాగలిగాను. యువ ఆటగాళ్లకు నా సలహా ఏంటంటే.. పెద్ద కలలు కనండి. వాటిని సాధించడానికి నిరంతరం కష్టపడండి. పట్టుదల, క్రమశిక్షణ, కష్టపడే తత్వం, దృఢ సంకల్పం ఉంటే కలలు ఖచ్చితంగా సాకరమవుతాయి. బీసీసీఐ, టెస్ట్ క్రికెట్‌తో నా ప్రయాణం ముగిసి ఉండవచ్చు. కానీ ఈ ఆటతో నా ప్రయాణం కొనసాగుతూనే ఉంటుంది. రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున రాణించాలని కలలు కనే తదుపరి తరానికి మార్గదర్శకత్వం. మెంటారింగ్, కోచింగ్ ఇవ్వడం ద్వారా నా వంతుగా క్రికెట్‌కు సేవ చేస్తూనే ఉంటాను.'అని కేఎస్ భరత్ తన పోస్ట్‌లో పేర్కొన్నాడు. ఆంధ్రప్రదేశ్‌లోని వైజాగ్‌కు చెందిన 32 ఏళ్ల భరత్ తన కెరీర్‌లో 7 టెస్టులు, 10 ఐపీఎల్ మ్యాచులు ఆడాడు. ఐపీఎల్ 2024 ఛాంపియన్‌గా నిలిచిన కోల్‌కతా నైట్‌రైడర్స్ జట్టులో సభ్యుడిగా ఉన్నాడు. రంజీ ట్రోఫీ చరిత్రలోనే వికెట్ కీపర్-బ్యాటర్‌గా ట్రిపుల్ సెంచరీ (308 పరుగులు) చేసిన తొలి ఆటగాడిగా రికార్డ్ సాధించాడు. 2014-15 సీజన్‌లో గోవాపై ఈ రికార్డు స్కోరు నమోదు చేశాడు. ఐపీఎల్ 2021 సీజన్‌లో ఆర్‌సీబీ తరపున ఢిల్లీ క్యాపిటల్స్‌తో మ్యాచ్‌లో ఆఖరి బంతికి సిక్స్ కొట్టి మ్యాచ్ గెలిపించడం అతని కెరీర్‌కే హైలైట్. 113 ఫస్ట్ క్లాస్ మ్యాచులు ఆడిన కేఎస్ భరత్.. 6102 పరుగులు చేశాడు. ఇందులో 11 సెంచరీలతో పాటు 34 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. వికెట్ కీపర్‌గా 380 క్యాచ్‌లు అందుకోవడంతో పాటు 42 స్టంపౌట్స్ చేశాడు.

# సూర్యకుమార్ యాదవ్‌పై వేటు..



**బలగం టీవీ, హైదరాబాద్**

పేలవ ఫామ్‌తో ఇబ్బంది పడుతున్న టీమిండియా టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్‌పై భారత సెలెక్టర్లు వేటు వేసినట్లు తెలుస్తోంది. సూర్యకుమార్ యాదవ్ సారథ్యంలోని టీమిండియా ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026 గెలిచినా అతన్ని కెప్టెన్సీ బాధ్యతల నుంచి తప్పించేందుకు అజిత్ అగార్కర్ సారథ్యంలోని సెలెక్షన్ కమిటీ సిద్ధమైనట్లు విశ్వసనీయ వర్గాలు పేర్కొన్నాయి. గతేడాదిగా సూర్యకుమార్ యాదవ్ పేలవ ఫామ్‌తో ఇబ్బంది పడుతున్నాడు. దాంతోనే జట్టు భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని బీసీసీఐ ఈ నిర్ణయం తీసుకుందని ఓ అధికారి మీడియాకు తెలిపారు. అప్‌కమింగ్ సిరీస్‌ల్లోనూ అతనికి చోటు దక్కే అవకాశం లేదని స్పష్టం చేశారు. 'సూర్యకుమార్ యాదవ్‌ను టీ20 కెప్టెన్సీ బాధ్యతల నుంచి తప్పించాలని బీసీసీఐ నిర్ణయించింది. అతని స్థానంలో శ్రేయస్ అయ్యర్ సారథ్య బాధ్యతలు చేపడుతాడు. ఐర్లాండ్, ఇంగ్లండ్తో జరిగే టీ20 సిరీస్‌ల్లో టీమిండియాను శ్రేయస్ అయ్యర్ నడిపిస్తాడు. గతంలో సూర్యకుమార్ యాదవ్ ఆడిన నాలుగో నంబర్ స్థానంలో శ్రేయస్ అయ్యర్ బ్యాటింగ్‌కు దిగుతాడు. యువ బ్యాటర్ తిలక్ వర్మను వైస్ కెప్టెన్‌గా నియమించనున్నారు. టీ20 ప్రపంచకప్‌లో వైస్ కెప్టెన్‌గా ఉన్న అక్షర్ పటేల్‌ను ఈసారి పరిగణనలోకి తీసుకోలేదు. హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్.. సంజు శాంసన్‌ను కెప్టెన్‌ను చేయాలని కోరాడు. కానీ అజిత్ అగార్కర్ సారథ్యంలోని సెలెక్షన్ కమిటీ అందుకు అంగీకరించలేదు. సంజూ బ్యాటింగ్‌లో నిలకడ లేదని సాకుగా చూపారు. ప్రపంచకప్‌లో అద్భుత ప్రదర్శన కనబర్చినప్పటికీ.. సంజూను కెప్టెన్ చేసేందుకు అంగీకరించలేదు. చివరికి శ్రేయాస్ అయ్యర్‌ను కెప్టెన్‌గా.. తిలక్ వర్మను వైస్ కెప్టెన్‌గా నియమించడానికి అందరూ అంగీకరించారు. ఈ చర్చల్లో రజత్ పటీదార్ పేరు ప్రస్తావనకు రాలేదు.'అని సదరు అధికారి వెల్లడించాడు. ప్రస్తుతం వన్డే జట్టు వైస్ కెప్టెన్‌గా ఉన్న శ్రేయస్ అయ్యర్.. 2023 డిసెంబర్‌లో ఆస్ట్రేలియాపై చివరి టీ20 ఆడాడు. ఐపీఎల్ చరిత్రలో మూడు వేర్వేరు జట్లను ఫైనల్‌కు చేర్చిన ఘనత శ్రేయస్ అయ్యర్‌కు ఉంది. ఐపీఎల్ 2024లో కోల్‌కతా నైట్‌రైడర్స్‌కు టైటిల్ అందించిన శ్రేయస్ అయ్యర్.. ప్రస్తుతం పంజాబ్ కింగ్స్‌కు సారథిగా కొనసాగుతున్నాడు. తాజా సీజన్‌లో అయ్యర్ 14 మ్యాచ్‌ల్లో 1 సెంచరీ, 5 అర్ధసెంచరీలతో 498 పరుగులు చేసి అద్భుతమైన ఫామ్‌లో ఉన్నాడు.

# వైభవ్‌కు ఎక్కడ బంతి వేయాలో కూడా అర్థం కాలేదు

## సన్‌రైజర్స్ స్టార్ ఆల్‌రౌండర్ లియామ్ లివింగ్‌స్టోన్

**బలగం టీవీ, హైదరాబాద్**



సన్‌రైజర్స్ హైదరాబాద్ ఐపీఎల్ 2026 నుంచి బయటకు రావడానికి ఏకైక కారణం వైభవ్ సూర్యవంశీ. రాజస్థాన్ రాయల్స్‌తో జరిగిన ఎలిమినేటర్ మ్యాచ్‌లో వైభవ్ సృష్టించిన విధ్వంసం అంతా ఇంతా కాదు. కేవలం 29 బంతుల్లోనే 97 పరుగులతో ఊచకోత కోశాడు. అయితే, ఆ రోజు బౌలర్లకు వైభవ్‌కు ఎక్కడ బంతి వేయాలో కూడా అర్థం కాలేదని.. అలాంటి ఆటను తానెప్పుడూ చూడలేదంటూ సన్‌రైజర్స్ హైదరాబాద్ స్టార్ ఆల్‌రౌండర్ లియామ్ లివింగ్‌స్టోన్ ఓ పోడ్‌కాస్ట్‌లో చెప్పాడు. ఐపీఎల్ 2026లో వైభవ్ సూర్యవంశీ సృష్టించిన విధ్వంసం అంతా ఇంతా కాదు. ముఖ్యంగా ఎలిమినేటర్ మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్‌కి కాళ రాత్రి మిగిల్చాడు. ఆ రాత్రి సూర్యవంశీ బాదే బాదుడుకు బంతి ఎక్కడ వేయాలో కూడా బౌలర్లకు అర్థం కాలేదని సన్‌రైజర్స్ హైదరాబాద్ స్టార్ ప్లేయర్ మళ్లీ గుర్తు తెచ్చుకున్నాడు. 15 ఏళ్ల ఈ బుడ్డోడు క్రికెట్ చరిత్రలో గుర్తుండిపోయే ఇన్నింగ్స్‌లు ఆడాడు. ముల్లాన్‌పూర్ వేదికగా జరిగిన సన్‌రైజర్స్ హైదరాబాద్ - రాజస్థాన్ రాయల్స్ ఎలిమినేటర్ మ్యాచ్‌లో వైభవ్ సూర్యవంశీ కేవలం 29 బంతుల్లోనే 97 పరుగులు చేశాడు. ఐపీఎల్ ఫాస్టెస్ట్ సెంచరీ రికార్డు బ్రేక్ చేస్తారని అందరూ ఊహించారు. వైభవ్ విధ్వంసానికి సన్‌రైజర్స్ హైదరాబాద్ ఇంటిదారి పట్టాల్సి వచ్చింది. గుజరాత్ టైటాన్స్‌తో జరిగి క్వాలిఫయర్ 2లో కూడా వైభవ్ 96 పరుగులతో రాణించడం విశేషం. అయితే, సన్‌రైజర్స్ హైదరాబాద్‌పై 12 సిక్సర్లు బాదిన వైభవ్ బౌలర్లకు చుక్కలు చూయించాడని సన్‌రైజర్స్ ప్లేయర్ లియామ్ లివింగ్‌స్టోన్ అన్నాడు. తన కెరీర్‌లో ఏడు ఐపీఎల్ సీజన్‌లు ఆడానని.. ఎంతో మంది మంచి ప్లేయర్లను చూశానని.. కానీ ఇలాంటి ప్లేయర్‌ను మాత్రం చూడలేదంటూ ఓ పోడ్‌కాస్ట్‌లో షాకింగ్‌గా చెప్పాడు. "నా కెరీర్‌లో ఇలాంటోడిని చూడలేదు. ఏడు సీజన్‌లుగా నేను ఐపీఎల్‌లోనే ఉన్నాను. నేను ఎంతో మంది మంచి ప్లేయర్లతో ఆడాను, కానీ ఇలాంటి ఆటగాడిని మాత్రం చూడలేదు. అతడు బంతిని కొట్టే విధానమే వేరు, చాలా క్లీన్‌గా షాట్లు ఆడతాడు. నిజం చెప్పాలంటే అతడు బంతిని రాంగ్‌గా ఆడటం చాలా అరుదనే చెప్పొచ్చు. టోర్నమెంట్ మొత్తం చూసినా మిస్ హిట్ చేసిన సందర్భాలు దాదాపు లేవు. మొదటి సారి మేము బౌన్సర్‌తో అతడిని ఔట్ చేశాం. తొలి బంతికే అతడు బంతిని నేరుగా గాల్లోకి లేపాడు. కానీ, టోర్నమెంట్ ప్రారంభం నుంచి చివరి వరకు అతని ఆటలో వచ్చిన మార్పు చాలా అద్భుతం. మేము బౌన్సర్ వేస్తే థర్డ్ మ్యాన్ మీదుగా బౌండరీ కొట్టేవాడు. ఈ వైపు బంతి వేస్తే అటు కొట్టేవాడు. ఫుల్ లెంగ్త్ వేస్తే మరో వైపు పంపేవాడు. లో ఫుల్‌టాస్ వేస్తే కూడా గ్యాప్‌ల్లోకి పంపించేవాడు. అప్పుడు మాకు ఎక్కడ బౌలింగ్ చేయాలి అనేది ఒక్క నిమిషం అర్థం కాలేదు" అంటూ లియామ్ లివింగ్‌స్టోన్ స్టిక్ టు క్రికెట్ పోడ్‌కాస్ట్‌లో అన్నాడు. వైభవ్ సూర్యవంశీ 776 పరుగులతో ఐపీఎల్ 2026 సీజన్‌లో అత్యధిక పరుగులు చేసి ఆరెంజ్ క్యాప్ సొంతం చేసుకున్నాడు.

# వైభవ్ సూర్యవంశీకి టీమిండియా పిలుపు?

**బలగం టీవీ, న్యూఢిల్లీ**



ఐపీఎల్ వండర్ కిడ్ వైభవ్ సూర్యవంశీని టీమిండియాలోకి తీసుకురావాలనే వాదన చాలా బలంగా వినిపిస్తోంది. లెజెండ్రీ క్రికెటర్ల దగ్గర నుంచి సామాన్య అభిమాని వరకూ వైభవ్ టీమిండియాలోకి రావాలనే కోరుకుంటున్నారు. ఈ నేపథ్యంలో బీసీసీఐ కూడా అటువైపు అడుగులు వేస్తోంది. సూర్యవంశీకి జాతీయ జట్టులో చోటు కల్పించాలని అజిత్ అగార్కర్ నేతృత్వంలోని సెలెక్షన్ కమిటీ కూడా తీవ్రంగా పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. అదేవిధంగా సూర్యకుమార్ యాదవ్ స్థానంలో ఆర్సీబీ కెప్టెన్ రజత్ పటిదార్‌ను ఆడించాలని చూస్తోంది. టీమిండియా టీ20 వరల్డ్‌కప్ అందించిన కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ శకం ఇక దాదాపు ముగిసినట్టే. ఇప్పటికే సూర్యకుమార్ యాదవ్‌ను టీమిండియా టీ20 కెప్టెన్‌గా తొలగిస్తున్నారనే వార్తలు ఎక్కువగా వినిపిస్తున్నాయి. ఆ ప్లేస్‌లో సర్పంచ్ సాబ్ శ్రేయాస్ అయ్యర్‌ను నూతన కెప్టెన్‌గా నియమిస్తున్నారని కూడా తెలుస్తోంది. ఐసీసీ టీ20 వరల్డ్ కప్ 2024, 2026లో వరుసగా రెండుసార్లు ఛాంపియన్‌గా నిలిచిన భారత్.. ఇప్పుడు మూడోసారి టైటిల్ గెలిచి రికార్డు సృష్టించాలని ఉంది. దాంతో టీ20 వరల్డ్‌కప్ 2028 టార్గెట్‌గా బీసీసీఐ అడుగులు వేస్తోంది. ఆ క్రమంలోనే సూర్యకుమార్ యాదవ్‌ను తప్పించనున్న బీసీసీఐ.. యువ ఆటగాళ్లు, అనుభవం ఉన్న ప్లేయర్లతో జట్టును సిద్ధం చేయాలని ఫిక్స్ అయినట్టుంది. ఐపీఎల్ సంచలనం వైభవ్ సూర్యవంశీతో పాటు రెండుసార్లు ఆర్సీబీని ఛాంపియన్‌గా నిలిపిన రజత్ పటిదార్‌ను టీ20 జట్టులోకి తీసుకురావాలని బీసీసీఐ ప్లాన్ చేస్తోంది. కేవలం 15 ఏళ్ల వయస్సులోనే జాతీయ జట్టులో చోటు కల్పించడం సరైనదేనా? అనే చర్చ జరుగుతున్నప్పటికీ.. అజిత్ అగార్కర్ నేతృత్వంలోని సెలెక్షన్ కమిటీ మాత్రం సూర్యవంశీకి టీమిండియా క్యాప్ అందించాలని చాలా సీరియస్‌గా పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్‌ను పూర్తిగా తొలగిస్తే అతని స్థానంలో నెంబర్ 4లో రజత్ పటిదార్‌ను ఆడిస్తే బాగుంటుందేమో అని బీసీసీఐ పరిశీలిస్తోంది. పటిదార్ కెప్టెన్సీలో ఆర్సీబీ వరుసగా రెండు ఐపీఎల్ టైటిల్స్ గెలవడమే కాకుండా.. కెప్టెన్ ధోనీ, రోహిత్ శర్మ సరసన కూడా నిలిచాడు. దాంతో పాటు ఐపీఎల్ 2026లో కెప్టెన్‌గా సక్సెస్ కావడమే కాకుండా 192.69 స్ట్రయిక్ రేట్‌తో 501 పరుగులు కూడా చేసి సత్తా చాటాడు. టీమిండియాలోకి వైభవ్‌ను వీలైనంత త్వరగా తెచ్చేందుకు బీసీసీఐ చాలా ప్రయత్నాలు చేస్తోంది. ఇప్పటికే సూర్యవంశీని ఈ నెలలో శ్రీలంకలో జరగనున్న ఇండియా - ఏ, అఫ్గనిస్థాన్ - ఏ, శ్రీలంక - ఏ మధ్య జరగనున్న ట్రై సిరీస్‌కు కూడా స్క్వాడ్‌లో సెలెక్ట్ చేశారు. ఈ సిరీస్‌లో వైభవ్ తన సత్తా చాటితే రానున్న కాలంలో టీమిండియాలో అడుగుపెట్టడం ఖాయమనే చెప్పొచ్చు.



# హర్మన్‌ప్రీత్ ఖాతాలో మరో వరల్డ్ రికార్డు

**బలగం టీవీ, న్యూఢిల్లీ**



క్రికెట్ అంటేనే ఇండియా పేరు మార్మోగిపోతోంది. అది ఏ ఫార్మెట్ కాని.. రికార్డులు తిరగరాస్తున్నారు. భారత మెన్ క్రికెట్ జట్టుతో సమానంగా విమెన్ క్రికెట్ జట్టు కూడా పటిష్టంగానే ఉంది. ఇక భారత మహిళా క్రికెట్ జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ ప్రపంచ రికార్డు సృష్టించింది. అంతర్జాతీయ క్రికెట్‌లో అత్యధిక మ్యాచ్‌లు ఆడిన క్రీడాకారిణిగా హర్మన్‌ప్రీత్ కౌర్ సరికొత్త చరిత్ర లిఖించారు. ఇప్పటి వరకు న్యూజిలాండ్ క్రీడాకారిణి సుజీ బేట్స్ (367 మ్యాచ్‌లు) ఆడి టాప్ ప్లేసులో ఉండగా.. ఇంగ్లండ్‌లోని టాంటన్‌లో మంగళవారం జరిగిన మూడో టీ20 మ్యాచ్ తర్వాత హర్మన్‌ప్రీత్ కౌర్ కెరీర్‌లో 368వ అంతర్జాతీయ మ్యాచ్ పూర్తి చేసుకుంది. దీంతో న్యూజిలాండ్ ప్లేయర్ పేరుతో ఉన్న రికార్డును అధిగమించారు. ఈ జాబితాలో సుజీ బేట్స్ రెండో స్థానంలో ఉండగా ఆస్ట్రేలియాకు చెందిన ఎల్లీస్ పెర్రీ (357 మ్యాచ్‌లు) మూడో స్థానంలో కొనసాగుతున్నారు. 2009లో అంతర్జాతీయ అరంగేట్రం చేసిన 37 ఏళ్ల హర్మన్‌ప్రీత్ పంజాబ్‌కు చెందిన ఆల్‌రౌండర్. ప్రస్తుతం విమెన్ టీమిండియా జట్టు సారధిగా ఉంది. ఇప్పటివరకు 7 టెస్టులు, 164 వన్డేలు, 197 టీ20 మ్యాచ్‌లు ఆడారు. ఇంగ్లండ్‌తో జరిగిన టీ20 సిరీస్‌ను భారత్ 1-2 తేడాతో కోల్పోయినప్పటికీ నిర్ణయాత్మకమైన ఆఖరి మ్యాచ్‌లో హర్మన్‌ప్రీత్ హాఫ్ సెంచరీతో రాణించడం విశేషం. 2025లో భారత జట్టుకు తొలిసారిగా మహిళల ప్రపంచకప్ అందించిన కెప్టెన్‌గా హర్మన్‌ప్రీత్ అరుదైన ఖ్యాతిని సొంతం చేసుకుంది. అంతే కాదు విమెన్స్ ప్రీమియర్ లీగ్‌లో ముంబై ఇండియన్స్‌కు పలు టైటిళ్లు సాధించిపెట్టిన భారత మహిళల క్రికెట్ సారధిగా ఆమెకు మంచి గుర్తింపు ఉంది. ఇక ఆట పరంగా చూసుకుంటే కూడా కౌర్ బ్యాటింగ్, బౌలింగ్ తో పాటు కెప్టెన్సీని కూడా సమర్ధవంతంగా పోషిస్తూ ఆల్‌రౌండర్ ప్రతిభను చాటుకుంటోంది. హర్మన్‌ప్రీత్ కౌర్ అరుదైన ఘనత సాధించడంపై సహచర క్రీడాకారులు, జట్టు ప్రధాన కోచ్ అభినందనలు తెలిపారు. మహిళల క్రికెట్‌లో అంతర్జాతీయ మ్యాచ్‌ల సంఖ్య పెరుగుతున్న ఈ రోజుల్లో ఆమె స్థిరత్వం, అంకితభావానికి ఈ రికార్డు నిదర్శనమని క్రీడా వర్గాలు ప్రశంసిస్తున్నాయి.

# స్వగ్రామం చేరుకున్న వైభవ్..

**బలగం టీవీ, హైదరాబాద్**

ఐపీఎల్ 2026లో సంచలనం సృష్టించిన తర్వాత, వైభవ్ సూర్యవంశీ బీహార్‌లోని తన స్వగ్రామానికి చేరుకున్నాడు. ఈ వార్త తెలియగానే 15 ఏళ్ల ఈ సూపర్‌స్టార్‌ను కలవడానికి జనం గుంపులు గుంపులుగా తరలివచ్చారు. సమస్తిపూర్‌లోని వైభవ్ స్వగ్రామమైన తాజ్‌పూర్‌లో అతనికి ఘన స్వాగతం లభించింది.ఇప్పుడు వైభవ్‌ను కలవడానికి, సెల్ఫీలు తీసుకోవడానికి ప్రతిరోజూ పెద్ద సంఖ్యలో ప్రజలు వస్తున్నారు. ఇప్పటికే అతని ఇంటి బయట జనం గుమిగూడటం మొదలైంది. వైభవ్ కుటుంబ సభ్యులతో పాటు బంధువులతో అతని ఇల్లు సందడిగా మారితే.. ఇంటి ముందు అభిమానులు, స్థానికులతో కోలాహలంగా మారింది.చుట్టుపక్కల గ్రామాలు, పట్టణాల నుండి ప్రజలు వైభవ్‌ను కలవడానికి వస్తున్నారు. కానీ అందరూ అతనికి దగ్గర కాలేకపోతున్నారు. వైభవ్ కేవలం కొద్దిమందిని మాత్రమే కలుస్తున్నాడు. అతని ఇంటి బయట చిన్న యూట్యూబర్లు, స్థానిక మీడియా ప్రతినిధులు గుంపుగా కనిపిస్తున్నారు. గత ఒకటి రెండు రోజులుగా సూర్యవంశీ కుటుంబం కూడా మీడియాకు దూరంగా ఉంటోంది. ఐపీఎల్‌లో సంచలనం సృష్టించిన తర్వాత వైభవ్ సూర్యవంశీ తాను ఈ టోర్నీలో గెలుచుకున్న పథకాలు, షీల్డులతో స్వగ్రామమైన సమస్తిపూర్‌లోని తన స్వగ్రామమైన తాజ్‌పూర్‌కి తిరిగి వచ్చాడు.స్థానిక క్రికెటర్లు, జిల్లా స్థాయి క్రికెటర్లు కూడా అతన్ని కలిసేందుకు క్యూ కట్టారు.తల్లిదండ్రుల కృషి ఫలితమే వైభవ్వైభవ్ విజయంలో అతని తల్లిదండ్రులు కీలక పాత్ర పోషించారు. వైభవ్ కేవలం నాలుగేళ్ల వయసులోనే తన తండ్రి సంజు పర్యవేక్షణలో క్రికెట్ శిక్షణ ప్రారంభించాడు. అతని తండ్రి ప్రతిరోజూ తెల్లవారుజామున 4 గంటల బస్సులో వైభవ్‌ను శిక్షణ కోసం పాట్నాకు తీసుకువెళ్లేవారు, అదే సమయంలో అతని తల్లి ఆర్తి సూర్యవంశీ తెల్లవారుజామున 2 గంటలకే నిద్రలేచి అతనికి మధ్యాహ్న భోజనం సిద్ధం చేసేవారు.ఈ యంగ్ ప్లేయర్ ఇంత పిన్నవయసులోనే ప్రపంచ రికార్డులు నెలకోల్పే క్రికెటర్ కావడం వెనుక క్రమశిక్షణ, కఠోర శ్రమ ఉందనే చెప్పాలి. వైభవ్ చాలా చిన్న వయస్సు నుండే తన వయసుకు రెట్టింపు వయసున్న ఆటగాళ్ల వేగవంతమైన బంతులను నిర్భయంగా ఎదుర్కొని భారీ సిక్సర్లు కొట్టాడు. వైభవ్ సూర్యవంశీ అన్నదమ్ములు ముగ్గురు. ముగ్గురు సోదరులలో వైభవ్ మధ్యవాడు. ఐపీఎల్ 2026లో 776 పరుగులు..ఐపీఎల్ 2025 వేలంలో రాజస్థాన్ రాయల్స్ వైభవ్ సూర్యవంశీని రూ.1 కోటి 10 లక్షలకు కొనుగోలు చేసినప్పుడు అతని వయస్సు కేవలం 14 సంవత్సరాలు. ఈ యువ క్రికెటర్ తన తొలి సీజన్‌లోని మూడో మ్యాచ్‌లోనే సెంచరీ చేసి ప్రపంచ దృష్టిని ఆకర్షించాడు. ఇప్పుడు ఐపీఎల్ 2026లో 16 ఇన్నింగ్స్‌లలో 776 పరుగులు చేసి, ఆరెంజ్ క్యాప్ గెలుచుకున్న అతి పిన్న వయస్కుడైన ఆటగాడిగా నిలిచాడు.



# వైభవ్ పై మనసుపారేసుకున్న రిద్ధిమా పాఠక్..!

**బలగం టీవీ, హైదరాబాద్**



ఐపీఎల్ సమరంలో విరోచితమైన ఆట తీరు ప్రదర్శించి వరల్డ్ వైడ్‌గా ఫేమస్ అయిన 15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ తన నిర్భయమైన బ్యాటింగ్‌తో అందరినీ ఆకట్టుకున్నాడు. వైభవ్ సాధించిన విజయాలు దేశీయంగా, అంతర్జాతీయంగా అన్నిచోట్లా ప్రశంసలు అందుకుంటున్నాయి. ఇటీవల, 2026 ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో ఆరెంజ్ క్యాప్ గెలుచుకున్న అతి పిన్న వయస్కుడైన ఆటగాడిగా వైభవ్ నిలిచాడు.రాజస్థాన్ రాయల్స్ తరపున ఆడిన వైభవ్ 16 మ్యాచ్‌లలో ఐదు అర్ధశతకాలు, ఒక శతకంతో సహా 776 పరుగులు సాధించాడు. స్పోర్ట్స్ యాంకర్ రిద్ధిమా పాఠక్ వైభవ్ అద్భుత ప్రదర్శనను ప్రశంసిస్తూ, అతడిని బీహార్ అతిపెద్ద బ్రాండ్ అంబాసిడర్ అని అభివర్ణించారు. దీనికి సంబంధిన వీడియోని కూడా ఇన్‌స్టాలో పోస్ట్ చేయడంతో వైరల్ అవుతోంది.వైభవ్ సూర్యవంశీ బీహార్‌లోని సమస్తిపూర్ జిల్లా తాజ్‌పూర్ గ్రామానికి చెందినవాడు. అతను బీహార్ తరపున దేశీయ క్రికెట్ ఆడతాడు. అయితే ఈసారి ఐపీఎల్‌లో తన విజృంభణ చూపించడంతో పిల్లాడు కాస్తా క్రికెట్ పిడుగు అంటూ పొగడ్తలతో ముంచెత్తారు. క్రికెట్ లెడెండ్స్, సెలబ్రిటీలు సైతం ఈ కుర్రాడి ఆటతీరు, రికార్డులు బద్దలు కొట్టడంపై స్పందించారు. బీహార్‌కు అంతర్జాతీయంగా కీర్తిని తెచ్చిపెట్టిన వైభవ్ గురించి తన ఇన్‌స్టాగ్రామ్ వీడియోలో రిద్ధిమా పాఠక్ ఇంట్రెస్టింగ్ కామెంట్ చేశారు. చిన్నప్పుడు స్కూల్లోనూ, కాలేజీలోనూ 'మీరు ఎక్కడి నుండి వచ్చారు?' అని మమ్మల్ని అడిగినప్పుడు, మేము బీహార్ వాసులమని చెప్పడానికి సంకోచించేవాళ్ళమని కాని ఇప్పుడు గర్వంగా ఉందని చెప్పుకొచ్చింది. ఎందుకంటే లాలూ ప్రసాద్ యాదవ్ బీహార్‌కు అలాంటి ఇమేజ్ ఏదీ ఇవ్వలేదు. కానీ ఆ తర్వాత రెండు అద్భుతమైన విషయాలు జరిగాయి. మొదటిది మహేంద్ర సింగ్ ధోని, రెండవది, 'గ్యాంగ్స్ ఆఫ్ వాస్సేపూర్' సినిమా. ఈ రెండూ బీహారీలలో కొంత ఉత్సాహాన్ని నింపాయి.కానీ దీని వల్ల వచ్చిన మంచి ప్రచారం మొత్తం బీహార్ నుండి విడిపోయి కొత్త రాష్ట్రంగా ఏర్పడిన జార్ఖండ్‌కు చేరిందని పాఠక్ తెలిపారు. అయితే ఇప్పుడు ముందుకు వచ్చిన వ్యక్తి వైభవ్ సూర్యవంశీ. అతను పూర్తిస్థాయి బీహారీ. ఇప్పుడు తాను బీహారీ అని చెప్పుకోవడానికి ఏ బీహారీ కూడా సిగ్గుపడటం లేదని గర్వపడుతున్నామని చెప్పుకొచ్చింది. ఆమె మాటల్లో ఆనందం, ముఖంలో గర్వం చూస్తుంటే వైభవ్ సూర్యవంశీని విపరీతంగా అభిమానిస్తున్నట్లుగా కనిపిస్తోంది. స్పోర్ట్స్ యాంకర్ రిధిమా పాఠక్ ఎవరు..?రిధిమా పాఠక్ స్వస్థలం జార్ఖండ్. ఆమె తండ్రి పేరు సురేష్ కుమార్ పాఠక్, ఆయన సైన్యంలో పనిచేశారు. రిధిమా ఒక సుప్రసిద్ధ స్పోర్ట్స్ యాంకర్ , ప్రజెంటర్. ఆమె అనేక ఐసీసీ ఈవెంట్లలో యాంకరింగ్ చేస్తూ కనిపించారు.ఆమె విద్య విషయానికి వస్తే రిధిమా రాంచీలో ప్రాథమిక విద్యను పూర్తి చేసి, ఆ తర్వాత పూణే నుండి ఎలక్ట్రానిక్స్ , టెలికమ్యూనికేషన్స్‌లో ఇంజనీరింగ్ డిగ్రీని పొందారు. అయితే సోషల్ మీడియాలో చాలా యాక్టివ్‌గా ఉండే రిధిమా పాఠక్ సెలబ్రిటీలతో జరిపిన ఇంటర్వ్యూలు, ఫోటోలు ఇప్పుడు వైరల్ అవుతున్నాయి.స్పోర్ట్స్ యాంకర్ కాకముందు ఆమె ఒక కార్పొరేట్ ఉద్యోగంలో చేశారు. కానీ క్రీడలపై ఆమెకున్న అభిరుచి ఆమెను మీడియా పరిశ్రమలోకి నడిపించింది. ఆమె తన కెరీర్‌ను రేడియో జాకీ , వాయిస్-ఓవర్ ఆర్టిస్ట్‌గా ప్రారంభించి ఆ తర్వాత టీవీలో స్పోర్ట్స్ యాంకర్‌గా పేరు పొందారు. ధిమా పాఠక్ బీహారిలకు ఇప్పుడు వైభవ్ సూర్యవంశీ రోల్ మోడల్ అంటూ చెప్పడంతో నెట్టింట్లో కామెంట్స్ వైరల్ అవుతున్నాయి. ఈ పిల్లాడిపై యాంకరమ్మ మనసు పారేసుకుంది ఏంటని కామెంట్స్ చేస్తున్నారు. ఇక వీడియోపై కూడా లైక్స్ , కామెంట్స్ వస్తున్నాయి.ఎంత స్పోర్ట్స్ ఛానల్ యాంకర్ అయినప్పటికి .. ఇప్పటి వరకు రిధిమా పాఠక్ చాలా తక్కువ మందికి మాత్రమే తెలుసు. కాని ఇప్పుడు ఆమె తాను బీహారినే అని.. యంగ్ క్రికెటర్ వైభవ్ సూర్యవంశీ కూడా బీహారినే అని చెప్పడం చూస్తుంటే క్రికెట్‌లో మా ఆటగాళ్లు తోపులే అని చెప్పినట్లుగా ఉందని క్రికెట్ అభిమానులు చెప్పుకుంటున్నారు.

# సోషల్ మీడియాలో 'పెద్ది' మేనియా

**'బుక్ మై షో'లో గంటకు 40వేల టికెట్స్ బుక్**

**బలగం టీవి, హైదరాబాద్**

ప్రస్తుతం సోషల్ మీడియాలో 'పెద్ది' మేనియా కనిపిస్తోంది. భారీ అంచనాల మధ్య విడుదలైన ఈ సినిమా వాటిని అందుకొని హిట్ టాక్‌ను సొంతం చేసుకుంది. రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా గురువారం ప్రేక్షకుల ముందుకువచ్చిన విషయం తెలిసిందే. రిలీజ్‌కు ముందు నుంచే టికెట్ బుకింగ్స్‌లో జోరు చూపిన చిత్రం విడుదల అనంతరం కూడా అదే కొనసాగిస్తోంది. ప్రముఖ టికెట్ బుకింగ్ యాప్ 'బుక్ మై షో'లో 'పెద్ది'కు గంటకు 40వేల టికెట్స్ బుక్ అవుతున్నాయి. 2023లో బుక్‌మై షో ప్రవేశపెట్టిన 'అవర్లీ ట్రెండింగ్' ఫీచర్ తర్వాత.. ఈ 40 వేల మార్క్‌ను దాటిన చిత్రాల జాబితాలో ఇప్పటివరకు మూడు సినిమాలు మాత్రమే ఉన్నాయి. కల్కి 2898 ఏడీ, సలార్, పుష్ప తర్వాత స్థానంలో 'పెద్ది' నిలిచింది. మొదటిరోజే ఈ మార్క్‌ను చేరుకొని రికార్డు సృష్టించింది. కర్ణాటకలో జరిగిన ప్రీమియర్ షోల ద్వారా 'పెద్ది' భారీ వసూళ్లను సాధించి, టాలీవుడ్‌లోని పలు అగ్రహీరోల చిత్రాల రికార్డులను తిరగరాసింది. ప్రీమియర్స్‌లో రూ.3.2 కోట్లు వసూలు చేసినట్లు సినీ వర్గాలు తెలిపాయి. దీంతో అక్కడ ప్రీమియర్ కలెక్షన్స్ సాధించిన మొదటి తెలుగు సినిమాగా నిలిచింది. గతంలో విడుదలైన 'ఓజీ' (రూ.2.72 కోట్లు), 'రాజా సాబ్' (రూ.2.61 కోట్లు), పుష్ప 2 (రూ.2.55 కోట్లు) తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. రామ్‌చరణ్‌కు జోడీగా జాన్వీకపూర్ నటించిన ఈ సినిమాలో




పాటలు కూడా సూపర్ హిట్‌గా నిలిచాయి. ముఖ్యంగా 'చికిరి చికిరి' పాట విడుదలైన రెండు వారాలకే 10 కోట్లకు పైగా వ్యూస్‌తో ట్రెండింగ్‌లో నిలిచింది. అయితే, ఈ పాట లిరిక్స్‌లో 'సరుకూ సామాన్లు' అనే పదంపై కొందరు అభ్యంతరం వ్యక్తం చేయడంతో టీమ్ ఈ పదాన్ని మార్చినట్లు తెలుస్తోంది. థియేటర్లలో దీనికి బదులుగా 'సొగసు సింగారం' అని చేర్చారని నెటిజన్లు పోస్ట్‌లు పెడుతున్నారు. ఈ స్పోర్ట్స్ డ్రామాకు ఏఆర్ రెహమాన్ సంగీతం హైలైట్‌గా నిలిచింది

# నా మనసంతా పెద్ది చుట్టే తిరుగుతోంది

**పొలాచ్చి లో ఉండిపోవడంతో రాలేక పోయా**

**పెద్ది విజయంపై చిరంజీవి అభినందనలు**

**బలగం టీవి, హైదరాబాద్**



తాను షుటింగ్ నిమిత్తం పొల్లాచిలో ఉన్నా తన మనసంతా 'పెద్ది' దగ్గరే ఉందని అగ్ర కథానాయకుడు చిరంజీవి అన్నారు. రామ్ చరణ్ హీరోగా తెరకెక్కిన 'పెద్ది' నేడు ప్రేక్షకుల ముందుకువచ్చి విజయాన్ని సొంతం చేసుకుంది. దీంతో ఒక తండ్రిగా, నటుడిగా తనకెంతో గర్వంగా ఉందంటూ చిరంజీవి పోస్ట్ పెట్టారు. ఈసందర్భంగా చిత్రబృందాన్ని అభినందించారు. నేను షుటింగ్ నిమిత్తం పొల్లాచిలో ఉన్నా కూడా నా మనసంతా 'పెద్ది' దగ్గరే ఉంది. గత రెండేళ్లుగా ఈ సినిమా కోసం చరణ్ పడిన కష్టం, పెట్టిన శ్రద్దాసక్తులు అన్నీ దగ్గర నుంచి చూశాను. ఈ రోజు ప్రేక్షకుల ప్రేమ, ప్రశంసలు చూస్తుంటే ఒక తండ్రిగా మాత్రమే కాదు, ఒక నటుడిగా కూడా ఎంతో గర్వంగా అనిపిస్తోంది. 'పెద్ది' పాత్రలో పూర్తిగా లీనం కావడానికి తను అహర్నిశలు చేసిన కృషి, పట్టుదల, నిజాయతీ ప్రతి సన్నివేశంలో స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఆ కష్టానికి దక్కిన ప్రతిఫలమే ఈ విజయం అని రామ్ చరణ్‌ను చిరంజీవి ప్రశంసించారు. ఇలాంటి అద్భుతమైన కథను రాసి, అంతే అద్భుతంగా తెరపై ఆవిష్కరించిన దర్శకుడు బుచ్చిబాబుకు ప్రత్యేక అభినందనలు. అలాగే తన తొలి చిత్రాన్నే ఇంత భారీ స్థాయిలో, ఎలాంటి రాజీ లేకుండా నిర్మించిన నిర్మాత వెంకట సతీశ్ కిలారుకు హృదయపూర్వక శుభాకాంక్షలు. ఈ ప్రతిష్టాత్మక చిత్రంలో నటించిన నా మిత్రుడు, 'కరునాడ చక్రవర్తి' శివరాజ్ కుమార్‌కు, అప్పలసూరి పాత్రలో అద్భుతంగా జీవించిన నా సోదర సమానుడు జగపతిబాబుకు అభినందనలు. అద్భుతమైన పాటలు, హృదయాన్ని కదిలించేలా నేపథ్య సంగీతాన్ని అందించిన ఏఆర్ రెహమాన్‌కు ప్రత్యేక అభినందనలు. ఈ సినిమా విజయంలో భాగమైన జాన్వీ కపూర్ , దివ్యేందుతో పాటు సాంకేతిక నిపుణులందరికీ కంగ్రాట్స్..' అంటూ చిత్రబృందాన్ని అభినందించారు. 'పెద్ది' సాధించిన ఈ ఘన విజయం తెలుగు సినిమాకి గర్వంగా నిలవాలని, మరెన్నో మైలురాళ్లు అధిరోహించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు తెలిపారు.

# త్వరలోనే ఇరుముడి థీమ్ సాంగ్ విడుదల







**బలగం టీవి, హైదరాబాద్**

మాస్ మహారాజా రవితేజ, డైరెక్టర్ శివ నిర్వాణ కాంబినేషన్‌లో రూపుదిద్దుకుంటున్న మోస్ట్ అవేటెడ్ ప్రాజెక్ట్ 'ఇరుముడి' నుంచి అభిమానులు ఎంతగానో ఎదురుచూస్తున్న ఒక సాలిడ్ అప్‌డేట్ వచ్చేసింది. ఇప్పటికే ఈ మూవీ నుంచి గ్లింప్స్‌ను విడుదల చేయగా.. ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంటుంది. అయితే తాజాగా ఈ సినిమా నుంచి ఒక ప్రత్యేకమైన సాంగ్ అప్‌డేట్‌ను మేకర్స్ సోషల్ మీడియా వేదికగా అధికారికంగా పంచుకున్నారు. గత కొన్ని రోజులుగా అభిమానుల నుంచి వస్తున్న భారీ రిక్వెస్ట్‌లను పరిగణనలోకి తీసుకుని, ఈ సినిమాకు సంబంధించిన పవర్‌ఫుల్ 'ఇరుముడి' థీమ్ సాంగ్‌ను త్వరలోనే విడుదల చేయబోతున్నట్లు చిత్ర బృందం ప్రకటించింది. ఈ పాట 'విల్లాది వీరుడు వీర మణికంఠుడు' అనే పవర్‌ఫుల్ అయ్యప్ప స్వామి భక్తి గీతంగా ఉండబోతోందని తెలుస్తుంది. ఇటీవల విడుదలైన ఈ సినిమా గ్లింప్స్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకోగా, ఇందులో రవితేజ ఒక ఎమోషనల్ తండ్రి పాత్రలో సరికొత్త లుక్‌లో కనిపించబోతున్నారు. కూతురి కోసం ఒక తండ్రి పడే తపన, మద్యపానానికి దూరమై అయ్యప్ప దీక్ష స్వీకరించి ఆధ్యాత్మిక మార్గంలో సాగే ఒక ఎమోషనల్ అండ్ యాక్షన్ డ్రామాగా ఈ సినిమా కథాంశం ఉండబోతోంది. ఈ చిత్రంలో రవితేజ సరసన ప్రియా భవానీ శంకర్ నటిస్తుండగా, బేబీ నక్షత్ర రవితేజ కూతురిగా కీలక పాత్ర పోషిస్తోంది. స్టార్ మ్యూజిక్ డైరెక్టర్ జి.వి. ప్రకాష్ కుమార్ ఈ చిత్రానికి అద్భుతమైన సంగీతాన్ని అందిస్తున్నారు. నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్న ఈ భారీ చిత్రం ఆగస్టులో థియేటర్లలోకి రానుంది.



# పెద్ది థియేటర్‌లో ఉపాసన హంగామా

**బలగం టీవి, హైదరాబాద్**

తన ఆటలతో అభిమానులకు ఫుల్ ట్రీట్ ఇచ్చాడు రామ్ చరణ్. ఆయన హీరోగా బుచ్చిబాబు దర్శకత్వంలో తెరకెక్కిన 'పెద్ది' థియేటర్లలో సందడి చేస్తోంది. ఈ చిత్రం ప్రీమియర్స్‌లో రామ్ చరణ్ భార్య ఉపాసన ఎంజాయ్ చేశారు. హైదరాబాద్ బాలానగర్‌లో స్పెషల్ స్క్రీనింగ్‌కు వచ్చిన ఉపాసన , అభిమానుల మధ్య సినిమా చూసి వారిలో ఉత్సాహం నింపారు. రామ్ చరణ్ ఎంట్రీ సమయంలో పేపర్లు ఎగరేసి జోష్ పెంచారు. ఫ్యాన్స్‌తో పాటు ఆమె కూడా ఉత్సాహంగా అరుస్తూ కనిపించారు. ప్రస్తుతం ఈ వీడియోలు వైరల్ అవుతున్నాయి. ఇక పెద్ది హిట్ టాక్ రావడంతో థియేటర్ల వద్ద పండగ వాతావారణం నెలకొంది. రామ్ చరణ్ నటనను ప్రశంసిస్తూ సెలబ్రిటీలు పోస్ట్‌లు పెడుతున్నారు. కష్టానికి తగిన ప్రతిఫలం దక్కిందంటూ అభినందిస్తున్నారు.

# ప్రశాంత్ నీల్‌కు ఎన్టీఆర్ బర్త్‌డే విషెస్

**బలగం టీవి, హైదరాబాద్**

ఇండియన్ స్టార్ డైరెక్టర్ ప్రశాంత్ నీల్ పుట్టినరోజు సందర్భంగా అగ్ర కథానాయకుడు జూనియర్ ఎన్టీఆర్ సోషల్ మీడియా వేదికగా ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. ప్రశాంత్ నీల్‌తో ఉన్న సాన్నిహిత్యాన్ని, అలాగే వీరిద్దరి కాంబినేషన్‌లో రాబోయే డ్రాగన్ సినిమాను గుర్తుచేస్తూ.. ఎన్టీఆర్ పెట్టిన పోస్ట్ ఇప్పుడు నెట్టింట వైరల్‌గా మారింది. ఈ ట్వీట్‌లో ఎన్టీఆర్ స్పందిస్తూ.. 'పుట్టినరోజు శుభాకాంక్షలు డైరెక్టర్ గారూ.. మీరు చెప్పే కథలంత గొప్పగా ఈ ఏడాది మీకు సాగాలని కోరుకుంటున్నాను. మన కాంబినేషన్‌లో రాబోయే ప్రాజెక్ట్ కోసం, మన భవిష్యత్తు ప్రయాణం కోసం నేను ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను ప్రశాంత్ అంటూ ఎన్టీఆర్ రాసుకొచ్చారు. ఈ పోస్ట్‌లో ప్రశాంత్ నీల్‌ను ఉద్దేశించి ఎన్టీఆర్ కన్నడ పదం 'అవరే' (గారూ) అని సంబోధించడం ఇరు భాషల అభిమానులను విశేషంగా ఆకట్టుకుంటోంది. 'కేజీఎఫ్', 'సలార్' వంటి ఇండస్ట్రీ హిట్ చిత్రాలతో సంచలనం సృష్టించిన ప్రశాంత్ నీల్, ఎన్టీఆర్ కాంబినేషన్‌లో రాబోయే భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ డ్రాగన్ పై ఇప్పటికే భారీ అంచనాలు ఉన్నాయి. ఈ చిత్రం జూన్ 11న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది.






# శ్రీవారిని దర్శించుకున్న జాన్వీకపూర్

**బలగం టీవి, హైదరాబాద్**

తిరుమల శ్రీవారిని సినీ నటి జాన్వీ కపూర్ దర్శించుకున్నారు. బుధవారం అలిపిరి మెట్ల మార్గం ద్వారా తిరుమలకు చేరుకున్న జాన్వీ.. గురువారం ఉదయం నటి మహేశ్వరితో కలసి స్వామివారి సేవలో పాల్గొన్నారు. అంతకుముందు తితిదే అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శన అనంతరం రంగనాయకుల మండపంలో పండితులు వారికి ఆశీర్వచనం చేసి స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. జాన్వీ కపూర్, రామ్‌చరణ్ జంటగా నటించిన 'పెద్ది' ఇవాళ విడుదలైన విషయం తెలిసిందే.

# దురంధర్ విజయంపై అంబానీ హర్షం



**మూవీ విజయంపై అంబానీ హర్షం**

**బలగం టీవి, హైదరాబాద్**

బాలీవుడ్ నటుడు రణ్‌వీర్ సింగ్ హీరోగా జియో స్టూడియోస్ నిర్మించిన 'ధురంధర్' ఫ్రాంచైజీ బాక్సాఫీస్ వద్ద సరికొత్త రికార్డులను సృష్టించిన విషయం తెలిసిందే. ఈ చిత్రం సాధించిన అసాధారణ విజయంపై రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేశ్ అంబానీ హర్షం వ్యక్తంచేశారు. జియో స్టూడియోస్ సాధించిన విజయాలను అభినందిస్తూ లేఖ రాశారు. 2024లో 'స్త్రీ 2', 2025లో 'ధురంధర్', 2026లో 'ధురంధర్: ది రివెంజ్' చిత్రాలతో జియో స్టూడియోస్ వరుసగా మూడేళ్లపాటు అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రాలను అందించి ఒక అరుదైన మైలురాయిని అందుకుంది. 2025–26 ఆర్థిక సంవత్సరంలో జియో స్టూడియోస్ విడుదల చేసిన స్పై యాక్షన్ థ్రిల్లర్స్ 'ధురంధర్', 'ధురంధర్: ది రివెంజ్' బాక్సాఫీస్ కలెక్షన్లలోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ఆదరణలో సరికొత్త బెంచ్‌మార్క్‌లను క్రియేట్ చేశాయి' అని లేఖలో పేర్కొన్నారు. ఈ సిరీస్‌లో వచ్చిన మొదటి భాగం, భారతీయ సినిమా చరిత్రలోనే అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రాలలో ఒకటిగా నిలిచి సరికొత్త రికార్డు సృష్టించిందని ముకేశ్ అంబానీ తెలిపారు. థియేటర్లలో 15 వారాల పాటు హౌస్‌ఫుల్ బోర్డులు కనిపించాయన్నారు. ఆ తర్వాత భారీ అంచనాల మధ్య విడుదలైన రెండో భాగం.. మొదటి సినిమా నెలకొల్పిన రికార్డులన్నింటినీ బద్దలు కొట్టిందని తెలిపారు. ఇది తిరుగులేని విజయమని వ్యాఖ్యానించారు. ఈ సినిమాలు రూ.3000 కోట్లకు పైగా వసూళ్లు సాధించి.. మొత్తం దేశ థియేట్రికల్ ఆదాయంలో 40శాతం వాటాను దక్కించుకున్నాయని ప్రశంసించారు.

# వైభవ్‌పై లలిత్ మోదీ ప్రశంసలు!

**బలగం టీవి, హైదరాబాద్**




2026 ఐపీఎల్ ముగిసినా 15ఏళ్ల కుర్రాడు వైభవ్ సూర్యవంశీ గురించి మాత్రం ఇంకా మాట్లాడుకుంటూనే ఉన్నారు. అతడు సృష్టించిన విధ్వంసం అలాంటిది మరి. ఈ సీజన్?లో వైభవ్ అరుదైన రికార్డులు బ్రేక్ చేయడమే కాకుండా కొత్తవి సైతం నెలకొల్పాడు. దీంతో అతడిపై ఐపీఎల్ మాజీ ఛైర్మన్ లలిత్ మోదీ తాజాగా ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. వైభవ్ ఇలాగే ఆడితే అతడు బాలీవుడ్, హాలీవుడ్? స్టార్ల కంటే ఎత్తుకు ఎదుగుతాడని అన్నారు. ఈ మేరకు రీసెంట్?గా జాతీయ మీడియా ఏఎన్ఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నాడు. 'వైభవ్ ఆట చూసిన తర్వాత నేను ఈ మాట చెబుతున్నా, అతడు ఓ అద్భుతం! అతను ఇదే క్రమశిక్షణతో కొనసాగితే ప్రపంచంలోనే అత్యంత స్టార్?డమ్ సంపాదిస్తాడు. ఏ హాలీవుడ్ లేదా బాలీవుడ్ స్టార్? కంటే అయినా వైభవ్ ఎంతో ఎత్తుకు ఎదుగుతాడు. ఈ ప్రపంచంలోని మెస్సీ కంటే కూడా అతను గొప్పవాడవుతాడు. అతని బ్యాటింగ్ శైలిని, ఆ కుర్రాడిలో ఉన్న డేరింగ్?చూసిన తర్వాతే పూర్తి నమ్మకంతో నేను ఈ మాట చెబుతున్నాను. ఈ వయసులోనే అంతటి ఆత్మవిశ్వాసం ఉండడం నిజంగా ఓ మ్యాజిక్ !' అని లలిత్ మోదీ అన్నారు. ప్రస్తుతం ఐపీఎల్ అనేది పూర్తిగా అభిమానుల సొంతం అని లలిత్ అన్నారు. అలాగే సూర్యవంశీ లాంటి అనేకమంది టాలెంటెడ్ ఆటగాళ్లు ఐపీఎల్?తోనే ప్రపంచానికి పరిచయం అయ్యారని చెప్పారు. అంతర్జాతీయ క్రికెట్?లో పాత విధానాలు, ఆలోచనా ?ధోరణిని మార్చేసిన ఘనత ఐపీఎల్?కే దక్కుతుందని అన్నారు. 'ఐపీఎల్ ప్రారంభానికి ముందు టీమ్ఇండియా బెంచ్‌పై 20 మంది ఆటగాళ్లు ఉండేవారు. వాళ్లు 15 ఏళ్లపాటు అక్కడే కూర్చుండిపోయేవారు. కానీ ఈ రోజుల్లో ఐపీఎల్?తో ఎందరో ప్రతిభావంతులు పుట్టుకొస్తున్నారు. వాళ్లు నేరుగా జట్టులో స్థానం దక్కించుకుంటున్నారు. ప్రస్తుతం మన దేశంలో అనేకమంది అత్యుత్తమ ప్రతిభ కలిగిన క్రికెటర్లు ఉన్నారు. అందుకే ఐపీఎల్?లో మనకు ఫారిన్ ప్లేయర్ల అవసరం కూడా లేదు' అని లలిత్ పేర్కొన్నారు. గడిచిన 19ఏళ్లలో ఐపీఎల్?కు ప్రజాదరణ ఏటా పెరుగుతోంది. వ్యూవర్?షిప్, రేటింగ్స్ సీజన్- సీజన్?కూ పెరుగుతూ వస్తున్నాయి. ఇందుకు ప్రధాన కారణం కూడా కొత్త ఆటగాళ్లు రావడమే అని లలిత్ అన్నారు. 'నిస్సందేహంగా ఐపీఎల్? క్రికెట్ ఆటను మార్చేసింది. అందుకే ఈరోజు రేటింగ్స్? చూస్తున్నారు. ఆ రేటింగ్స్? ఎక్కడి నుంచి వస్తున్నాయో నేను పట్టించుకోను. కానీ ప్రేక్షకులు ఇవాళ ఐపీఎల్ చూస్తున్నారంటే వాళ్లు సూర్యవంశీ కోసమో, విరాట్ కోహ్లీ కోసమో వస్తున్న వాళ్లే' అని వ్యాఖ్యానించారు. ఈ సిరీస్?లో వైభవ్? పూర్తిగా డామినేషన్? ప్రదర్శించాడు. 16 మ్యాచ్?ల్లో 48 యావరేజ్?తో 776 పరుగులు బాదాడు. స్ట్రైక్ రేట్ 237.31గా నమోదు చేశాడు. 63 ఫోర్లు, 72 సిక్స్?లు ఉన్నాయి. ఒక సెంచరీ, ఐదు హాఫ్ సెంచరీలు నమోదు చేశాడు. రెండుసార్లు 90ంస్కోర్లలో ఔట్ అయ్యాడు. అయినప్పటికీ వైభవ్ ఈ సీజన్?లో అనేక రికార్డులు బ్రేక్ చేశాడు. ఆరెంజ్ క్యాప్ గెలుచుకున్న అతి పిన్న వయస్కుడిగా నిలిచాడు. దీంతో సహా మరో నాలుగు అవార్డులు కూడా అతడికే దక్కాయి.

# ధోనీ లేని లోటు స్పష్టంగా తెలిసింది

**బలగం టీవి, హైదరాబాద్**

ఐపీఎల్ 2026 సీజన్ లో మోస్ట్ పాపులర్ ఫ్రాంచైజీ చెన్నై సూపర్ కింగ్స్ కు తీవ్ర నిరాశే మిగిలింది. పాయింట్ల టేబుల్ లో ఎనిమిదో ప్లేస్ కే పరిమితమై ప్లే ఆఫ్స్ రేస్ నుంచి తప్పుకుంది. టోర్నమెంట్ లో సంజూ శాంసన్ లాంటి ప్లేయర్స్ సాలిడ్ పర్ఫార్మెన్స్ తో ఆశలు రేపినా, ఓవరాల్ గా 14 మ్యాచుల్లో 12 పాయింట్లు మాత్రమే సాధించగలిగింది. ఈ దారుణమైన ఫెయిల్యూర్ పై సీఎస్కే మాజీ ప్లేయర్ రవిచంద్రన్ అశ్విన్ తన యూట్యూబ్ ఛానెల్ లో సీరియస్ గా స్పందించాడు. సంజూ శాంసన్, అకీల్ హొసేన్, అన్షుల్ కాంబోజ్ ఎఫర్ట్స్ ను మెచ్చుకుంటూనే, మేనేజ్‌మెంట్ వేలం స్ట్రాటజీలను కంప్లీట్ గా మార్చాలని సూచించాడు. కోట్ల రూపాయలు పెట్టి తప్పుడు ప్లేయర్లను కొనడం వల్లే టీమ్ కాంబినేషన్ దెబ్బతిందని అశ్విన్ విశ్లేషించాడు. వేలం వ్యూహాలను పూర్తిగా మార్చాల్సిన అవసరం ఉందని చెప్పాడు. ఫైనల్ చేరిన రెండు టీమ్స్ వెంకటేష్ అయ్యర్, జేసన్ హోల్డర్ లను కేవలం రూ. 7 కోట్లకే దక్కించుకుని సక్సెస్ అయ్యాయని గుర్తు చేశాడు. ఒక్కొక్కరికి రూ. 14 కోట్లు చొప్పున భారీగా ఖర్చు పెట్టే కంటే, ఇలాంటి ఇద్దరు ప్లేయర్లను తీసుకుంటే యూత్, ఎక్స్‌పీరియన్స్ పర్ఫెక్ట్ గా కుదిరేదని అభిప్రాయపడ్డాడు. సీఎస్కే ప్లేయర్స్ ఒక టీమ్ లాగా కలవలేకపోయారని, వారికి సరైన రోల్ క్లారిటీ లేకపోవడం మైనస్ అయిందని స్పష్టం చేశాడు. ఇతర టీమ్స్ కు సీజన్ స్టార్ట్ అవ్వడానికి ముందే ఇంజూరీలు అయితే, సీఎస్కే కి మాత్రం మ్యాచ్ లు మొదలయ్యాక ప్లేయర్స్ గాయపడ్డారని అశ్విన్ గుర్తు చేశాడు. ఎంత ట్రై చేసినా ఆ ఇంజూరీల ప్రెజర్ నుంచి టీమ్ కోలుకోలేకపోయిందని అన్నాడు. అలాగే మ్యాచ్ లలో ప్లేయర్ల ఇన్సర్షన్ పాయింట్లు కూడా తప్పుగా ఇచ్చారని విమర్శించాడు. డెవాల్డ్ బ్రెవిస్, శివమ్ దూబే లాంటి వాళ్లను ఫినిషర్లుగా వాడటం చూస్తే టీమ్ మేనేజ్‌మెంట్ నిర్ణయాలు ఎంత ఏకపక్షంగా ఉన్నాయో అర్థమవుతోందని ఎండగట్టాడు. ఈ




లోపాల వల్లే క్వాలిఫై అవ్వడం ఇంపాజిబుల్ గా మారిందని స్పష్టం చేశాడు. మరోవైపు సీఎస్కే హెడ్ కోచ్ స్టీఫెన్ ఫ్లెమింగ్ ప్రెస్ కాన్ఫరెన్స్ లో మాట్లాడుతూ ఇంట్రెస్టింగ్ విషయాలు షేర్ చేశాడు. 44 ఏళ్ల లెజెండ్ ఎంఎస్ ధోనీ గాయాల వల్ల ఈ ఐపీఎల్ 2026 సీజన్ లో ఒక్క మ్యాచ్ కూడా ఆడలేకపోయాడు. అయినప్పటికీ టీమ్ పై అతడి ఇన్ ఫ్లుయెన్స్ చాలా ఎక్కువగా ఉందని కోచ్ చెప్పాడు. గ్రౌండ్ లో ఆడకపోయినా డ్రెస్సింగ్ రూమ్ లో ఉంటూ యంగ్ ప్లేయర్లకు గైడెన్స్ ఇవ్వడంలో, టీమ్ లో కంటిన్యూటీని మెయింటైన్ చేయడంలో ధోనీ కీలక పాత్ర పోషించాడని కొనియాడాడు. అతడి ప్రెజెన్స్ ఈ ఏడాది టీమ్ కు ఎంతో ఇంపార్టెంట్ గా నిలిచిందని స్పష్టం చేశాడు.